www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 10-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 296 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి రా. 12.47 తదుపరి విదియ; నక్షత్రం:ధనిష్ఠ రా. 8.35 తదుపరి శతభిషం; వర్జ్యం: రా. 2.54-4.18; దుర్ముహూర్తం: ఉ. 6.49-8.20; అమృతఘడియలు: ఉ. 11.26-12.51; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.11 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హాథీరాంజీ మఠం భూముల అమ్మకాలపై యథాతథ స్థితి

విచారణ పూర్తయ్యే వరకూ అమ్మడానికి వీల్లేదు: సుప్రీంకోర్టు

ఢిల్లీ నుంచి తిరుపతి వరకూ మఠం భూముల అన్యాక్రాంతం

దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలన్న ధర్మాసనం

ఆక్రమణల నుంచి కాపాడలేమన్న ఏపీ సర్కారుపై ఆగ్రహం

7



భారతరత్నం పీవీ

ఆర్థిక సంస్కరణల యుగకర్తకు అత్యున్నత పౌర పురస్కారం



మాజీ ప్రధాని చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కూ..

ఈ ఏడాది ఐదుగురికి భారతరత్న

సంస్కరణల సారథి.. సిసలైన భారత రత్నం

పీఠాధిపతి అవుదామనుకుంటే.. ప్రధాని

బహుభాషా కోవిదుడు.. ఎన్నింటికో ఆద్యుడు

ప్రజల జీవన నాణ్యత పెరుగుదల పీవీ చలవే

సాహితీమూర్తి.. పాములపర్తి నరసింహారావు

వ్యవసాయ కృషీ రత్నం.. స్వామినాథన్

అసలైన 'రైతు నాయకుడు' చరణ్‌సింగ్



చరణ్‌సింగ్



ఎంఎస్ స్వామినాథన్

> యద్యపి శుద్ధం, లోక విరుద్ధం, నాచరణీయం, నా కరణీయం
>
> ఆలోచన మంచిదైనప్పటికీ, ప్రజలు వ్యతిరేకిస్తే దానిని ఆచరించకూడదు. - పీవీ

పీవీ హయాం.. కొత్త ఆర్థిక శకానికి నాంది

దేశాన్ని ఆధునిక ఆర్థికశక్తిగా మలిచారు

భారత మార్కెట్ల తలుపులను తెరిచారు

మేధావి, రాజనీతిజ్ఞుడు: మోదీ

పీవీకి భారతరత్న.. స్వాగతిస్తున్నా: సోనియా

భారత్‌ను నిలబెట్టింది పీవీ సంస్కరణలే: బాబు

8

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశం నుంచి తొలిసారిగా భారతదేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టడమేగాక దేశానికి ఆర్థిక సంస్కరణల పథాన్ని వేసిన తెలుగుబిడ్డ పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. పీవీతోపాటు మరో మాజీ ప్రధాని, రైతు నేత చరణ్‌సింగ్, విఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, భారత హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్‌లకు కూడా

మిగతా 8వ పేజీలో...

తాతకు భారతరత్న.. ఆ వెంటనే పొత్తు.. బీజేపీతో నడిచేందుకు ఆర్ఎల్డీ అధినేత జయంత్ సై



నిస్సాంక రికార్డు 'డబుల్'

- శ్రీలంక విజయం
- ఒమర్జాయ్, నబీ శతకాలు వృథా
- అఫ్ఘానిస్థాన్‌తో తొలి వన్డే

పల్లెకెలె: శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిస్సాంక (139 బంతుల్లో 20 ఫోర్లు, 8 సిక్సర్లతో 210 నాటౌట్) చరిత్ర సృష్టించాడు. తమ దిగ్గజ క్రికెటర్లకు సాధ్యంకాని ఆటతీరుతో వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన తొలి శ్రీలంక బ్యాటర్‌గా నిలిచాడు. గతంలో జయసూర్య 189 పరుగులే లంక తరఫున అత్యధికం. ఓవరాల్‌గా ప్రపంచ క్రికెట్‌లో డబుల్ సాధించిన 13వ బ్యాటర్. అటు నిస్సాంక అజేయ ఆటతీరుతో అఫ్ఘానిస్థాన్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో లంక 42 రన్స్ తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు 50 ఓవర్లలో 3 వికెట్లకు 381 పరుగులు చేసింది. అఫ్ఘాన్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చూపిన నిస్సాంక తొలి వికెట్‌కు అవిష్క ఫెర్నాండో (88)తో కలిసి 182 పరుగులు, సమరవిక్రమ (45)తో మూడో వికెట్‌కు 71 బంతుల్లోనే 120 రన్స్ జత చేయడం విశేషం. ఆఖరి నాలుగు ఓవర్లలో నిస్సాంక ఐదు ఫోర్లు, మూడు సిక్సర్లు బాది 55 పరుగులు రాబట్టడంతో జట్టు భారీ స్కోరు అందుకుంది.

అఫ్ఘాన్ పోరాటం: 382 పరుగుల భారీ ఛేదనలో అఫ్ఘాన్ జట్టు గట్టిగానే పోరాడింది. 55/5 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును అజ్మతుల్లా ఒమర్జాయ్ (149 నాటౌట్), మహ్మద్ నబీ (136) శతకాలతో గట్టెక్కించే ప్రయత్నం చేశారు. అయితే విగతా బ్యాటర్లు విఫలమవడంతో చివరకు 50 ఓవర్లలో 6 వికెట్లకు 339 పరుగులు చేసి ఓడింది. ఆరో వికెట్‌కు నబీ, ఒమర్జాయ్ రికార్డు స్థాయిలో 242 పరుగులు జత చేశారు. మదుషన్‌కు నాలుగు వికెట్లు దక్కాయి.

3 వన్డేల్లో మూడో ఫాస్టెస్ట్ (136 బంతుల్లో) డబుల్ సెంచరీ చేసిన నిస్సాంక. టాప్-2లో ఇషాన్ (126 బంతుల్లో), మ్యాక్స్‌వెల్ (128 బంతుల్లో) ఉన్నారు.

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 50 ఓవర్లలో 381/3 (నిస్సాంక 210 నాటౌట్, ఫెర్నాండో 88, సమరవిక్రమ 45; ఫరీద్ 2/79).

అఫ్ఘానిస్థాన్: 50 ఓవర్లలో 339/6 (ఒమర్జాయ్ 149 నాటౌట్, నబీ 136; మదుషన్ 4/75, చమీర 2/55).

రాణించిన రికీ, శశికాంత్

ఆంధ్ర 236/4

విజయనగరం: కెప్టెన్ రికీ భుయ్ (90 బ్యాటింగ్), శశికాంత్ (72) అర్ధ శతకాలతో సత్తా చాటడంతో యూపీతో శుక్రవారం ప్రారంభమైన ఎలిట్ గ్రూప్ 'బి' రంజీ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 4వికెట్లకు 236 పరుగులు చేసింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఏపీ జట్టులో శశికాంత్, రికీ ఐదో వికెట్‌కు 57 పరుగులు జత చేశారు. శశికాంత్‌ను స్పిన్నర్ సౌరభ్ అవుట్ చేయగా..మొదటి రోజు ఆఖరికి భుయ్‌తోపాటు కరణ్ షిండే (45) క్రీజులో ఉన్నారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అభేద్యంగా 116 పరుగులు జోడించారు.

విరాట్ విషయంలో తప్పు చేశా..

డివిల్లీర్స్



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో విరాట్ కోహ్లీ ఆడకపోవడానికి.. అతడి భార్య రెండో బిడ్డకు జన్మనివ్వబోతుండడమే కారణమని దక్షిణాఫ్రికా మాజీ బ్యాటర్ ఏబీ డివిల్లీర్స్ ఇటీవల తెలిపాడు. దీంతో ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడమే కాకుండా అన్ని వైపుల నుంచి అతడికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అయితే ఈ మధ్యకాలంలో ఏం జరిగిందో, ఏమో కానీ డివిల్లీర్స్ ఇప్పుడు మాట మార్చాడు. అసలు తనకేమీ తెలీదని చెప్పాడు. 'విరాట్ విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చి ఘోరమైన తప్పు చేశాను. అది నిజం కాదు. అతడి జీవితంలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కుటుంబ కారణాలతో తను బ్రేక్ తీసుకోవడం అతడి హక్కు.' అని డివిల్లీర్స్ స్పష్టం చేశాడు.

ఈ ఒలింపిక్స్‌తో ఆటకు గుడ్‌బై



కింగ్‌స్టన్: జమైకా స్ప్రింట్ క్వీన్, మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ షెల్లీ అన్‌ఫ్రేజర్ ప్రైస్ ఈ ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పనుంది. ఈ విషయాన్ని షెల్లీనే స్వయంగా వెల్లడించింది. దిగ్గజ స్ప్రింటర్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న 37 ఏళ్ల షెల్లీ.. 2008, 2012 ఒలింపిక్స్‌లో 100 మీటర్ల టైటిల్ గెలిచింది. 2020 టోక్యో విశ్వక్రీడల్లో రిలేలో స్వర్ణం నెగ్గిన ఆమె.. కెరీర్‌లో ఓవరాల్‌గా 10 ప్రపంచ టైటిళ్లను ఖాతాలో వేసుకుంది. ఇందులో మూడింటిని 2017లో బాబు పుట్టాక నెగ్గడం విశేషం.



ఆమె వల్లే గొడవలు..

కొడుకుతో సంబంధాల్లేవు

జామ్‌నగర్: భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కుటుంబంలో విబేధాలు బయటపడ్డాయి. జడ్డూతో ప్రస్తుతం తమకెలాంటి సంబంధాలు లేవని, దీనికి అతడి భార్య రివాబానే కారణమంటూ తండ్రి అనిరుధ్ సింహ్ జడేజా ఆరోపించాడు. 'జడేజా భార్య రివాబా ఏం మాయ చేసిందో కానీ, పెళ్లైన 2-3 నెలలకే గొడవలు మొదలయ్యాయి. మేమంతా జామ్‌నగర్‌లోనే ఉంటున్నా వారు నన్ను పిలవరు, నేనూ వారిని పిలవను. ఆస్తులన్నీ ఆమె పేరిటే రాయించుకుంది. అంతా ఆమె సోదరులదే రాజ్యం. నా

కోడలిపై జడేజా తండ్రి అనిరుధ్ ఆరోపణ



కుమారుడిని క్రికెటర్‌గా తయారుచేసేందుకు ఎంతో కష్టపడ్డా. భుజాన 20 లీటర్ల పాల క్యాన్లను మోసుకుంటూ డబ్బులు సంపాదించా. అతడి చెల్లి కూడా తల్లిలాగా సేవలందించింది. ఆమెతోనూ జడేజాకు సంబంధాలు లేవు. ఐదేళ్లుగా మా మనవరాలిని కూడా చూడలేదు. అసలు తను క్రికెటర్ కాకపోయుంటే బావుండేదని అనిపిస్తుంటుంది' అని ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనిరుధ్ వాపోయాడు. కాగా, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో జామ్‌నగర్ నార్త్ నియోజకవర్గం నుంచి రివాబా బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందింది.

కట్టుకథలు: జడేజా

తన భార్యపై తండ్రి అనిరుధ్ అనవసర ఆరోపణలు చేస్తున్నాడని, ఆమె గౌరవానికి భంగం కలిగించే చర్యలు తగవని జడేజా పేర్కొన్నాడు. ఈమేరకు అతను సోషల్ మీడియాలో స్పందించాడు. 'పత్రికలో మా నాన్న చేసిన ఆరోపణలన్నీ అవాస్తవం. అవన్నీ ఏకపక్ష కథనాలు. నా భార్య వ్యక్తిత్వాన్ని కించపర్చడాన్ని ఏమాత్రం సహించను. నేనూ చాలా విషయాలు చెప్పగలను. కానీ వాటిని బహిరంగంగా వెల్లడించడం సరికాదు' అని జడ్డూ తెలిపాడు.



ఆడుదాం..ఆంధ్రా లొసుగులే నిండా!

- మ్యాట్‌లు లేకుండా మట్టిలోనే కబడ్డీ పోటీలు
- క్రీడాకారులకు అందని భోజనాలు
- ప్రైజ్ మనీ కోసం తప్పుడు ఆధార్ కార్డులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం...ఆంధ్రా' పోటీల్లో నిర్వాహకులు అందినంత బొక్కేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. క్రీడాకారులకు జాతీయ స్థాయి పోటీల్లో కూడా ఇవ్వనంత ప్రైజ్ మనీ ఇస్తున్నామని, అంతకంటే ఎక్కువ సదుపాయాలు కల్పిస్తున్నామని ప్రచారం చేసుకున్న నిర్వాహకులు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేయలేదు. ఆడుదాం..ఆంధ్రా ఫైనల్ పోటీలు విశాఖపట్నంలో శుక్రవారం మొదలయ్యాయి. ప్రారంభోత్సవానికి మంత్రి రోజా, శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హాజరయ్యారు. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి మూడు వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తమకు సరైన వసతులు లేవని, భోజనాలు కూడా అందరికీ అందడం లేదని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం రూ.120 కోట్లతో నిర్వహిస్తున్న ఈ పోటీలలో కబడ్డీ విజేతలకు రూ.5 లక్షల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్టు ప్రకటించింది. దాంతో ఈ సొమ్ము కోసం జిల్లాలలోని నిర్వాహకులు అడ్డదార్లు తొక్కారు. పక్క జిల్లాల వారిని తీసుకువచ్చి, తప్పుడు ఆధార్‌లు సృష్టించి ఆడించారు. కాకినాడ జిల్లాలో ఒక టీమ్ గెలిచిందని ప్రకటించి, వారికి బహుమతి కూడా ఇచ్చి పంపించేశారు. ఆ తరువాత ఆ టీమ్‌లో ఒకరు బయట వ్యక్తి ఉన్నారని ఆరోపిస్తూ కొత్తగా కిర్లంపూడి టీమ్‌కు బహుమతి ఇచ్చేశారు. అలాగే మరో జిల్లాలో బయటవారు వచ్చి ఆడుతున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ వద్ద మూడు రోజులు వరుసగా ఫిర్యాదు చేస్తే తప్ప చర్యలు తీసుకోలేదు.

మ్యాట్‌లు లేకుండా మట్టిలో కబడ్డీ: 'ఆడుదాం..ఆంధ్రా' పోటీలు జాతీయ స్థాయికి తగ్గకుండా ఉండాలని ప్రభుత్వం భారీగా నిధులు ఇస్తే వాటిని పక్కదోవ పట్టించి నచ్చినట్టు చేసుకుపోతున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జిమ్నాజియం మైదానంలో కబడ్డీ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎటువంటి మ్యాట్‌లు లేకుండా మట్టిలో ఆడించేశారు. అదేవిధంగా క్రీడాకారుల్లో చాలామందికి భోజనాలు కూడా అందలేదు. కొందరికైతే తాగడానికి మంచినీళ్లు కూడా లేవు. వీటిపై ఆటగాళ్లు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తంచేశారు.

నిర్వహణలోనే లోపం

రాష్ట్ర ప్రభుత్వం క్రీడల నిర్వహణకు నిధులు ఇచ్చింది. క్రీడాకారులకు బహుమతులు కూడా భారీగానే ప్రకటించింది. అయితే నిర్వాహకులే అవకతవకలకు పాల్పడుతున్నారు. మ్యాట్‌లు లేకుండా మట్టిలో ఆడించారు. చాలామంది గాయపడ్డారు. కొందరికి తినడానికి ఏమీ దొరకలేదు. తప్పుడు ఆధార్‌లు సృష్టించి కొందరితో ఆడిస్తున్నారు. వీటిపై విచారణ చేయించాలి.

పద్మజ
ఏపీ కబడ్డీ సంఘం కార్యదర్శి

వార్నర్ మెరుపులు

ఆసీస్ బోణీ



హోబర్ట్: వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో ఆస్ట్రేలియా బోణీ చేసింది. భారీ ఛేదనలో చివరి వరకు పోరాడిన విండీస్ 11 పరుగు తేడాతో ఓటమిపాలైంది. శుక్రవారం జరిగిన తొలి టీ20లో డేవిడ్ వార్నర్ (36 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 70) మెరుపు బ్యాటింగ్‌తో ముందుగా ఆసీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. ఇన్‌గ్లి్స్ (39), డేవిడ్ (37 నాటౌట్) రాణించారు. రస్సెల్‌కు మూడు, జోసెఫ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 202/8 స్కోరు చేసి ఓడింది. ఓపెనర్లు కింగ్ (53), చార్లెస్ (42) దూకుడైన ఆరంభం ఇవ్వగా, చివర్లో హోల్డర్ (34 నాటౌట్) ఆకట్టుకున్నాడు. జంపాకు 3, స్టొయినిస్‌కు 2 వికెట్లు లభించాయి. కాగా ఈ మ్యాచ్‌తో వార్నర్ ఆస్ట్రేలియా తరఫున మూడు ఫార్మాట్లలోనూ 100 మ్యాచ్‌లాడిన తొలి ఆటగాడిగా నిలిచాడు. అలాగే తన వందో టెస్టులో డబుల్ సెంచరీ, వందో వన్డేలో సెంచరీ, వందో టీ20లో అర్ధ సెంచరీ కొట్టి, ఈ అరుదైన ఫీట్ నమోదుచేసిన ఏకైక ఆటగాడిగా రికార్డు పుటల్లోకి ఎక్కాడు.

ఫైనల్లో సాకేత్ X రిత్విక్

చెన్నై: తెలుగు ఆటగాళ్లు సాకేత్, రిత్విక్ చౌదరి చెన్నై ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ కోసం పరస్పరం పోటీపడనున్నారు. విశాఖపట్నానికి చెందిన సాకేత్ మైనేని, హైదరాబాద్ ఆటగాడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరి వేర్వేరు భాగస్వాములతో కలిసి ఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం జరిగిన డబుల్స్ సెమీస్‌లో రామ్‌కుమార్‌తో కలిసి ఆడిన సాకేత్ 6-3, 6-2తో జపాన్ జోడీ తొషిహిడె-కైటో ఉసుగిపై గెలిచింది. మరో సెమీస్‌లో బొల్లిపల్లి రిత్విక్ చౌదరి-నికి పూనాచా జోడీ 6-3, 4-6, 10-7తో జర్మనీ జంట జాకబ్-మార్క్‌ను ఓడించి సాకేత్ ద్వయంతో టైటిల్‌ఫైట్‌కు సిద్ధమైంది. పురుషుల సింగిల్స్‌లో భారత టాప్ ఆటగాడు సుమిత్ నగల్ సెమీఫైనల్ చేరాడు. క్వార్టర్స్‌లో సుమిత్ 6-3, 6-3తో డొమినిక్ (చెక్ రిపబ్లిక్)ను చిత్తుచేశాడు.

అదానీ చేతికి ల్యాంకో అమర్‌కంటక్

దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా రూ.4,101 కోట్లకు కొనుగోలు

ముంబై: దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంలో ల్యాంకో అమర్‌కంటక్ పవర్ ప్రాజెక్టును అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ పవర్ రూ.4,101 కోట్లకు వేలంలో దక్కించుకుంది. బుధవారం జరిగిన ఈ వేలంలో మిగతా పోటీదారులైన రిలయన్స్ ఇండస్ట్రీస్, పీఎఫ్‌సీ కన్సార్షియం పాల్గొనకపోవడంతో అదానీ పవర్‌ను విన్నింగ్ బిడ్డర్‌గా ప్రకటించినట్లు తెలిసింది. ల్యాంకో అమర్‌కంటక్ ప్రాజెక్టు కొనుగోలుకు గతంలో అదానీ పవర్ దాఖలు చేసిన రూ.4,101 కోట్ల బిడ్‌నే రుణదాతల కమిటీ వేలానికి కనీస ధరగా నిర్ణయించింది. వేలంలో కౌంటర్ ఆఫర్.. బేస్ రేటు కంటే కనీసం రూ.50 కోట్లు అధికంగా ఉండాలని కమిటీ స్పష్టం చేసింది.

ల్యాంకో అమర్‌కంటక్ ప్రాజెక్టుపై 2019 సెప్టెంబరులో దివాలా పరిష్కార చర్యలు ప్రారంభమయ్యాయి. కానీ, పలు కారణాలతో ఈ ప్రక్రియ జాప్యమవుతూ వచ్చింది. 2022 జనవరిలో ఈ ప్రాజెక్టు కోసం వేదాంత గ్రూప్‌నకు చెందిన ట్విన్‌స్టార్ టెక్నాలజీస్ సమర్పించిన రూ.3,000 కోట్ల బిడ్‌ను చాలా తక్కువ ఆఫర్ చేసిందన్న కారణంగా రుణదాతల కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత పునఃప్రారంభించిన ప్రక్రియలో అదానీ, రిలయన్స్, పీఎఫ్‌సీ కన్సార్షియం పోటీపడ్డాయి. కానీ, రిలయన్స్, అదానీ బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. పీఎఫ్‌సీ కన్సార్షియం రూ.3,020 కోట్లకు బిడ్ వేయగా.. 95 శాతం రుణదాతలు ఆమోదం తెలిపారు. కానీ, జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆ బిడ్‌ను కొన్ని నెలల పాటు ఆమోదించలేదు. అనూహ్యంగా అదానీ పవర్ మళ్లీ రంగంలోకి దిగి రూ.3,650 కోట్లకు బిడ్ వేసింది. తదుపరి బిడ్ విలువను రూ.4,101 కోట్లకు పెంచింది.

ల్యాంకో అమర్‌కంటక్ పవర్ 2001 ఫిబ్రవరిలో ఏర్పాటైంది. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా-చంపా రాష్ట్ర రహదారిపైనున్న పతాడి గ్రామం దగ్గర్లోని 1,337 ఎకరాల స్థలంలో కంపెనీ బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్లో 300 మెగావాట్ల చొప్పున సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లున్నాయి. ఈ యూనిట్ల నుంచి ఛత్తీస్‌గఢ్‌తో పాటు మధ్యప్రదేశ్, హరియాణాకు విద్యుత్ సరఫరా అవుతోంది. రెండో దశలో 660 మెగావాట్ల చొప్పున సామర్థ్యంతో చేపట్టిన రెండు యూనిట్ల నిర్మాణం జాప్యం కాగా.. మూడో దశ విస్తరణలో భాగంగా ప్రతిపాదించిన రెండు యూనిట్ల (660 మెగావాట్ల చొప్పున సామర్థ్యం) నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

విశాఖ ఉక్కు ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, ఆర్‌ఐఎన్‌ఎల్) ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇక్కడ తయారయ్యే 16 ఎంఎం నుంచి 36 ఎంఎం సుపీరియర్ క్వాలిటీ కాంక్రీట్ రీఎన్‌ఫోర్స్‌మెంట్ బార్స్ (రీబార్స్)కు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన కేర్ (యూకే) సంస్థ నుంచి నాణ్యత ధ్రువీకరణ పత్రం అందింది. దీనిద్వారా స్టీల్‌ప్లాంట్ మరో మైలురాయికి చేరుకుందని ఆర్‌ఐఎన్‌ఎల్ సీఎండీ అతుల్‌భట్ పేర్కొన్నారు. నాణ్యత, ప్రాసెసింగ్ సామర్థ్యం పట్ల నిరంతరం నిబద్ధత ప్రదర్శించి, ఉక్కు ఉత్పత్తులను మరిన్ని దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు.

● ప్రపంచంలోని అత్యుత్తమ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ ఒకటైన కార్నెగీ మెలాన్ యూనివర్సిటీ- స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ (సీఎంయూ-ఎస్‌సీఎస్)తో టాలెంట్ స్ప్రింట్ జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా టాలెంట్ స్ప్రింట్, గూగుల్ మద్దతుతో నిర్వహిస్తున్న టెక్‌వైస్‌కి అకాడమిక్ భాగస్వామిగా సీఎంయూ-ఎస్‌సీఎస్ ఉండనుంది. 2022లో టాలెంట్‌స్ప్రింట్.. టెక్‌వైస్ పేరుతో 18 నెలల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది కోహర్ట్ 3 కింద 110 మంది విద్యార్థులకు విభిన్న విభాగాల్లో శిక్షణను అందించటంతో పాటు వారికి ఉపాధి అవకాశాలను కల్పించనుంది.



● మారుతి సుజుకీ ఇండియా.. మల్టీ పర్పస్ వెహికల్ (ఎంపీవీ) ఎర్టిగా విక్రయాలు 10 లక్షల మైలురాయిని అధిగమించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంత మార్కెట్లో ఈ ఎంపీవీకి మంచి ఆదరణ లభిస్తోందని కంపెనీ పేర్కొంది.

ఎంబ్రాయర్‌తో మహీంద్రా జట్టు

ముంబై: భారత వైమానిక దళానికి అవసరమైన రవాణా విమానం దేశీయంగానే ఉత్పత్తి చేసే ప్రాజెక్టులో సహకారానికి ఎంబ్రాయర్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ కంపెనీ, మహీంద్రా గ్రూప్ చేతులు కలిపాయి. భారత వైమానిక దళం త్వరలో ప్రారంభించనున్న మీడియం రవాణా విమానం (ఎంటీఏ) ప్రొక్యూర్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సీ-390 మిలీనియం మల్టీ మిషన్ విమానం కొనుగోలులో ఈ రెండు సంస్థలు సహకారం అందించనున్నాయి. భారత్‌కు వైవిధ్య భరితం, శక్తివంతమైన రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమ ఉన్నదని, అందుకే ఎంటీఏ ప్రోగ్రామ్ ఉమ్మడిగా చేపట్టడానికి తాము మహీంద్రాను భాగస్వామిగా ఎంచుకున్నామని ఎంబ్రాయర్ ప్రెసిడెంట్ బాస్కో డ కోస్టా అన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,160 ▼	57,900 ▼	76,500 ▲
ముంబై	62,624 ▲	57,364 ▲	70,638 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ		విజయవాడ	530
హైదరాబాద్	545	విశాఖపట్నం	555
10వ తేదీ		వరంగల్	547
చిత్తూరు	583		
గోదావరి	530	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	117	గోదావరి	122
వరంగల్	117	విజయవాడ	122
కరీంనగర్	117	గుంటూరు	124
మహబూబ్‌నగర్	117	ఒంగోలు	124
కర్నూలు	117	చిత్తూరు	130
విశాఖపట్నం	117		

బిజినెస్

పిట్టీ ఇంజనీరింగ్ లాభం రూ.13 కోట్లు

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ రూ.296.92 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.13.32 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 24.19 శాతం (రూ.239.08 కోట్లు), లాభం 9.81 శాతం (రూ.12.13 కోట్లు) పెరిగింది. త్రైమాసిక సమీక్షా కాలంలో అమ్మకాలు 15.54 శాతం మేర పెరగటం కలిసి వచ్చిందని పేర్కొంది. కాగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్ ప్లాంట్ విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని, ఈ ఏడాది మార్చి నాటికి నిర్మాణ పనులు పూర్తి కావచ్చని భావిస్తున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికం ముగిసే నాటికి ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా అందుబాటులోకి రానుందని తెలిపింది. డిసెంబరు ముగిసే నాటికి రూ.63.39 కోట్ల పెట్టుబడులు పెట్టగా మార్చి ముగిసే నాటికి మరో రూ.40 కోట్ల పెట్టుబడులు పెట్టాలని చూస్తున్నట్లు తెలిపింది. డిసెంబరు ముగిసే నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ రూ.898 కోట్లుగా ఉంది.

ఐటీ నియామకాల్లో స్తబ్దత!

- మరికొంత కాలం పాటు ఇదే పరిస్థితి
- హైసియా ప్రెసిడెంట్ మనీషా సాబు
- 14న నేషనల్ సమ్మిట్, అవార్డుల కార్యక్రమం
- సీపీ గుర్నానీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



హైదరాబాద్: దేశీయంగా ఐటీ రంగ నియామకాల్లో స్తబ్దత మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. కొవిడ్ ముప్పు తొలగిపోయిన తర్వాత అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మందగమన పరిస్థితులు ఐటీ పరిశ్రమ వృద్ధికి విఘాతం కలిగించాయని హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ప్రెసిడెంట్ మనీషా సాబు అన్నారు. శుక్రవారం నాడిక్కడ హైసియా 31వ ఎడిషన్ నేషనల్ సమ్మిట్, అవార్డ్స్ 2024 వివరాలను వెల్లడించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సహా ఇతరత్రా కారణాలతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఇంకా గాడినపడక పోవటం ఐటీ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపించిందని అంతేకాకుండా ఇది ఉద్యోగ నియామకాలపై పడిందన్నారు. ఐటీ రంగంలో నియామకాలు సాధారణ స్థాయికి రావాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. మరోవైపు క్యాంపస్ నియామకాల్లో కూడా స్తబ్దత నెలకొందని తెలిపారు.

ఎస్‌టీపీఐ భాగస్వామ్యంతో: 'ఏఐ: సెలబ్రేటింగ్ ఫ్యూచర్ థీమ్‌తో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)- హైదరాబాద్‌తో కలిసి హైసియా ఈ నెల 14న హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో జాతీయ సమ్మిట్‌ను నిర్వహిస్తోందని మనీషా సాబు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డీ. శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. అలాగే ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అర్వింద్ కుమార్, టెక్ మహీంద్రా మాజీ సీఈఓ, ఎండీ సీపీ గుర్నానీ, టీసీఎస్ ప్రెసిడెంట్ వీ రాజన్న కూడా ఈ సదస్సుల్లో పాల్గొంటారని తెలిపారు. ఐటీ రంగంలో సీపీ గుర్నానీ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ ఏడాది హైసియా జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు సాబు పేర్కొన్నారు. అలాగే ఐటీ పరిశ్రమలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన కంపెనీలకు అవార్డులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు.

హైబ్రిడ్ విధానానికి మొగ్గు: కొవిడ్ కాలంలో మొదలైన వర్క్ ఫ్రమ్ హోమ్ (డబ్ల్యూఎఫ్‌హెచ్) విధానానికి కంపెనీలు నిదానంగా స్వస్తి పలుకుతున్నాయి. ప్రస్తుతం 15 శాతం మంది ఇంటి నుంచి పనిచేస్తుండగా 40 శాతం మంది హైబ్రిడ్ విధానంలో పని చేస్తున్నారు. చాలా కంపెనీలు ఇప్పటికే ఉద్యోగులను ఆఫీస్‌కు వచ్చి పనిచేయాలని ఆదేశిస్తున్నాయని ఆమె చెప్పారు. రానున్న రోజుల్లో కంపెనీలు హైబ్రిడ్ విధానానికి మొగ్గు చూపే అవకాశం ఉందని సాబు పేర్కొన్నారు.

స్వల్ప లాభాలతో సరి

167 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనైన ప్రామాణిక సూచీలు.. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో కొనుగోళ్లతో స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 167.06 పాయింట్లు పెరిగి 71,595.49 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 64.55 పాయింట్ల వృద్ధితో 21,782.50 వద్ద నిలిచింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 16 లాభపడ్డాయి. ఎస్‌బీఐ 3.55 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్ 2 శాతానికి పైగా పెరగగా.. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ షేరు 0.67 శాతం లాభపడింది. బీఎస్‌ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.36 శాతం క్షీణించగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.82 శాతం తగ్గింది.

2 రోజుల్లో పేటీఎం షేరు 15% పతనం: పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు మరో 6.09 శాతం క్షీణించి రూ.419.85 వద్దకు జారుకుంది. గడిచిన రెండు రోజుల్లో 15.48 శాతం పతనమవడంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 4,870 కోట్లకు తరిగిపోయింది.

ఫారెక్స్ నిల్వలు హైజంప్: ఈ నెల 2తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు మరో 573.6 కోట్ల డాలర్ల మేర పెరిగి మొత్తం 62,246.69 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది. గతవారంలోనూ ఫారెక్స్ నిల్వలు 59 కోట్ల డాలర్లకు పైగా పెరిగాయి.

గ్లెన్‌మార్క్‌లో 17% వాటా కొనుగోలుకు నిర్మా ఓపెన్ ఆఫర్

గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్‌లో అదనపు వాటా కొనుగోలుకు నిర్మా ప్రకటించిన రూ.1,343 కోట్ల ఓపెన్ ఆఫర్ ఈ నెల 15న ప్రారంభం కానుంది. ఈ ఆఫర్‌లో భాగంగా, గ్లెన్‌మార్క్‌లో 17.33 శాతం వాటాకు సమానమైన 2.13 కోట్ల షేర్లను ఒక్కోటి రూ.631.20 చొప్పున పబ్లిక్ వాటాదారుల నుంచి కొనుగోలు చేయనుంది. గ్లెన్‌మార్క్‌లో 75 శాతం వాటాను రూ.5,651 కోట్లకు కొనుగోలు చేసేందుకు నిర్మా గత ఏడాది సెప్టెంబరులో ఒప్పందం కుదుర్చుకుంది.

రోజువారీ ట్రేడింగ్ విలువలో హాంకాంగ్‌ను మించిన భారత్

దేశీయ స్టాక్ మార్కెట్ మరో రికార్డు సొంతం చేసుకుంది. మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా ఇప్పటికే హాంకాంగ్‌ను దాటేసిన భారత స్టాక్ మార్కెట్.. తాజాగా ట్రేడింగ్ విలువలోనూ ఆ దేశాన్ని వెనక్కి నెట్టింది. జనవరిలో బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ రోజువారీ ట్రేడింగ్ సగటు విలువ 1,650 కోట్ల డాలర్లకు పెరగగా.. హాంకాంగ్ ట్రేడింగ్ వేల్యూ 1,310 కోట్ల డాలర్లకు పరిమితమైంది.

పీఎస్‌యూ స్టాక్స్‌లో ఎల్ఐసీ హోల్డింగ్స్.. నాలుగు నెలల్లో రూ.లక్ష కోట్లు అప్

గత ఏడాది అక్టోబరు 1 నుంచి గడిచిన నాలుగు నెలల్లో ప్రభుత్వ రంగ కంపెనీల్లో (పీఎస్‌యూ) ఎల్ఐసీ పెట్టుబడుల విలువ రూ.లక్ష కోట్లు పెరిగింది. 60 పీఎస్‌యూ స్టాక్స్‌లో ఎల్ఐసీ పెట్టుబడుల మొత్తం విలువ ఈ నెల 9 నాటికి రూ.3.3 లక్షల కోట్లకు చేరుకుంది. స్థూల ఆర్థికాంశాల్లో సానుకూలతలతో గడిచిన కొన్ని నెలల్లో పీఎస్‌యూ షేర్లు భారీగా ర్యాలీ తీయడం ఇందుకు దోహదపడింది.

హీరో మోటో లాభంలో 50 శాతం వృద్ధి

ఒక్కో షేరుకు రూ.100 డివిడెండ్

న్యూఢిల్లీ: హీరో మోటోకార్ప్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 50 శాతం వృద్ధి చెంది రూ.1,093 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక కాలంలో వాహన విక్రయాలు మెరుగ్గా ఉండటం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.726 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా రూ.8,300 కోట్ల నుంచి రూ.10,031 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ మొత్తం 14.6 లక్షల మోటార్‌సైకిళ్లు, స్కూటర్లను విక్రయించింది. కంపెనీ ఛైర్మన్ ఎమిరెటస్ బ్రిజ్‌మోహన్ లాల్ ముంజాల్ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒక్కో షేరుకు రూ.75 మధ్యంతర డివిడెండ్‌తో పాటు రూ.25 ప్రత్యేక డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

రూ.600 కోట్లతో జైడస్ లైఫ్ షేర్ల బైబ్యాక్

ముంబై: జైడస్ లైఫ్ సైన్సెస్.. రూ.600 కోట్లతో షేర్ బైబ్యాక్‌ను ప్రకటించింది. ఇందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. బైబ్యాక్‌లో భాగంగా మొత్తం 59.7 లక్షల షేర్లను కంపెనీ తిరిగి కొనుగోలు చేయనుంది. కంపెనీ మొత్తం పెయిడప్ క్యాపిటల్‌లో ఇది 0.59 శాతానికి సమానం. టెండర్ ఆఫర్ మార్గంలో ఈ షేర్లను కంపెనీ బైబ్యాక్ చేయనుంది. ఒక్కో షేరు ధరను రూ.1,005గా ఖరారు చేసింది. కాగా డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ.4,505 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.790 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం 27 శాతం వృద్ధి చెందింది.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 10-2-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అధికారంలోకి రాగానే వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన పని... రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల మందికిపైగా వలంటీర్లను నియమించడం! అందులోనూ... అత్యధికులు వైసీపీ కార్యకర్తలు, అభిమానులే ఉండేలా చూసుకోవడం! ఇదో వంకర ఆలోచన!

ప్రభుత్వ ధనంతో వలంటీర్లను నియమించుకుని... నిత్యం వాళ్లను సొంత రాజకీయ అవసరాలకు వాడుకుని మళ్లీ అధికారంలోకి రావాలనుకోవడం! ఎన్నికల సమయంలో వారిని పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తలుగా మార్చేందుకు వేస్తున్న ప్రణాళిక... గతంలో కనీవినీ ఎరుగని, ఎవరికీ తట్టని, తాడేపల్లి క్యాంప్‌కు మాత్రమే సాధ్యమయ్యే మహా వంకర టింకర, నీచ, నికృష్టమైన ఆలోచన!

అదేమిటో మీరే చూడండి!

వలంటీర్లకు 'బ్రేక్'!

ఎన్నికల కోసం వైసీపీ పెద్దల మాస్టర్ ప్లాన్

2 నెలలు పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తలుగా..

ఇప్పటికే ఎడాపెడా వలంటీర్ల వాడకం

షెడ్యూలు వస్తే ఎన్నికల కమిషన్ నజర్

అప్పుడు వారి సేవలు వాడుకోవడం కష్టమే

అందుకే... తాత్కాలికంగా తొలగించే యోచన

ఆపై ఎన్నికల్లో నేరుగా వారి సేవల వినియోగం

ఆ సమయంలో సొంతంగా జీతాలు, కానుకలు

వలంటీర్లకు వైసీపీ నేతల సందేశాలు



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'వైసీపీ కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించాం. 99 శాతం వలంటీర్లు మా వాళ్లే'.. అని వైసీపీ పెద్దలు చెబుతూనే ఉన్నారు.

- 'వలంటీర్లు మనోళ్లే'... అని మొన్నటికి మొన్న సాక్షాత్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా సెలవిచ్చారు.

కానీ... ఎన్నికల సమయంలో వలంటీర్లను పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తలుగా వాడుకోవడం ఎలా? ఎన్నికల కమిషన్ అభ్యంతరాలు, ఆదేశాలు అడ్డురాకుండా వలంటీర్లను పక్కా రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం ఎలా? దీనిపై అధికార పార్టీ ఒక మాస్టర్ ప్లాన్ వేసింది. అదే... వలంటీర్లకు రెండు నెలలు, అంటే ఎన్నికలు ముగిసే దాకా విధుల నుంచి 'బ్రేక్' ఇవ్వడం! అంటే ఆ సమయంలో వారు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

మిగతా 4వ పేజీలో...

నకిలీ ఓట్ల దొంగ 'సొంత' మనిషే!

తిరుపతి ఉప ఎన్నిక అక్రమాల కేసులో కొత్త మలుపు

ఈసీ రికార్డుల్లో మాత్రమే ఈఆర్వోగా ఐఏఎస్ గిరీషా

ఆ బాధ్యతలు నిర్వర్తించింది చంద్రమౌళీశ్వర రెడ్డి

ఈసీ అనుమతి లేకుండానే ఈఆర్వోగా బాధ్యతలు చేపట్టిన వైనం

లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, ఓటీపీ ఫోన్ నంబర్ ఆయనవే

ఈఆర్వో లాగిన్‌తో 35 వేల ఓటర్ కార్డులు డౌన్‌లోడ్

కమిషన్ విచారణలో తేలిన అసలు గుట్టు

ఈసీ ఆదేశాల మేరకు ఆయనపై సస్పెన్షన్ వేటు



చంద్రమౌళీశ్వర రెడ్డి

పోలింగ్‌లో ఎన్నెన్నో అక్రమాలు. దొంగ ఓటర్లను చూశాం. రిగ్గింగ్ చూశాం. 'రీసైక్లింగ్'ను కూడా చూశాం. కానీ... తిరుపతి ఉప ఎన్నికల్లో అత్యంత పకడ్బందీగా నకిలీ ఓటరు ఐడీ కార్డులనే సృష్టించారు. ఇది దేశ ఎన్నికల చరిత్రలోనే కనీవినీ ఎరుగని అక్రమం. అందులోనూ... ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి సీటులోనే అక్రమంగా 'సొంత' మనిషిని కూర్చోబెట్టారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎవరో ఓట్ల అక్రమాల జ్వాల రగిలించారు! ఇంకెవరో దానికి బలైపోయారు! ఆ జ్వాల రగిలించింది.. వైసీపీ నేతలు, వారి తరఫున చంద్రమౌళీశ్వర రెడ్డి అనే అధికారి. దానికి బలైపోయింది మాత్రం... ఐఏఎస్ అధికారి గిరీషా! తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో కనీవినీ ఎరుగని విధంగా నకిలీ ఓటరు ఐడీలనే సృష్టించిన దారుణంలో ఇప్పుడు కీలక మలుపు

మిగతా 7వ పేజీలో...

తొలి ఏడాది 50% జీతమే

డీఎస్సీ టీచర్లకు రెండేళ్లు అప్రెంటీస్

రెండో ఏడాది బేసిక్ జీతంలో 60%

పోస్టుల వివరాలతో ఉత్తర్వులు 10



ప్రధాని మోదీకి వెంకన్న ప్రతిమను బహూకరిస్తున్న సీఎం జగన్

మోదీ.. ముక్తసరిగా!

రాజకీయాలు మాట్లాడేందుకు జగన్‌కు అవకాశమివ్వని ప్రధాని

గంటకుపైగా నిరీక్షణ తర్వాత 15 నిమిషాలు భేటీ

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ అంతే

రాత్రి నుంచి అడుగుతున్నా.. అపాయింట్‌మెంట్ ఇవ్వని అమిత్ షా

నిరాశతో వెనుదిరిగిన సీఎం.. మీడియాతో మాట్లాడని వైనం

పార్లమెంటు వద్ద 4 గంటలున్నా పట్టించుకోని వైసీపీ ఎంపీలు

దుబాయ్ వెళ్లిపోయిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి 10

సాయిరెడ్డి చెబుతారు! పీవీకి భారత రత్నపై సీఎం 'స్పందన' విస్తుపోయిన ఢిల్లీ మీడియా ప్రతినిధులు!

జగన్‌ను సాగనంపడానికి
జనం సిద్ధం

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ తుంగలో తొక్కారు

మళ్లీ మోసం చేయడానికే 'సిద్ధం' అంటున్నారు

అన్ని కోట్లు అప్పుచేసినా ప్రజలు బాగు పడలేదు

ప్రజల్లో నాన్న.. ప్యాలెస్ దాటని జగనన్న



అమ్మఒడి ఒక బిడ్డకేనా?.. మరో బిడ్డ చదవకూడదా? పుట్టకూడదా? 10

దళితులను రక్షించలేని దళిత హోం మంత్రి ఎందుకు?.. నిప్పులు చెరిగిన పీసీసీ చీఫ్ షర్మిల

మోదీతో పొత్తు.. జగన్‌కు క్లీన్‌చిట్

ఏపీ కోరిన వెంటనే అప్పులకు కేంద్రం ఆమోదం

ఇసుక, మద్యం వ్యాపారాల్లో బీజేపీకి వాటాలు

షర్మిలను తిడుతున్నా జగన్ పట్టించుకోరేం?: కేవీపీ

బీరువాలు పగలగొట్టి..
మంచాలు విరగ్గొట్టి..
వెతుకులాట



మాజీ మంత్రి నారాయణపై పోలీసు గురి!

నెల్లూరు క్యాంపు ఆఫీస్‌పై దాడులు.. డ్రగ్ కంట్రోల్ తనిఖీలు

నారాయణ సతీమణి గృహనిర్బంధం.. సెల్‌ఫోన్ స్వాధీనం

డబ్బు, ఫైళ్లు దొరక్క వెనుదిరిగిన వైనం 10

కక్ష సాధింపులు మళ్లీ మొదలు!

జైలు నుంచి కోడికత్తి శ్రీను విడుదల

కేసు కొట్టేయాలని కోరుతూ సుప్రీంలో క్వాష్ పిటిషన్ వేస్తాం

మాలో ఎవరికేం జరిగినా జగన్‌దే బాధ్యత: న్యాయవాది సలీం

ఇకపై కుట్రలు కొనసాగనివ్వబోమని దళిత సంఘాల నినాదాలు 7

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇతిహాస రత్నాలు!

మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరీ చరణ్‌సింగ్‌లతో పాటు, సుప్రసిద్ధ వ్యవసాయశాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్‌లకు భారతరత్న పురస్కారాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఇతరత్రా అధికారిక ప్రక్రియల అవసరం లేకుండా, ప్రధాని సిఫార్సు, రాష్ట్రపతి ఆమోదంతో ఈ నిర్ణయం జరిగిపోతుంది కనుక, ఈ ఏడాది పురస్కారాల సంఖ్య ఇప్పటికే ఐదుకు చేరిన నేపథ్యంలో శుక్రవారం నాటి మోదీ ట్వీట్ చివరిది కావచ్చు. పురస్కారాలు అందుకున్న ముగ్గురూ ఈ దేశం గర్వించదగ్గ బిడ్డలు, ఈ అత్యున్నత గౌరవానికి సంపూర్ణంగా అర్హులు. ఇటీవల బిహార్ నాయకుడు కర్పూరీ ఠాకూర్‌కు, వారంలో బీజేపీ నాయకుడు ఎల్.కె. అద్వాణీకి ఈ పురస్కారాన్ని ప్రకటించిన మోదీ, మరోవారంలోనే ఈ ముగ్గురినీ చేర్చడంతో, ఈ అవార్డు చరిత్రలో అత్యధిక పురస్కారాలు ప్రకటించిన ఏడాదిగా రికార్డులకు సైతం ఎక్కింది.

దక్షిణ భారతం నుంచి ఒకేమారు రెండురత్నాలు. తెలంగాణ బిడ్డ పీవీకి దక్కిన గౌరవం తెలుగువారందరినీ ఆనందింపచేస్తుంది. కేరళలో పుట్టి, తమిళనాడును పుట్టినిల్లుగా చేసుకున్న హరితవిప్లవ పితామహుడు స్వామినాథన్ ఎంపిక వారినీ సంతోషపెడుతుంది. చరణ్‌సింగ్ పేరు ఉత్తరాదిని రంజిపచేస్తుంది. ఈ ఏడాది పురస్కారాలు అందుకున్నవారంతా దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసినవారు, తమ కృషి, మేధస్సుతో ఆయా రంగాలను వెలిగించినవారే. ఎన్నికల ఏడాది కావడంవల్ల పురస్కారాల వెనుక ఉన్న రాజకీయ కోణం మీద కూడా విస్తృత చర్చ జరుగుతోంది. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం ఎంబీసీలను ఆకర్షించడానికే కాక, బిహార్‌లో రాజకీయమార్పుకు కూడా ఉపకరించింది. ఇండియా కూటమికి పునాదులు వేసిన నితీశ్‌కుమార్ తిరిగి ఎన్డీయేలో ప్రవేశించడానికి ఓ దారిచూపింది. ఇప్పుడు చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించగానే ఆయన మనుమడు జయంత్ చౌదరి 'దిల్ జీత్ లియా' అంటూ ఎన్డీయేతో పోవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆర్ఎల్‌డీతో గతనెలలోనే అఖిలేశ్ యాదవ్ సీట్ల సర్దుబాటు ఒప్పందం చేసుకున్నప్పటికీ, చరణ్‌సింగ్ పేరు ప్రకటించగానే ఆర్ఎల్‌డి ఎమ్మెల్యేలంతా యూపీ అసెంబ్లీ భవనం ముందు చేరి నరేంద్రమోదీ జిందాబాద్ అని నినదించడం మారుతున్న రాజకీయానికి నిదర్శనం. ఆర్ఎల్‌డి నిష్క్రమణ పశ్చిమయూపీలోనే కాక, జాట్ల ఆధిపత్యం ఉన్న మిగతా ప్రాంతాలను కూడా ప్రభావితం చేస్తుంది. చరణ్‌సింగ్‌కు దక్కిన గౌరవం హర్యానా, రాజస్థాన్‌లోని జాట్లను కూడా బీజేపీకి సానుకూలం చేసి, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన ఒక బలమైన వర్గాన్ని మెత్తబరుస్తుంది. నాలుగుదశాబ్దాలపాటు కాంగ్రెస్‌లో ఉండి, ఆ తరువాత దాని సహకారంతోనే అత్యున్నత పదవులు చేపట్టి, కొంతకాలం జనసంఘ్‌తో నడిచిన చరణ్‌సింగ్‌ను ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటయోధుడుగా, ప్రజాస్వామ్యపరిరక్షకుడుగా గుర్తుచేస్తూ మోదీ ఈ పురస్కారాన్ని ప్రకటించారు. చరణ్‌సింగ్‌తో పాటు ఎంఎస్ స్వామినాథన్ ఎంపిక కూడా యావత్ రైతాంగాన్ని ఆకట్టుకొనేందుకు ఉపకరిస్తుంది. హరితవిప్లవంతో రైతులను ఆర్థికంగా నిలబెట్టడంతో పాటు, వ్యవసాయాన్ని, రైతులను రక్షించడానికి ఆయన జీవితపర్యంతం కృషిచేశారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా పీవీని గౌరవించడం ఆ పార్టీని ఇరుకునపెట్టడానికి, సార్వత్రిక ఎన్నికలముందు ప్రజానీకాన్ని ప్రభావితం చేయడానికి ఉపకరిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలకబాధ్యతలు సమర్థంగా నిర్వహించి, ముఖ్యమంత్రిగా, దేశప్రధానిగా ఎదిగిన పీవీకి దక్కిన ఈ గౌరవం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ మీద ఉన్న ఆగ్రహాన్ని చల్లార్చడానికి దోహదం చేస్తుంది. గతంలో ప్రణబ్ ముఖర్జీ, ఇప్పుడు పీవీ.. గాంధీ కుటుంబానికి చెందనివారిని గౌరవించడం ద్వారా తన కుటుంబపాలన వాదనకు ఊతం ఇచ్చుకొనే ప్రయత్నం బీజేపీ చేస్తున్నది. పీవీ నరసింహారావు హయాంలోనే బాబ్రీ మసీదు కూల్చివేత జరగడం, రామమందిర నిర్మాణంతో ఆ వివాదం ముగియడం కూడా ప్రధాని మనసులో ఉండివుంటుంది. పీవీ హయాంలో దేశం అద్భుతవిజయాలు సాధించిందని గుర్తుచేయడంలో, ఆ తరువాత కాంగ్రెస్ హయాంలో దేశం ఆర్థికంగా భ్రష్టుపట్టిందన్న ప్రస్తుత వాదన అంతర్లీనంగానైనా ఉంది. నాలుగువందల సీట్ల లక్ష్యానికి ఓ అరవయ్యో, డెబ్బయ్యో తక్కువపడతాయని సర్వేలు లెక్కలేస్తున్న క్రమంలో, ఈ పురస్కారాలతో ప్రజల మనసు చూరగొనే ప్రయత్నం ఎంతో కొంత ఉండకపోదు.

నిర్మల ఘోష–సామాన్యుడి సణుగుడు

ప్రజాహితకర ఆర్థిక ఆలోచనలు ప్రశాంతంగా, నిశ్చలంగా ఉంటాయి. మంచి ఆర్థికవేత్తలు తమ విధానాల ఫలితాలకు బాధ్యత వహిస్తారు. ఆర్థిక సర్వే, కొత్త సంవత్సరంలో పార్లమెంటు ప్రథమ సమావేశాల మొదటి రోజు రాష్ట్రపతి ప్రసంగం, ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం ప్రభుత్వ విధానాన్ని వెల్లడించే ముఖ్య ప్రకటనలు. సమష్టిగా అవి ప్రభుత్వ ఉద్దేశాలు, సంకల్పాలను బిగ్గరగా, స్పష్టంగా ప్రకటిస్తాయి.

తన విధానాలను అట్టహాసంగా ప్రకటించడం ఎన్డీఏ ప్రభుత్వానికి అలవాటు. ఈ ఏడాది 2024–25 ఆర్థిక సంవత్సరానికి తాత్కాలిక బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడుతూ దానిని ఒక బుల్హార్న్ (ధ్వనిని పెంచే పరికరం, మెగా ఫోన్ లాంటిది)గా ఉపయోగించుకోవాలని గౌరవనీయ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిర్ణయించుకున్నారు. ఆమె ఘోషను మీడియా విధేయపూర్వకంగా ప్రతిధ్వనించింది. అయితే బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజు సాయంత్రానికే సదరు బడ్జెట్ పత్తా లేకుండాపోవడం ఆర్థిక మంత్రికి ఎంతైనా ఆశాభంగం కలిగించి ఉంటుంది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

గత పది సంవత్సరాలుగా ఆర్థికాభివృద్ధి విషయమై ప్రభుత్వం పదే పదే చేస్తున్న ప్రకటనలు, వాదనలు వినీ వినీ ప్రజలు అలసిపోతున్నారు, విసిగిపోతున్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తామన్న హామీని వారు గుర్తు చేసుకొంటున్నారు. అయితే జరిగింది ఏమిటి? ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీలను భర్తీ చేసేందుకు కొన్ని వేల నియామక లేఖలను మాత్రమే ఇచ్చారు. కాగా 2023లో టెక్ కంపెనీలు 2,60,000 ఉద్యోగాలను రద్దు చేశాయి. భారత్‌లోనూ, విదేశాలలోనూ దాచిన నల్లధనాన్ని వెనక్కి తీసుకువచ్చి ప్రతి ఒక్క భారతీయుని బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని 2014లో నరేంద్ర మోదీ చేసిన వాగ్దానాన్ని కూడా ప్రజలు గుర్తు చేసుకొంటున్నారు. అయితే ప్రభుత్వ బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని వాటి చెల్లింపును పూర్తిగా ఎగవేసిన ఘనులు చట్టం నుంచి తప్పించుకుని విదేశాలకు వెళ్లిపోవడానికి ప్రభుత్వం అనుమతించిందని, ఇప్పుడు వారు ఆశ్రయం పొందిన దేశాలలో ఉల్లాసంగా, మహదానందకరంగా నివశిస్తున్నారని, వారిని భారత్‌కు తీసుకువచ్చేందుకు గత పదేళ్లుగా ఎలాంటి ప్రయత్నాలు జరగలేదన్న విషయం కూడ ప్రజలకు బాగా తెలుసు సుమా!

2022 సంవత్సరం నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని, ప్రతి కుటుంబానికి గృహ వసతి సమకూరుస్తామని 2023–24 నాటికి భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధిపరుస్తామని ఇచ్చిన హామీలను ప్రజలు మరచిపోలేదు. మరి గౌరవనీయ ఆర్థిక మంత్రి తన తాజా బడ్జెట్ ప్రసంగంలో చేసిన ప్రకటనలను వారు ఒక వినోద కాలక్షేపంగా మాత్రమే పరిగణిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఆదాయాలు పెరిగాయని ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. నిజమేమిటి? పిఎల్ఎఫ్ఎస్ డేటా, అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీ రూపొందించిన స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా రిపోర్ట్ ప్రకారం నియత, తాత్కాలిక/ దినసరి, స్వయం ఉపాధి కార్మికుల నిజ వేతనాలలో 2017–18, 2022 –23 ఆర్థిక సంవత్సరాల మధ్య ఎలాంటి పెరుగుదల లేదు. వివిధ రకాల పేదరికాల నుంచి బయటపడేందుకు 25 కోట్ల మంది ప్రజలకు ప్రభుత్వం తోడ్పడిందని మంత్రి అన్నారు. నిజమేనా? యుఎన్‌డిపి నివేదికల ప్రకారం యూపీఏ ప్రభుత్వాల హయాంలో పేదరికం నుంచి బయటపడిన భారతీయులు 27.5 కోట్ల మంది కాగా, ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలో కేవలం 14 కోట్ల మంది మాత్రమే పేదరికం నుంచి గట్టెక్కారు.



గత పది సంవత్సరాలుగా ఆర్థికాభివృద్ధి విషయమై ప్రభుత్వం పదే పదే చేస్తున్న ప్రకటనలు, వాదనలు వినీ వినీ ప్రజలు అలసిపోతున్నారు, విసిగిపోతున్నారు. 2022 సంవత్సరం నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని, ప్రతి కుటుంబానికి గృహ వసతి సమకూరుస్తామని 2023–24 నాటికి భారత్‌ను 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధిపరుస్తామని ఇచ్చిన హామీలను ప్రజలు మరచిపోలేదు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన తాజా బడ్జెట్ ప్రసంగంలో చేసిన ప్రకటనలను వారు ఒక వినోద కాలక్షేపంగా మాత్రమే భావిస్తున్నారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన కింద ఏటా 11.8 కోట్ల మంది రైతులకు ప్రభుత్వం నేరుగా ఆర్థిక సహాయమందిస్తుందని నిర్మలా సీతారామన్ అన్నారు. వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. నవంబర్ 15, 2023 నాటికి ఈ లబ్ధి పొందే రైతుల సంఖ్య 8.12 కోట్లకు తగ్గిపోయింది. ఈ ఆర్థిక సహాయాన్ని పట్టా దారులైన రైతులకు అందించి కౌలు రైతులను పూర్తిగా మినహాయించారు. గత పదేళ్లలో ఉన్నత విద్యా సంస్థలను పెద్ద సంఖ్యలో కొత్తగా నెలకొల్పినట్లు మంత్రి చెప్పారు. 7 ఐఐటీలు, 16 ఐఐఐటీలు, 15 ఎయిమ్స్‌లు, 390 విశ్వవిద్యాలయాలు అని ఇమె ఒక జాబితా కూడా ఇచ్చారు. సరే, మార్చి 22, 2023 నాటికి ఈ ఉన్నత విద్యాసంస్థల అధ్యాపక ఉద్యోగ ఖాళీల వివరాలు ఎలా ఉన్నాయో చూడండి: ఐఐటీలు (9,625), ఐఐఐటీలు (1,212), కేంద్రీయ విశ్వవిద్యాలయాలు (22,106). మార్చి 15, 2022 నాటికి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో 1,256 అధ్యాపక, రెసిడెంట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇతర 19 ఎయిమ్స్‌లలో ఉన్న ఈ ఖాళీల సంఖ్య 3,871.

ప్రధానమంత్రి ముద్రా యోజన 22.5 లక్షల యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మొత్తం 43 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని నిర్మల సీతారామన్ అన్నారు. ముద్రా రుణాల సగటు పరిమాణం రూ.52,325. ఈ రుణాలను శిశు (83 శాతం), కిశోర్ (15 శాతం). తరుణ్ (2 శాతం)గా వర్గీకరిస్తే అత్యధిక రుణాలు శిశు శ్రేణిలో ఉన్నాయని స్పష్టమవుతుంది ప్రభుత్వ సమాచారం ప్రకారమే 35.69 కోట్ల శిశు రుణాల గ్రహీతలు మొత్తం రూ.9 లక్షల కోట్ల రూపాయల మేరకు ఆర్థిక సహాయాన్ని పొందారు. సగటు రుణం పరిమాణం రూ.25,217. కేవలం రూ.25 వేలతో ఎవరైనా ఒకరు ఎలాంటి వ్యాపారాన్ని ప్రారంభించగలుగుతారు?

'ఒకే దేశం, ఒకే మార్కెట్, ఒకే పన్ను' లక్ష్యాన్ని వస్తుసేవల పన్ను (జీఎస్టీ) నెరవేరుస్తుందని మంత్రి సంబరంగా చెప్పారు. అవునా? వ్యాపారస్తులు, వర్తకులు, వాణిజ్యవేత్తలు అందరూ సమైక్యంగా వ్యతిరేకిస్తున్న పన్ను ఏదైనా ఒకటి ఉందంటే అది జీఎస్టీనే సుమా! జీఎస్టీ చట్టాలు లోపభూయిష్టమైనవి. వేధింపులకు, దోపిడీకి అవి ఎంతైనా ఆస్కారం కల్పిస్తున్నాయి. కాదా మంత్రిగారూ? సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి, అంతర్జాతీయ విపణిలో అవి సమర్థంగా పోటీ పడేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడం ఉపయుక్త సాంకేతికతలను సమకూర్చడం, కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరచడం అనేవి ప్రభుత్వ విధానంగా ఉందని నిర్మలా సీతారామన్ చెప్పారు. వాస్తవమేమిటి? కోవిడ్ విలయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి తోడ్పాటు అందకపోవంతో వేలాది సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడ్డాయి. లక్షలాది కార్మికులు వీధినపడ్డారు. ఈ పరిశ్రమలకు మూడు లక్షల కోట్ల రూపాయల మేరకు బ్యాంకు రుణాలను అందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కేవలం రెండు లక్షల కోట్ల రూపాయలు మాత్రమే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పంపిణీ చేశారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు 2013–14 నుంచి రెట్టింపు అయ్యాయని ఆర్థిక మంత్రి చెప్పారు. ఈ తొమ్మిది సంవత్సరాలలో ఈ ఎగుమతుల పెరుగుదల (రూ.30,627 కోట్ల నుంచి రూ.64,902 కోట్లకు) ప్రస్తుత రూపీ ధరలలో మాత్రమే అని గుర్తించాలి. డాలర్లలో చూస్తే ఈ పెరుగుదల కేవలం 60 శాతం మాత్రమే. 5016 మిలియన్ డాలర్ల నుంచి 8078 మిలియన్ డాలర్ల మేరకు ఎగుమతులు పెరిగాయి. అయితే ఈ పెరుగుదల కేవలం 5.4 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్‌ను మాత్రమే సమకూర్చింది.

కర్ణాటకలో హిందూ పక్షపాతం

కర్ణాటక శాసనసభ ఎన్నికలు గత ఏడాది మేలో జరిగాయి. ఈ ఎన్నికలకు ముందు స్థానిక వార్తాపత్రికలలో ప్రధానంగా నాలుగు అంశాలు నెలల తరబడి పతాక శీర్షికలలో ఉండేవి. మొదటిది- కళాశాల విద్యాభ్యాసం చేస్తున్న ముస్లిం విద్యార్థినులు ధరిస్తున్న శిరోవస్త్రం; రెండోది- ఆహారానికై అనేకమంది ముస్లింలు ఒక జంతువును చంపే పద్ధతి; మూడోది- పరస్పరం ప్రేమించుకున్న ముస్లిం యువకుడు, హిందూ యువతి వివాహం చేసుకోవాలని అభిలషించడం; నాలుగోది- ఇప్పుడు కర్ణాటకలో భాగంగా ఉన్న ఒక ప్రాంతాన్ని పాలించిన, రెండు శతాబ్దాల క్రితం బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాడుతూ చనిపోయిన ఒక రాజు చారిత్రక ప్రశస్తిపై వివాదం. హిజాబ్, హలాల్, లవ్ జిహాద్, టిప్పు సుల్తాన్.. ఇవీ, కర్ణాటక ఓటర్ల మద్దతుకై ప్రజ్వలింపచేసిన నాలుగు అంశాలు. మరోసారి జాగ్రత్తగా చదవండి.

నాడు కర్ణాటకలో అధికారంలో ఉన్న బీజేపీ పట్ల ప్రజల్లో సదభిప్రాయం లేదు. ముఖ్యమంత్రి పాలనాదక్షుడు కాడన్నదే ప్రజాభిప్రాయంగా ఉన్నది. ఫలితంగా ప్రభుత్వ వ్యతిరేకత పెరిగిపోతోంది. పార్టీకి ఎదురవుతున్న ఈ విషమ పరిస్థితిని ఢిల్లీలోని పార్టీ పెద్దలు గ్రహించారు. శాసనసభ ఎన్నికలలో గెలిచి తీరాలంటే హిందూ వర్సెస్ ముస్లిం అన్న భావోద్రేక అంశానికి ప్రాధాన్యమివ్వాలనే నిర్ణయానికి పార్టీ పెద్దలు వచ్చారు. హిజాబ్, హలాల్, మతాంతర వివాహాలపై ఆంక్షల ద్వారా భారతీయ ముస్లింలు భిన్నమైనవారు, అవిశ్వసనీయులని చిత్రించడం ద్వారా హిందూ జనాభాలో అత్యధికులను తన వెనుక సమీకరించుకోవడానికి బీజేపీ ప్రయత్నించింది. ఈ ఎజెండాకు అనుగుణంగా బీజేపీ వాట్సప్ ఫ్యాక్టరీ అనేక అసత్యాలను ఉత్పత్తి చేసింది. వాటిలో ఒకటి ప్రత్యేకంగా గమనార్హమైనది. టిప్పుసుల్తాన్‌ను చంపింది ఈస్టిండియా కంపెనీ సైనికులు కాదని, ఇద్దరు ఒక్కలిగ సిపాయిలు ఆ ఘాతుకానికి పాల్పడ్డారన్న ప్రచారం.

ఈ ఎత్తుగడలన్నీ విఫలమయ్యాయి. కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలిచింది. కాంగ్రెస్ విజయానికి రెండు కారణాలు దోహదం చేశాయి. ఒకటి-, ఉత్తరాది రాష్ట్రాలలో వలే కాకుండా కర్ణాటకలో కాంగ్రెస్‌కు ఇప్పటికీ గట్టిగా ఉన్న ప్రజాబలం (గ్రామగ్రామాన కాంగ్రెస్‌కు కార్యకర్తలు ఉన్నారు); రెండు,- పార్టీ విజయానికి కర్ణాటక కాంగ్రెస్ ప్రధాన నాయకులు సిద్దరామయ్య, డి.కె. శివకుమార్ కలిసికట్టుగా చేసిన కృషి. సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా, శివకుమార్ ఉపముఖ్యమంత్రిగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం గత నవంబర్‌లో ఆరు నెలల కాలాన్ని పూర్తి చేసుకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత హిజాబ్, హలాల్, టిప్పు సుల్తాన్ మొదలైన అంశాలు కాకుండా వ్యవసాయరంగ సమస్యలు, రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల దుస్థితి, బెంగళూరులో ప్రజా రవాణా వ్యవస్థ దురవస్థలు, ప్రభుత్వోద్యోగుల, అధికారుల బదిలీలలో అవినీతి, ఆశ్రితపక్షపాతం మొదలైనవి పతాక శీర్షికల్లో ఉంటున్నాయి.

ఈ మార్పు నాకు గొప్ప ఉపశమన భావం కలిగించింది. అయితే నా సంతృప్తి ఎంతో కాలం నిలవలేదు. మత సంబంధిత అంశాలు మళ్లీ పతాక శీర్షికలుగా కనిపిస్తున్నాయి. కొద్దినెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనుండడం, కర్ణాటకలో 28 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండడం అందుకొక కారణం. హిందూ ఓటర్లను తన వెనుక సుసంఘటితం చేసుకోవడానికి రాష్ట్ర బీజేపీ సరికొత్త ప్రయత్నాలు చేస్తోంది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ స్థానిక బీజేపీ శ్రేణులకు ఎక్కడలేని ధైర్యాన్నిచ్చింది. వారు యథేచ్ఛగా మళ్లీ మెజారిటీవాద రాజకీయాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మాండ్యా జిల్లాలో ఒక గ్రామంలో ఒక వివాదాన్ని రెచ్చగొట్టారు. బహిరంగ ప్రదేశంలో ఉన్న ఒక స్తంభంపై ఏ జెండాను ఎగురవేయాలన్నదే ఆ వివాదం! ఆ స్తంభం ఉన్న ప్రదేశం ఒక పురాతన హనుమాన్ కోవెలకు సమీపంలో ఉన్నందున దానిపై కాషాయ జెండాను ఎగురవేయాలని హిందూత్వ వాదులు పట్టుబడుతున్నారు. ఆ స్తంభం ప్రభుత్వ స్థలంలో ఉన్నందున దానిపై జాతీయపతాకాన్ని ఎగురవేయాలని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వాదిస్తున్నాయి.



2024 సార్వత్రిక ఎన్నికలను మధ్యయుగాల వైషమ్యాల, శత్రుత్వాల పేరిట పోరాడడానికి కర్ణాటకలోని బీజేపీ శ్రేణులు ఉద్యుక్తమవుతున్నాయి. కాంగ్రెస్ నాయకులు సైతం హిందువులను బుజ్జగించడానికి ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు తమ హిందూ మతనిష్ఠను ప్రదర్శిస్తున్నారు. హిందుత్వవాదుల పద్ధతులను అనుకరించడానికి కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రయత్నాలు వారి నైతిక దివాలాకోరుతనాన్ని చాటుతున్నాయి.

అదొక స్థానిక అంశం. అయితే బీజేపీ తన రాజకీయ ప్రయోజనాలకు దానిపై ఒక అనావశ్యక వివాదాన్ని సృష్టించింది. కర్ణాటక అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ఆర్. అశోకా ఆ గ్రామానికి వెళ్లి కాషాయ జెండాను ఎగురవేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకపోవడం హిందువులను అవమానించడమేనని గొంతు చించుకున్నారు. పెద్ద ర్యాలీని నిర్వహించారు. ఆ సందర్భంగా జరిగిన సభలో జనతాదళ్ (సెక్యులర్) నాయకుడు కుమారస్వామి (వ్యక్తిగత ప్రయోజనాలకు పార్టీ ఫిరాయింపులు చేయడంలో ఈయన బిహార్ నితీశ్ కుమార్‌కు సమ ఉజ్జీ) కూడా పాల్గొన్నారు. ఒక 'సెక్యులర్' పార్టీకి నాయకుడుగా ఉన్న కుమారస్వామి కాషాయ ఉత్తరీయాన్ని భుజాలపై కప్పుకుని ఆ సభలో ప్రసంగించారు. జనవరి చివరి వారంలో అన్ని పత్రికలలోనూ ఈ జెండా వివాదమే పతాక శీర్షికగా ఉన్నది. ఇంకా ఇతర బహిరంగ ప్రదేశాలలో కూడా కాషాయ జెండాను ఆవిష్కరించేందుకు బీజేపీ శ్రేణులు పూనుకున్నాయి. ఇదిలా వుండగా హిందువులు, ముస్లింల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ఎజెండాను అమలుపరిచేందుకు ఇతర ప్రయత్నాలు కూడ ముమ్మరమయ్యాయి. బీజేపీ సీనియర్ నేత సి.టి. రవి తమ కార్యకర్తల సమావేశంలో చేసిన ఒక ప్రసంగంపై ఫిబ్రవరి 2న 'డెక్కన్ హెరాల్డ్'లో ఒక వార్త వచ్చింది. బీదర్ జిల్లాలోని ఒక దర్గా నిజానికి 12వ శతాబ్దిలో హిందూ మత సంస్కర్త బసవన్న నిర్మించిన మండపం అని రవి అన్నారు. రాష్ట్రంలో బీజేపీ మళ్లీ అధికారానికి వస్తే బసవన్న నిర్మించిన మండపాన్ని పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు కాశీ విశ్వనాథ్— ఔరంగజేబ్ మధ్య, సోమనాథ్— గజనీ మహమ్మద్ మధ్య, హనుమాన్ — టిప్పు సుల్తాన్ మధ్య జరగనున్నాయని రవి అన్నారు. కాశీ, మథురలో ఆలయాలను నిర్మించేందుకు నరేంద్ర మోదీ మళ్లీ అధికారానికి రావాల్సిన అవసరముందన్నారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం


కర్ణాటక బీజేపీ నాయకులు ఇటువంటి ప్రకటనలను చేయడం కొత్త ఏమీ కాదు. అయితే, మరింత గమనార్హమైన విషయం మరొకటి ఉన్నది. అది: కర్ణాటక కాంగ్రెస్ నాయకులు సైతం రాజకీయాలూ, రాష్ట్ర పాలన మెజారిటీవాదానికి అనుగుణంగా ఉండి తీరాలని విశ్వసిస్తున్న హిందువులను సంతృప్తిపరచడానికి ప్రయత్నించడం. విస్మయమూ, విచారమూ కలిగిస్తోన్న విషయమిది. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరిగే జనవరి 22న విధిగా పూజలు నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి రాష్ట్రంలోని ఆలయాలు అన్నిటికీ ఆదేశాలు జారీ చేశారు. కేరళలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌ను విలేఖర్లు ఈ విషయమై ప్రశ్నించగా 'చూడండి, మనమందరమూ అంతిమంగా హిందువులమే కదా' అని అన్నారు. అయోధ్య ఉత్సవం అనంతరం రామలింగారెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ, కర్ణాటక వ్యాప్తంగా రామాలయాలకు మరమ్మతుల నిర్వహించేందుకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు విజ్ఞప్తి చేశానని కూడా వెల్లడించారు. నాకు తెలిసినంతవరకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈ విజ్ఞప్తికి బహిరంగంగా స్పందించలేదు. గతంలో ఆయన మెజారిటీవాద రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించేవారు. అయితే ఇటీవల ఆయన ప్రకటనలలో ఆ వ్యతిరేకత స్పష్టంగా కనిపించడం లేదు. అయోధ్యలో వేడుకలకు ప్రతిస్పందనగా ఆయన కూడ తన హిందూ మతనిష్ఠను ప్రదర్శించారు. స్వగ్రామానికి వెళ్లి రామాలయంలో పూజలు నిర్వహించారు, 'జై శ్రీరామ్' అని కూడా నినదించారు. హిందుత్వవాదులు చేసే ఈ నినాదాన్ని 1980లకు ముందు ఉత్తరాది రాష్ట్రాల్లో సైతం అరుదుగా మాత్రమే చేసేవారు. బహుశా రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే జైశ్రీరామ్ అని సిద్దరామయ్య ఘోషించి ఉంటారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో కర్ణాటకలో కాంగ్రెస్ ఒకే ఒక్క స్థానాన్ని గెలుచుకుంది. ఈసారి ఆ సంఖ్యాబలాన్ని పెంచుకోవల్సి ఉన్నది మరి.

హిందుత్వవాదుల పద్ధతులను అనుకరించడానికి కర్ణాటక కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు వారి నైతిక దివాలాకోరు తనాన్ని చాటుతున్నాయి. అంతిమంగా వారికి రాజకీయంగా లాభప్రదమయ్యే అవకాశాలూ తక్కువే. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో ఏం జరిగింది? ముఖ్యమంత్రులు భూపేష్ భగెల్, కమల్‌నాథ్‌లు తమ హిందూ మత నిష్ఠను బహిరంగంగా పదే పదే ప్రదర్శించారు. హిందూ మతతత్పరతను చాటుకునే విషయంలో బీజేపీకి ఏ పార్టీ కూడా సాటి కాదు, కాలేదు, కాబోదు. ఆ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు ఈ వాస్తవాన్ని స్పష్టం చేయలేదా?

దళిత కవిత్వానికి దారిదీపం

శ్రవణ కుమారుడిలా గుండె కావిట్లో దేశాన్ని మోస్తానని బాస చేసిన దేశభక్తుడెవరు? సీమాంతర ఉగ్రవాదం కంటే మనువాద టెర్రరిజం ప్రమాదకరమైనదని హితవు చెప్పిన అధునాతన జాతీయవాది ఎవరు? పురాతన మూర్ఖత్వాన్ని దివ్య విజ్ఞానంగా విద్యాలయాల్లో పిచికారి చేయవద్దని 'సరస్వతమ్మ గారికి వేన వేల దండాలు పెట్టిన జ్ఞానమూర్తి ఎవరు?' ఆరెలతో దూడతోళ్ళ మీద మహాకావ్యాలు రాస్తానని ప్రకటించిన పెడద్రపు కవి ఎవరు? కులమతాల అడ్డుగోడలు కూలిపోవాలని, దారిలోని మిట్టపల్లాలను చదును చేయాలని, 'నా సింహాసనం నాకు కావాలని' కాలాన్ని నిలదీసి ప్రశ్నించిన అసమాన కలం యోధుడు ఎవరు? శంబూకుడి మృతనేత్రాల నిప్పు చూపుల మీద కలాన్ని పదును పెట్టుకొని, భాషను అణగారిన వర్గాల యాసతో కడిగిన వెలివాడ 'భీమ' కవి ఎవరు?... వర్తమాన తెలుగు సాహిత్యంలో కనీ వినీ ఎరుగని ఒక పెను సంచలనం మద్దూరి నగేష్ బాబు కవిత్వం. దెబ్బ తిన్న బెబ్బులి పంజా విసిరినట్లు, వీరుడు సంధించిన బాణం శత్రువు గుండెలను ఛిద్రం చేసినట్లు కవిత్వం రాసిన కవి. వాడ కోడిపుంజులకు వేడి వేడి మేలుకొలుపు గీతాలను నేర్పి, దళిత సాహిత్యోద్యమానికి 'పెన్ను దన్ను'గా నిలిచిన కవి. ఒక అగ్ని తుఫానులా సాహిత్యంలోకి దూసుకువచ్చి తాత్విక బంధురమైన, దళిత కళాతత్త్వ సుందరమైన మహాకర్తృత్వాన్ని వాగ్దానం చేసి, గగనమెక్కిన కవన నక్షత్రం నగేష్ బాబు.

గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం రుద్రారం గ్రామంలో 1964 ఆగస్టు 15న అనసూయమ్మ, జకరయ్య దంపతులకు నగేష్ బాబు జన్మించాడు. నరసరావుపేట లూథరన్ హైస్కూల్లో పదవతరగతి వరకు చదువుకొని, గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కళాశాలలో ఇంటర్, బి.ఎ డిగ్రీని పూర్తిచేసి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఎ పట్టా అందుకున్నాడు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 'తెలుగు, ఆఫ్రికన్ దళిత కవిత్వం—తులనాత్మక పరిశీలన' అనే అంశంపై ఎం.ఫిల్ చేశాడు. ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రంలో వ్యాఖ్యాతగా, ఆ తరువాత డిప్యూటీ తహసీల్దార్‌గా, మండల రెవెన్యూ ఆఫీసర్‌గా, బాపట్ల, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాడు. సమర్థుడైన అధికారిగా అందరి మన్ననలను అందుకున్న నగేష్ బాబు అనారోగ్యంతో 2005, జనవరి 10న మరణించాడు.



ఆధిపత్య సంస్కృతి ఆరాధించే సమస్త భావజాలాన్ని తిరస్కరించి, అట్టడుగు వర్గాల సాంస్కృతిక వైభవాన్ని మద్దూరి నగేష్ బాబు తన కవిత్వం ద్వారా ఉన్నతీకరించాడు. దళిత కవిత్వానికి నిబద్ధుడై ఎత్తిన కలం దించకుండా అట్టడుగువర్గాల బతుకు వెతలను అక్షరబద్ధం చేశాడు.

ప్రారంభ దశలో ప్రేమకవిత్వం రాసిన నగేష్ బాబు, కారంచేడు మారణకాండ అనంతరం దళిత మహాసభ రగిలించిన ఆత్మగౌరవ పోరాట చైతన్యంతో, చారిత్రాత్మక సంకలనం 'చిక్కనవుతున్న పాట' బాటలో, ఉధృతమైన దళిత సాహిత్య ప్రభావంతో, దళిత కవిత్వానికి నిబద్ధుడై ఎత్తిన కలం దించకుండా అట్టడుగువర్గాల బతుకు వెతలను అక్షరబద్ధం చేశాడు. వెలివాడ, మీరేవుట్లూ, లోయ, నరలోక ప్రార్థన కవితా సంపుటాలతో నగేష్ బాబు దళిత సాహిత్య వికాసానికి ఎంతగానో తోడ్పడ్డాడు. బ్రాహ్మణవాదాన్ని దుయ్యబడుతూ ప్రతీకాత్మకంగా ఆయన రాసిన గోదావరి, పుట్ట, దీర్ఘ కవితలు విశిష్టమైనవి. నగేష్ బాబు, జి.లక్ష్మీనరసయ్య, పైడి తెరేష్‌బాబు, ఖాజా రాసిన ధిక్కార కవితలతో కూడిన 'నిశాని' సంకలనం అనేక సాహిత్య చర్చలకు కేంద్రబిందువయింది. రమణ్ లింబార్కర్, బాబూరావు బాగుల్, అరుణ్ కాంబ్లే, ప్రియా అదార్కర్ వంటి సుప్రసిద్ధ కవుల కవితలను తెలుగులోకి అనువదించి భారతీయ సాహిత్యంలోని దళితవాద భావధారను నగేష్ బాబు తెలుగు పాఠకులకు పరిచయం చేశాడు. బాలగంగాధర తిలక్ లాగా కేవలం దశాబ్దికాలం పాటు రచనలు చేసి, తెలుగు కవిత్వంపై ప్రగాఢమైన ముద్రవేశాడు. ప్రజల వ్యవహారానికి సామీప్యంగా పద్యాన్ని ఆధునీకరించిన జాషువా లాగా నగేష్ బాబు తెలుగు వచనకవిత్వ స్వరూప స్వభావాలను దళితీకరించాడు.

దళిత సాహిత్యంలోని అనేక ధోరణులకి నగేష్ బాబు నారుపోసి నీరుపోశాడు. గ్రామీణ ఆర్థిక, సాంఘిక వ్యవస్థలో దగ్ధమైపోతున్న దళితస్త్రీ జీవితాన్ని 'రచ్చబండ' దీర్ఘకవితలో ప్రతిభావంతంగా బొమ్మకట్టించాడు. ప్రత్యేక తెలంగాణతో పాటు, మాదిగ, గిరిజన హక్కుల పోరాటాలకు అండగా నిలబడ్డాడు. 'ఉమ్మడి కడుపు మంటని ప్రసాదించే పథకాలను రద్దు చేసి, ఎవడి ముద్ద వాడే తిందాం పదండి' అని పిలుపునిచ్చాడు. బ్రాహ్మణవాదాన్ని ఎంత తీవ్రంగా ఖండించాడో, మాల బ్రాహ్మల్ని, మాదిగ శాస్త్రుల్నీ కూడా అంతే ఆగ్రహంతో వ్యతిరేకించాడు. దళిత, గిరిజన, బహుజన, ముస్లింల ఐక్యతను నగేష్ బాబు అభిలషించాడు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన తాత్వికతను, ఆయన ప్రతిపాదించిన 'మాస్టర్ కీ' మహత్వాన్ని తన కవిత్వంలో సూటిగా చాటి చెప్పాడు.

నగేష్ బాబు ఒక వటవృక్షంలా కాకుండా నల్లకలువల ఉద్యానవనంలా ప్రతినిత్యం పరిమళించాడు. ఒకవైపు తాను కవిగా ఎదుగుతూనే తన మిత్రుల్ని, కొత్తతరం యువకులను దళిత కవులుగా తీర్చిదిద్దాడు. వారి రచనలకు విస్తృతమైన ప్రాచుర్యం కల్పించాడు. ఖాజాతో కలిసి దళిత, బహుజన సాహిత్య ఉద్యమాలకు సాంస్కృతిక ఆలంబనగా నిలిచే విలక్షణ సంకలనాలకు నగేష్ బాబు సంపాదకత్వం వహించాడు. దళితవాదానికి సంపూర్ణ మద్దతునిస్తూ ప్రాబల్యవర్గాల కవులు రాసిన కవితల్ని సేకరించి, దళిత సంఘీభావ కవిత్వంగా ప్రచురించడంలో నగేష్ బాబు చేసిన కృషి చారిత్రాత్మకమైనది. 'కాస్త సిగ్గుపడదాం' అనే పేరుతో వెలువడిన ఈ సంకలనం తెలుగు కవిత్వంలో నిర్మాణాత్మకమైన సంఘీభావానికి తార్కాణం. కులనిర్మూలనా పోరాట స్ఫూర్తిని ప్రబోధిస్తూ దళిత కవులు రాసిన ప్రేమకవితలతో మద్దూరి 'విడి ఆకాశం' పేరుతో కవితా సంకలనాన్ని ప్రచురించాడు. రాణీ శివశంకరశర్మతో కలిసి వెలువరించిన 'ఊరూవాడ' సంకర కవిత కూడా సమకాలీన కవిత్వంలో మంచి ప్రయోగం. ఈ విధంగా బహుముఖీనమైన కృషితో నగేష్ బాబు దళిత కవిత్వంలో గొప్పవైవిధ్యాన్ని సాధించాడు.

పల్నాటి పౌరుషాగ్ని జ్వాలలు, పరిశుద్ధ గ్రంథం బైబిల్‌లో ప్రవహించే కరుణా తరంగాలు ఏకోన్ముఖంగా సంగమించినట్లుగా నగేష్ బాబు కవిత్వం కనబడుతుంది. మరాఠీ దళితకవుల్లోని జీవన తాత్విక దృష్టి, బ్లాక్ పొయెట్రీలోని సౌందర్యం, అన్నింటికీ మించి అద్భుతమైన నాటకీయత, సజీవమైన దేశీయత ఆయన కవిత్వం నిండా దర్శనమిస్తాయి. అంటరానివాడ పలుకుబడిని, నుడికారాన్ని, జాతీయాలను పుంఖాను పుంఖాలుగా ప్రయోగించడం వల్ల మద్దూరి కవిత్వంలో దళిత కళాతత్త్వం ఉట్టిపడుతుంది. దళితవాదానికి ఉచితమైన కొత్త కవి సమయాలను, అపూర్వ సృజన పరికరాలను సమకూర్చుకొని కవితా రూపంలో వినూత్న ఒరవడిని సాధించాడు.


'దున్నపోతుమీద కురిసిన వాన' అనే పలుకుబడికి బదులుగా 'కామధేనువు మీద కురిసిన వాన' అని, 'అడవిగాచిన వెన్నెల'కు బదులుగా 'తులసివనాల్లో కాసిన వెన్నెల' అని నగేష్ బాబు వ్యూహాత్మకంగా ప్రత్యామ్నాయ పదబంధాలను వినిర్మించాడు. 'పవిత్రత' అనే పదాన్ని కనుగొన్న వాణ్ణి ఖైమాకొట్టి, కోయిళ్ళకీ హంసలకీ వేయాలంటాడు కానీ పొరపాటున కూడా కాకులకు, గద్దలకు అని మాత్రం రాయడు. మతోన్మాదం, కులోన్మాదం విషతుల్యమైన అసహనం దశదిశలా బుసలుకొడుతున్న సందర్భంలో ఫాసిజం దేశమంతా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ ప్రతీఘాత శక్తులతో యుద్ధం చేయడానికి 'బహుజన కెరటాలు' ప్రచురించిన నగేష్ బాబు సమగ్ర కవిత్వం పదునైన తాత్విక ఆయుధంగా ఉపయోగపడుతుంది.

● డాక్టర్ కోయి కోటేశ్వరరావు

(నేడు గుంటూరులో మద్దూరి నగేష్ బాబు సమగ్రకవిత్వం పుస్తక ఆవిష్కరణ సభ)

దేశాభివృద్ధికి దీనదయాళ్ దిశానిర్దేశం

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సామాన్య కుటుంబంలో 1916 సెప్టెంబర్ 25న జన్మించి అసమాన ప్రతిభాపాటవాలతో దేశం గర్వించదగ్గ వ్యక్తిగా ఎదిగారు. విద్యాభ్యాసం అనంతరం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో ప్రచారక్ జీవితాన్ని ప్రారంభించి, 1951లో భారతీయ జనసంఘ్ ఏర్పడుతున్న తరుణంలో ఆరెస్సెస్ నుంచి రాజకీయ క్షేత్రం జనసంఘ్ ప్రచారకులుగా నియమితులయ్యారు. అఖిల భారత అధ్యక్షులుగా పాట్నాకు రైలులో ప్రయాణిస్తున్న దీనదయాళ్ ఉపాధ్యాయ 1968 ఫిబ్రవరి 11న మొఘల్ సరాయ్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం వద్ద విగతజీవిగా పడి ఉన్నారు. వారి మరణం గురించి ఇప్పటివరకు అసలు నిజాలు వెలుగులోకి రాలేదు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవతావాదం భారతదేశం సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందటానికి తాత్విక పునాదిని అందిస్తుంది. ఏకాత్మ మానవతావాదం తాత్విక సిద్ధాంతంతో 2047 వరకు అభివృద్ధి చెందిన దేశంగా 'వికసిత్ భారత్–2047' భావనతో పరిపూర్ణం అవుతుంది.



దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతం వ్యక్తి నిర్మాణం, అభివృద్ధితోపాటు సమాజం నిర్మాణం, సమాజం అభివృద్ధిని ధర్మ మార్గంలో నడిపిస్తుంది. వ్యక్తి శరీరం, మనస్సు, బుద్ధి, ఆత్మల కలయిక వలెనే సమాజం కూడా ప్రజలు అనే శరీరం, సంకల్పం అనే మనస్సు, ధర్మం అనే బుద్ధి, ఆదర్శాలు అనే ఆత్మను కలిగి ఉంటుంది. వ్యక్తితో పాటు సమాజం కూడా చతుర్విధ పురుషార్థాలను (ధర్మ, అర్థ, కామ, మోక్షం) ఆచరించినప్పుడు వ్యక్తి, సమాజం పరస్పరం అభివృద్ధి చెంది, మానవత్వం పునాదిగా దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. అదేవిధంగా ఆధ్యాత్మిక సాంస్కృతిక పురోగతితో పాటు భౌతిక పురోగతిని కాంక్షిస్తూ సంఘర్షణ రహిత సమాజం నిర్మాణానికి ఈ సిద్ధాంతం దోహదపడుతుంది.

వికసిత్ భారత్–2047 ప్రాథమిక లక్ష్యాలలో స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధించడం ప్రధానమైనది. భారత ఆర్థిక వ్యవస్థ తయారీ, సేవలు, వ్యవసాయం సాంకేతికతతో సహా బహుళ రంగాలలో వైవిధ్యభరితంగా ఉంటుంది. కొత్త పరిశ్రమలు వ్యాపారాలు ప్రోత్సాహం పొందుతాయి, ఇది ఉద్యోగ కల్పనకు దారితీసి, నిరుద్యోగాన్ని తగ్గిస్తుంది. పునరుత్పాదక ఇంధన వనరులు, పర్యావరణ అనుకూల పద్ధతులపై దృష్టి సారించి, స్థిరమైన అభివృద్ధికి ప్రాధాన్యత లభిస్తుంది. ఏ దేశానికైనా భవిష్యత్తు విద్యావ్యవస్థ నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం, నాణ్యమైన విద్యను పొందేలా చేయడం పౌరులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలుచేయడమే వికసిత్ భారత్ లక్ష్యం. అభివృద్ధి చెందిన దేశానికి పటిష్ఠమైన మౌలిక సదుపాయాల వ్యవస్థ, హైవేలు, రైల్వేలు, విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీలు, గ్రామీణ ప్రాంతాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. వికసిత్ భారత్–2047 భావన ద్వారా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకోవడంలో సామాజిక న్యాయం, సమాజంలోని అట్టడుగు వర్గాలను ఉద్ధరించడానికి సామాజిక సంక్షేమ కార్యక్రమాలు రూపొందుతాయి. భారత ప్రభుత్వం ఏకాత్మ మానవవాదం తాత్విక సిద్ధాంతం ఆధారంగా ఆత్మనిర్భర్, అంత్యోదయ భావనలతో అనేక పథకాల రూపకల్పన చేసి, పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తుంది. ఇందులో భాగంగానే ఉజ్వల యోజన, జన్‌ధన్ ఖాతాలు, ప్రధాని ఆవాస్ యోజన, ప్రధానమంత్రి సడక్ యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, దీనదయాళ్ గ్రామజ్యోతి యోజన, దీనదయాళ్ కౌశల్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, బేటీ బచావో–బేటి పడావో వంటి పథకాలతో సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అనే నినాదంతో భారత ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

పండిట్ దీనదయాళ్ తాత్విక సిద్ధాంతాల పునాదుల మీద 2047 నాటికి వికసిత్ భారత్, స్వదేశీ, స్వశక్తి, స్వాభిమానం, స్వావలంబన దిశగా సాగుతుంది. సంపన్న భారత్ నిర్మాణానికి ప్రభుత్వంతో పాటు యువత కూడా కృషి చేయడమే దీనదయాళ్ ఉపాధ్యాయకు మనం ఇచ్చే ఘన నివాళి.

– డా. శ్రీశైలం వీరమల్ల
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇగ్నో, న్యూఢిల్లీ









వందనాలమ్మా..!

గుణదల లూర్దు మాత శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

విద్యుత్ దీప అలంకరణతో, భారీగా తరలివచ్చిన విశ్వాసులతో గుణదల లూర్దు మాత శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. మూడ్రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను బిషప్ గ్రాసీ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. లూర్దుమాత స్వరూపాన్ని ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన కళావేదికపై విజయవాడ కతోలికపీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ సందేశమిచ్చారు. - గుణదల

టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి ఎన్టీఆర్ జిల్లాలో అపూర్వ స్వాగతం లభించింది. జనసమీకరణ లేకపోయినా స్వచ్ఛందంగా వచ్చిన కార్యకర్తలు, మహిళలు నీరాజనం పలికారు. భారీ స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఆమె నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పర్యటించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంపై ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరించారు. ఇటీవల మృతి చెందిన దేవినేని చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి

నిజాన్ని గెలిపిద్దాం

భువనమ్మకు ఘనస్వాగతం!

- జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో భువనేశ్వరి పిలుపు
- 'నిజం గెలవాలి'కి పోటెత్తిన మహిళలు

నందిగామ/చందర్లపాడు/జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 9 : 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారా భువనేశ్వరి నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పర్యటించారు. ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరిన ఆమె తొలుత కంచికచర్లలోని ఉమా నివాసానికి వచ్చిన ఆమె ఉమా సోదరుడు చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రశేఖర్ సతీమణి పల్లవి, కుమారుడు సూర్య ప్రదీప్, కుమార్తె సిరిచందనను ఓదార్చారు. ఉమ తల్లి సీతమ్మ, ఇతర కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం నందిగామ మీదగా చందర్లపాడు మండలం కోనాయపాలెం చేరుకున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్థాపానికి గురై మృతి చెందిన వనపర్తి మల్లికార్జునరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లికార్జునరావు భార్య కస్తూరి, ఆయన కుమార్తెలను ఓదార్చారు. తెలుదేశం పార్టీ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తమ కుటుంబ సభ్యుడిని కోల్పోయామన్న బాధ కలుగుతుందని భువనేశ్వరి అన్నారు. మీ త్యాగాలను, మీ అభిమానాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. మూడు లక్షల రూపాయల చెక్కును మల్లికార్జునరావు సతీమణికి అందజేశారు. అనంతరం జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలుకు చెందిన అలవాల గోపయ్య, గౌరవరానికి చెందిన కుక్కల ప్రకాశ్‌రావు, బలుసుపాడుకు చెందిన గండమాల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాట ఆవిష్కరణ

విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహనరావు దంపతులు 'నిజం గెలవాలి' కార్యక్రమంపై రూపొందించిన ప్రత్యేక వీడియో గీతాన్ని భువనేశ్వరి ఆవిష్కరించారు. ఆ వీడియోను ఆమె ఆసక్తిగా తిలకించారు. మంచిపాట తయారుచేయించారంటూ గద్దె దంపతులను ప్రశంసించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి, కేశినేని ఫౌండేషన్ అధినేత కేశినేని శివనాథ్, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దే అనూరాధ, ఆచంట సునీత, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తంబళ్లపల్లి రమాదేవి, కనపర్తి శ్రీనివాసరావు, చంద్రబాబు ప్రోగాం కమిటీ కోఆర్డినేటర్ బండారు హనుమంతురావు పాల్గొన్నారు. తెలుగు యువత నాయకులు సజ్జా అజయ్, చింతోటి మౌళేశ్వరరావు తదితరులు ఆమెకు జ్ఞాపికను అందజేశారు.



పెనుగంచిప్రోలులో ఆలవాల గోపయ్య కుటుంబ సభ్యులకు చెక్ అందిస్తున్న భువనేశ్వరి

• అడుగడుగునా నీరాజనం

పరామర్శలకు వస్తున్న నేపథ్యంలో ఎక్కడా హడావిడి చేయవద్దని, జనసమీకరణ వద్దని నేతలకు భువనేశ్వరి స్పష్టంగా సూచించారు. నేతలు జనసమీకరణకు దూరంగా ఉన్నా కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున కోనాయపాలెం చేరుకున్నారు. నందిగామ నుంచి కోనాయపాలెం వరకూ మహిళలు రోడ్ల వెంట నిలబడి ఆమెకు స్వాగతం పలికారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం పది గంటలకు ఆమె కోనాయపాలెం రావల్సి ఉండగా, 12:20కి చేరుకున్నారు. ఎండ, ఉక్కపోతలను సైతం లెక్క చేయకుండా మహిళలు అప్పటి వరకు ఆమె కోసం వేచి ఉన్నారు. భువనేశ్వరి కాన్వాయ్ గ్రామంలోకి చేరగానే మహిళలు నినాదాలతో హోరెత్తించారు. వనపర్తి మల్లికార్జునరావు కుటుంబ సభ్యుల పరామర్శ అనంతరం బయటకు వచ్చిన భువనేశ్వరిని మాట్లాడాల్సిందిగా మహిళలు పట్టుబట్టారు. వారి ఒత్తిడికి తలొగ్గిన ఆమె కొద్దిసేపు ప్రసంగించారు. మహిళలు ఆమెతో ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. కోనాయపాలెం నుంచి బలుసుపాడు వరకు దారి పొడవునా మహిళలు భువనేశ్వరికి ఘనస్వాగతం పలికారు. కోనాయపాలెం ఊరి బయట మహిళలు పెద్దఎత్తున భువనేశ్వరి కోసం వేచి ఉన్నారు. చేతులు ఎత్తి దండం పెడుతున్న మహిళలను చూసి భువనేశ్వరి కాన్వాయ్ ఆపారు. తొలుత కారు నుండే వారికి అభివాదం చేసిన అనంతరం కారు దిగారు. పంట పొలాల మధ్య ఆకస్మికంగా కారు ఆపి భువనేశ్వరి దిగడంతో సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన చెందారు. వారి అభ్యంతరాన్ని సైతం లెక్క చేయకుండా మహిళల వద్దకు వచ్చిన భువనేశ్వరి కరచాలనం చేశారు. పలుచోట్ల భువనేశ్వరికి తెలుగుయువత నాయకులు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వరి పర్యటన ఆద్యంతం బైక్ ర్యాలీలతో హోరెత్తించారు.

102 ఎస్‌జీటీ... 107ఎస్‌ఏ పోస్టులు

కొద్దిపాటి మార్పులతో డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాకు కేటాయింపు

జిల్లాలో డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల భర్తీలో ప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది. జిల్లా విద్యాశాఖ నుంచి ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా లేవని ప్రభుత్వానికి నివేదిక పంపినా, ఈ నివేదికను పక్కనపెట్టి ఉన్నతాధికారుల సూచనల మేరకు 102 ఎస్‌జీటీ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు ఇచ్చినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించి జిల్లా విద్యాశాఖ పంపిన నివేదిక ఆధారంగా 107 పోస్టులను యథాతథంగా భర్తీ చేసేందుకు అనుమతులు ఇచ్చింది.

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : తెలుగు 9, హిందీ 7, ఇంగ్లీష్ 34, లెక్కలు 24, ఫిజికల్ సైన్స్ 5, బయలాజికల్ సైన్స్ 15, పీఈటీలు 13 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. జిల్లాలో ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా లేవని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి గతంలో నివేదికను పంపారు. ప్రభుత్వం మొదట జారీ చేసిన ఉత్తర్వుల్లో కృష్ణాజిల్లాకు ఎస్‌జీటీ పోస్టులు సున్నాగా చూపింది. ఉన్నతాధికారులు సూచనలతో ఎస్‌జీటీ పోస్టులను పెంచామని, ఉమ్మడి కృష్ణాజిల్లాలో 102 ఎస్‌జీటీ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు ఇస్తున్నామని ప్రభుత్వం ఇటీవల జారీచేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

కర్నూలు జిల్లాలో ఎస్‌జీటీ పోస్టులు తగ్గించి..

మొదట జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో కర్నూలు జిల్లాలో 1646 ఎస్‌జీటీ పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు ఇచ్చారు. కృష్ణాజిల్లాతో పాటు మరో నాలుగైదు జిల్లాలో ఎస్‌జీటీ పోస్టులను జీరోగా చూపారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల సూచనలతో కర్నూలు జిల్లాలో ఎస్‌జీటీ పోస్టుల సంఖ్యను 1012కు కుదించారు. ఆ పోస్టులను ఇతర జిల్లాలకు సర్దుబాటు చేశారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో ఎస్‌జీటీ పోస్టులు అధికంగా ఉన్న నేపథ్యంలో నాన్‌లోకల్ కోటాలో 20 శాతం పోస్టులను ఇతర జిల్లాలకు చెందిన ఎస్‌జీటీలకు ఇచ్చే అవకాశం ఉంది. నాన్‌లోకల్ కోటాలో కూడా స్థానికులకు మార్కులు అధికంగా వస్తే వారికి పోస్టులు ఇచ్చిన తరువాతనే ఇతర జిల్లాల వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని, ఈ కారణంతోనే కర్నూలు జిల్లాలో ఎస్‌జీటీ పోస్టులలో కోత పెట్టి వాటిని మిగిలిన జిల్లాలకు కేటాయించారని

- మిగతా 4లో

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 9 : అప్పుల బాధ తాళలేక కౌలురైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జగ్గయ్యపేట మండలంలోని రామచంద్రునిపేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రునిపేటకు చెందిన కౌలు రైతు పద్మాల రాము (35) నాలుగెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి సాగు చేశాడు. రూ.ఐదు లక్షల వరకు అప్పులు అయ్యాయి. పంట దిగుబడులు రాక, అప్పుల వత్తిళ్ల తట్టుకోలేక బుధవారం ఉదయం తాను సాగు చేస్తున్న పొలంలోనే పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు.

పశ్చిమలో చందాల శీను!

వెలంపల్లిపై చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

- మాయలమరారి ఎమ్మెల్సీ రుహుల్లా
- బొండా ఉమా ఫైర్

- 4లో..

తెలుగు ప్రధానికి సముచిత గౌరవం

- పీవీ, స్వామినాథన్‌లకు భారతరత్న ప్రకటించడంపై పలువురి హర్షం

గుణదల మినీ ఫ్లైఓవర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకుంది. గుణదల - మున్న ప్రాంతానికి ఎంతో కీలకమైన ఈ మినీ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు రూ.45 కోట్లను కేటాయించినట్టే కేటాయించి ఏకంగా ఈ ప్రాజెక్టు నుంచే ప్రభుత్వం తప్పుకుంది. నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో గుణదల ఫ్లై ఓవర్ మళ్లీ మొదటికి వచ్చింది. మినీ ఫ్లై ఓవర్ మార్గంలో రైల్వే లైన్ ఉంది. ఈ రైల్వే మార్గాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం గతి శక్తి పథకంలో భాగంగా ఫ్లైఓవర్‌ను తలపెట్టేందుకు అంగీకరించాల్సిందిగా ప్రతిపాదించింది.



మా వల్ల కాదు.. మీరే చేయండి!

గుణదల ఫ్లైఓవర్ నిర్మాణం నుంచి తప్పుకున్న రాష్ట్ర ప్రభుత్వం


- కేంద్ర ప్రభుత్వానికి బదలాయింపు
- రూ.45 కోట్లు ఇవ్వలేక వెనకడుగు
- గతిశక్తి పథకం కింద కేంద్రం చేపట్టాల్సిందిగా ప్రతిపాదన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కేంద్ర ప్రభుత్వం గతిశక్తి పథకంలో భాగంగా రైల్వేకు సంబంధించి పెద్దఎత్తున ఆర్‌వోబీ, ఆర్‌యూబీలకు నిధులు మంజూరు చేస్తోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని గుణదల మినీ ఫ్లై ఓవర్‌ను కూడా గతిశక్తి పథకంలోకి తీసుకురాగలిగితే.. చేతికి ఖర్చు కాదని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ మార్గంలో రైల్వేలైన్‌ను అడ్డుపెట్టుకుని గతిశక్తిలోకి చేర్చాల్సిందిగా ప్రభుత్వం నుంచి రహస్యంగా రెండు నెలల కిందటే ప్రతిపాదన వెళ్లింది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను హోల్డ్‌లో పెట్టేసింది. దీంతో గుణదల

- మిగతా 4లో

గన్నవరంలో వంశీ గ్యాంగ్ హల్‌చల్

ఎలాగూ గెలవలేం! బెదిరింపులతో కానిచ్చేద్దాం!



గన్నవరం నియోజకవర్గ వైసీపీలో చిత్రమైన పరిస్థితి నెలకొంది. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలిచి వైసీపీ పంచన చేరిన వల్లభనేని వంశీకి ఈసారి టికెట్ ఇస్తారా? లేదా? అన్న అంశాన్ని వైసీపీ అధిష్ఠానం ఇంత వరకు ఖరారు చేయలేదు. ఈ కారణంగా వంశీ కూడా నిన్నమొన్నటి వరకు నియోజకవర్గ చాయలకే రాలేదు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉంటున్నా పర్యటనలు మాత్రం చేయడం లేదు. టికెట్ వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఓవైపు, వచ్చినా గెలుస్తామో లేదోనన్న భయం మరోవైపు వంశీ అనుచరులను వెంటాడుతోంది. నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లోనూ ప్రస్తుతం ఇదే ప్రధాన చర్చనీయాంశంగా ఉంది. ఈ పరిస్థితుల్లో తన వైసీపీ శ్రేణుల దృష్టి మరల్చేందుకు వంశీ అనుచరగణం బెదిరింపుల దందాకు తెరతీసింది. టీడీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడటం.. టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న వ్యాపారులు, ఇతర వర్గాల వారిని టార్గెట్ చేసి వారి నుంచి ఎన్నికల నిధుల పేరుతో వసూళ్లు చేయడం వంటి కార్యక్రమాలకు తెరదీసింది.

- ఎన్నికల నిధుల కోసం వ్యాపారులకు బెదిరింపులు
- టీడీపీ నాయకులను భయపెట్టేందుకు దాడులు
- అందులో భాగమే రంగబాబుపై దాడి
- ఈ కేసులో నిందితులకు బెయిలు
- భారీ ర్యాలీతో హడావిడి చేసిన వంశీ అనుచరులు
- జాతీయరహదారిపై భారీ ఎత్తున నిలిచిన ట్రాఫిక్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీది తొలి నుంచి ప్రత్యర్థిని భయభ్రాంతులకు గురిచేసి దాన్ని ఆసరాగా చేసుకుని గెలుపు సాధించాలని చూసే తత్వం. గత ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థిగా ఉన్న వెంకట్రావుకు చాలెంజ్‌లు విసిరి, ఫోన్లు చేయడం, వాటికి స్పందించక పోతే తనను చూసి భయపడ్డారని ప్రచారం చేయడం వంటి జిమ్మిక్కులు చాలానే చేశారు. ఇలాంటి వాటి ద్వారా తాను ప్రత్యర్థి కన్నా బలవంతుడిననే సందేశాన్ని నియోజకవర్గ ప్రజలకు పంపడమే ఆయన లక్ష్యం.

బరితెగించి దాడులు..

వల్లభనేని వంశీని ఈసారి భయం వెంటాడుతోంది. అసలు టికెట్ వస్తుందా రాదా అన్న భయం ఒకటైతే.. టికెట్ తెచ్చుకున్నా గెలుస్తామా లేదా అన్న భయం మరొకటి. దీంతో చురుగ్గా ఉన్న టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారు. టీడీపీ సానుభూతిపరులుగా ఉన్న వ్యాపారులు, ఇతర వర్గాలను బెదిరించి వారు టీడీపీకి నిధులు ఇవ్వకుండా.. పనిచేయకుండా చూసేందుకు వంశీ అనుచరులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా కొద్దిరోజుల క్రితం గన్నవరానికి చెందిన టీడీపీ నాయకుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై ఎమ్మెల్యే వంశీ అనుచరులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాపులపాడు మండలానికి చెందిన పలువురు వ్యాపారుల ఇళ్లకు వెళ్లిన వంశీ అనుచరులు వారిని టీడీపీకి పనిచేయవద్దని, కాదని పనిచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోనాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల నిధులు పంపాలని వారికి హుకుం జారీ చేసినట్లు తెలిసింది. వాస్తవానికి వీరంతా గత ఎన్నికల్లో వంశీకి భారీ మొత్తంలో ఎన్నికల నిధులు సమకూర్చినవారు కావడం గమనార్హం.

నేరం మీద వేసుకున్నందుకు ఘనస్వాగతం

గన్నవరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా సుపారీ గ్యాంగుల సంస్కృతికి సిటింగ్ ఎమ్మెల్యే వంశీ అనుచరులు తెరదీశారు. అందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సుపారీ గ్యాంగ్‌తో టీడీపీ నాయకుడు రంగబాబుపై దాడి చేయించారు. ఈ కేసులో గన్నవరం ఎమ్మెల్యే వంశీకి అత్యంత సన్నిహితుడైన రంగా వెనుక తిరిగే దళితుడు ముగ్గిరాల చిరంజీవిని ప్రధాన నిందితుడిగా ఇరికించేశారు. ఈ కేసులో చిరంజీవితోసహా ఐదుగురు నిందితులకు శుక్రవారం బెయిల్ లభించింది. తమ మాట విని జైలుకు వెళ్లి వచ్చిన చిరంజీవికి వంశీ అనుచరులు ఘనస్వాగతం పలికారు. పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. పనిలో పనిగా టీడీపీ ఫ్లెక్సీలను చించివేసి హడావిడి చేశారు. వీరి హడావిడితో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పెద్ద ఎత్తున జామ్ అయింది. ఓ అంబులెన్స్ ట్రాఫిక్ జాంలో చిక్కుకు పోయింది. వంశీ అనుచరులు సైలెన్సర్లు పీకేసిన బైకులతో టీడీపీ కార్యాలయం ఎదుట హల్‌చల్ చేశారు. టీడీపీ నాయకులను రెచ్చగొట్టేలా నినాదాలు చేశారు. అయినా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ ఉండిపోయారే తప్ప వారిని నిలువరించే ప్రయత్నం చేయలేదు.

14 నుంచి 18 వరకు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునరుద్ధరణ పనులు



వన్‌టౌన్, ఫిబ్రవరి 9 : ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునరుద్ధరణ కార్యక్రమాలు ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయని ఈవో కేఎస్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైదిక కమిటీ చేసిన సూచనల మేరకు ఆలయ పునరుద్ధరణ, నూతన ధ్వజస్తంభ సహిత స్వర్ణ శిఖర ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకాలను నిర్వహించనున్నారు.

11 నుంచి మాఘమాస విశేష కార్యక్రమాలు

ఈనెల 10 నుంచి మాఘమాసం సందర్భంగా మార్చి 10 వతేదీ వరకు నటరాజస్వామి ఆలయంలో ప్రతి ఆదివారం ఆర్జిత సేవగా సూర్యోపాసన సేవ చేయనున్నారు. 11వ తేదీ ఆదివారం శుద్ధ విదియ, 14వ తేదీ శ్రీపంచమి, 16వ తేదీ రథసప్తమి, 18 వతేదీ ఆదివారం, 20 వతేదీ భీష్మఏకాదశి, 24 వతేదీ మాఘపూర్ణిమ, 25వతేదీ ఆదివారం మార్చి 3 వతేదీ ఆదివారం, 6వతేదీ బహుళ ఏకాదశి, 10 వతేదీ అమావాస్య రోజుల్లో సూర్యోపాసన సేవ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, దంపతులు రూ. 1,000 రుసుం చెల్లించి పాల్గొనవచ్చునని చెప్పారు. శ్రీచక్రార్చన లడ్డు ఒకటి, శేషవస్త్రం రవిక, 100 గ్రాముల గోధుమపొంగలి ప్రసాదంగా అందజేస్తారు. 14 వతేదీ శ్రీపంచమి సందర్భంగా అమ్మవారి మూలవిరాట్టు, ఉత్సవ మూర్తులకు సరస్వతీ దేవిగా అలంకారం చేస్తారు. చిన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన శాలలో సరస్వతిదేవి హవనం, ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాఠశాల, కళాశాల విద్యార్థులకు అమ్మవారి ఉచిత దర్శనం కల్పిస్తారు. అయితే విద్యార్థులు గుర్తింపుకార్డు, యూనిఫారం ధరించి రావాల్సి ఉంటుంది. ఉచిత క్యూ ద్వారా ముఖమండప దర్శనం చేసుకునే వీలుంది. రక్షా కంకణం, కుంకుమ, పెన్ను, అమ్మవారి ప్యాకెట్ సైజు ఫొటో ఇస్తారు.

హనుమాన్ నృత్య కళానిలయ బృంద నాట్య ప్రదర్శన

దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై హనుమాన్ నృత్య కళానిలయం కె.శ్రీనివాస్ బృందం శుక్రవారం నాట్య ప్రదర్శన చేసింది. వినాయక కౌతం మొదలుకుని పది కీర్తనలకు నాట్యం చేశారు. ఉమా భారతి, కె.హరిణి కె.విద్య, ఎం.నిత్యశ్రీ, తన్విత, శ్రీవల్లి, కవిష్య తదితరులు పాల్గొన్నారు.



చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో సమావేశమైన కలెక్టర్ ఢిల్లీరావు

బాలల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 9 : బాలల హక్కులు, సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. బాలల సంరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాలల చట్టాల అమలు వంటి అంశాల్లో తీసుకొంటున్న చర్యలపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 18 బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా 907 మంది బాలలకు రక్షణ కల్పించడం జరిగిందన్నారు. వీరికి పూర్తిస్థాయిలో సంరక్షణ అందించి ప్రయోజకులను చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాలల భద్రత శ్రేయస్సుకు సంబంధించి ప్రభావితం చేసే సమస్యలపై కమిటీ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఓపెన్ షెల్టర్స్‌లో ఆశ్రయం పొందుతున్న వీధి బాలల వివరాలను సేకరించి పూర్తిస్థాయి విచారణ జరిపిన అనంతరం తల్లిదండ్రులు, సంరక్షకులకు అప్పగించాలని, ఎవరూ ముందుకురాని అనాథలను బాలల గృహాలలో పూర్తి సంరక్షణ తీసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బాలల గృహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారికి కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించాలన్నారు. పిల్లల సంరక్షణ, రక్షణ చట్టంలో పొందుపరిచిన బాలల హక్కులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రొబేషన్ అధికారి జె.సత్యవతి, ఏడీపీవో టి.జ్యోతి, ఆర్‌ఐపీ వెంకటపతిరాజు, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు, దిశ సీఐ అహ్మదున్నీసా, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, సిడబ్ల్యూసీ చైర్‌పర్సన్ సువార్త, కమిటీ మెంబర్లు రాధారాణి, రాజకుమార్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం వేడుకలు ప్రారంభం

కృష్ణలంక : దేశంలోనే ధాన్యాగారంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవసాయదారులకు అమూల్యమైన సేవలు అందిస్తున్న వ్యవసాయ శాఖ సామాజిక సేవలో కూడా భాగస్వాములు కావడం అభినందనీయమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ ఉద్యోగుల సంఘం 65 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా శుక్రవారం వెంకటేశ్వరనగర్ కాలనీలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులు సామాజిక సేవలో కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయదారుల సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకొంటున్న చర్యలకు ఉద్యోగుల తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ వైద్యులు టి.రమణారావు అధ్వర్యంలో ఉద్యోగుల నుంచి రక్త సేకరణ జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ అధికారుల సంఘం నాయకులు బాలభాస్కర్, డి.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో కొండవీడు ఫెస్ట్ : ఢిల్లీరావు

కృష్ణలంక : ఈనెల 10, 11 తేదీల్లో పల్నాడు జిల్లా, కొండవీడు కోటలో ఆహ్లాదకర వాతావరణంలో వినూత్న కార్యక్రమాలతో కొండవీడు ఫెస్ట్-2024 జరగనుందని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు తదితరులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చారిత్రక వైభవానికి గుర్తుగా వున్న కొండవీడు కోట వద్ద ఈనెల 10, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. హెలీరైడ్, పారా మోటారింగ్, హాట్ ఎయిర్‌బెలూన్, రాక్ క్లైంబింగ్, కయాకింగ్ బోటింగ్, హార్స్ రైడింగ్, సైకత శిల్ప ప్రదర్శన, ఫ్లవర్ షో వంటివి ఉంటాయన్నారు. చారిత్రక ఛాయాచిత్ర ప్రదర్శనతో పాటు ఫుడ్‌ఫెస్ట్, సైకత శిల్ప ప్రదర్శన, డాన్స్ పోటీలు, చిల్డ్రన్స్ ప్లే ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

విద్యుత్ బిల్లుల షాక్!

▸▸ వినియోగదారుల ఆందోళన



బిల్లు చూపుతున్న సత్యనారాయణ, సర్పంచ్ నాగరాణి

విస్సన్నపేట, ఫిబ్రవరి 9 : ప్రభుత్వం విద్యుత్ చార్జీలు, టాక్స్‌ల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపుతోంది. బిల్లులు చూసి వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. తెల్లదేవరపల్లి గ్రామానికి చెందిన రాయల సత్యనారాయణ సర్వీసు నెంబరు 100కు ఇంట్లో ఏసీ ఉన్నదనే కారణంగా రూ.7,200లు అడిషనల్ లోడు పేరుతో కట్టించుకున్నారు. ఆ బిల్లు కట్టినా కొత్తగా వచ్చిన బిల్లు రూ.9,800లు రావడంతో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెల్లదేవరపల్లి సొసైటీ కార్యాలయ సమీపంలో గ్రామ పంచాయతీ వారు ప్రజలకు తాగునీరు అందించేందుకు డైరెక్ట్ పంపింగ్‌స్కీమ్ కింద ఏర్పాటు చేసిన మోటారుకు బిల్లు 206 యూనిట్లకు గాను రూ.29,325 రావడంతో సర్పంచ్ రాయల నాగరాణి విస్తుపోయారు.

ఎన్టీటీపీఎస్‌లో వేతనాల కోసం ధర్నా



ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ మెయిన్ గేటు వద్ద ఇంజనీర్లు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున వేతనాల కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీర్స్ అసోసియేషన్ నేత శ్రీధర్ మాట్లాడుతూ, 9వ తేదీ వచ్చినా ఇంకా జీతాలు చెల్లించకపోవడం బాధకరమన్నారు. యాజమాన్యం తీరుకు నిరసనగా ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. వేతన సవరణలో అన్యాయం జరిగినప్పటికీ బకాయిలు, పెండింగ్ డీఏలు, కనీస నెలసరి వేతనాలను సకాలంలో చెల్లించకుండా ప్రభుత్వం, యజమాన్యాలు ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వాపోయారు. విద్యుత్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు, బకాయిలు చెల్లించే విధంగా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ఆర్.శ్రీనివాసరావు, జె.శ్రీను, డి.వి రమణ, రాధాకృష్ణ, వెంకట్రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



భక్తులను ఆశీర్వదిస్తున్న గురువులు





భక్తి తన్మయత్వం

వందనాలమ్మ

▸▸ వైభవంగా గుణదల మాత శతాబ్ది మహోత్సవాలు ప్రారంభం



గుణదల, ఫిబ్రవ 9 : గుణదల మరియమాత శతాబ్ది మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గురువులతో కలిసి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం నుంచి వేదిక వరకు లూర్దుమాత స్వరూపాన్ని ఊరేగించారు. ఉదయం 7గంటలకు కళావేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి లూర్దుమాత వంద వసంతాల వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు భక్తులకు సందేశమిస్తూ.. దేవుని తల్లి అయిన మరియమాత వినయ విధేయతలతో, భక్తి పూర్వకంగా జీవించిందన్నారు. అనంతరం గోల్డెన్ జూబిలేరియన్ గురువు ఫాదర్ తోపిల్ మాత్యూ, సిల్వర్ జూబిలేరియన్ గురువులు ఫాదర్ బొడ్డు ఆనందబాబు, ఫాదర్ దాసి సురేష్, ఫాదర్ మందపాటి లూయిస్ రాజులతో కలిసి బిషప్ రాజారావు దివ్యపూజాబలి సమర్పించారు.

ఉత్సవాలకు 1500 మందితో బందోబస్తు

గుణదల మాత ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఎదురు కాకుండా 1500 మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా సీపీ కాంతి రాణా తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం ఆయన స్వయంగా పరిశీలించారు. ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. మూవింగ్ పార్టీల ఏర్పాటు, భక్తుల రద్దీపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకునేలా మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ఉత్సవాలకు వచ్చే దారులన్నీ పరిశీలించి ట్రాఫిక్‌కు అంతరాయం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశరు. కార్యక్రమంలో డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు, సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కరరావు, మాచవరం సీఐ గుణరామ్ తదితరులు పాల్గొన్నారు.



గుణదల క్షేత్ర వద్ద బందోస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీపీ కాంతిరాణా

దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, ఫిబ్రవరి 9 : ఎన్టీఆర్ జిల్లాలోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త, నాలుగు ఆయా పోస్టులను రోస్టర్ విధానంలో భర్తీ చేయనున్నట్టు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి జి.ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్బన్, రూరల్ మండలం, చిల్లకల్లు నందిగామ, తిరువూరు పరిధిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీలను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. మినీ అంగన్వావాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అభ్యర్థులు 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి 10వ తరగతి ఉత్తీర్ణత పొంది, స్థానిక వివాహితులు మాత్రమే దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులన్నారు. అభ్యర్థులు సీడీపీవో ఆఫీస్‌ను సంప్రదించి ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవలసి వుంటుందన్నారు. ఇతర వివరాలకు సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయ అధికారులను సంప్రదించాలన్నారు.

చిట్టిపాలెంలో శ్మశానం విషయమై రగడ

▸▸ ఖననం చేసిన మృతదేహం వెలికి తీసి ఆందోళన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 9 : బందరు మండలం చిట్టిపాలెంలో శుక్రవారం సాయంత్రం శ్మశానంలో క్రైస్తవ మృతదేహం ఖననం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. హిందూ శ్మశాన వాటిక గేట్లు పగలగొట్టి క్రైస్తవ మహిళ కళావతిని ఖననం చేశారు. దీనిపై గ్రామస్థులు కొందరు అభ్యంతరం తెలిపారు. పూడ్చివేసిన మహిళ మృతదేహాన్ని బయటకు తీయడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. క్రైస్తవులు ఎవరైనా మృతి చెందితే బందరు వచ్చి ఖననం చేయాల్సిన పరిస్థితి ఉందని.. దీనిపై ఎమ్మెల్యే పేర్ని నానిని పలుమార్లు కలిసి శ్మశాన వాటికకు స్థలం కోరినా కేటాయించకపోవడంతో క్రైస్తవులు నిరసనకు దిగారు. దీంతో ఎస్‌ఐ చాణక్య, తహసీల్దార్ శ్రీవిద్యలు ఆందోళనకారులతో చర్చలు జరిపి క్రైస్తవులకు గ్రామంలోని 10 సెంట్ల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించంతో ఇరువర్గాలు శాంతించారు.

బందరు విద్యార్థి బెంగళూరులో మృతి



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 9 : మచిలీపట్నం నాయర్‌బడ్డీ సెంటర్‌లో బేకరి నడుపుతున్న వ్యాపారవేత్త కుమారుడు గిరీష్ బెంగళూరులో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. దీంతో గిరీష్ తల్లిదండ్రులు హుటాహుటి బెంగుళూరు వెళ్లారు.

102 ఎస్‌జీటీ.. 107ఎస్‌ఏ పోస్టులు

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని బట్టి సెకండరీగ్రేడ్ టీచర్లు ఉమ్మడి జిల్లాలో 730 మందికిపైగా మిగులుబాటుగా ఉన్నట్టు గతంలో జిల్లా విద్యాశాఖ అధికారులు లెక్కలు చూపారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక ఎస్‌జీటీ పనిచేయాల్సిన చోట ఇద్దరు ఎస్‌జీటీలు పనిచేస్తున్నారనే నివేదికను ప్రభుత్వానికి పంపామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నివేదికను కాదని డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాలో ఎస్‌జీటీ పోస్టులు 102 భర్తీ చేస్తామని ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సంబంధించి 107 పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని జిల్లా విద్యాశాఖ పంపిన ప్రతిపాదనలను యథాతథంగానే ఉంచారు. వీటితోపాటు ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ)పోస్టులను మరో 65గా చూపారు. ఈ పోస్టులు గురుకుల, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో భర్తీ చేయనున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించి టీచర్ పోస్టుల్లో భవిష్యత్తులో మరెన్ని మార్పులు, చేర్పులు చోటుచేసుకుంటాయనే ఆందోళనలో డీఈడీ, బీఈడీ నిరుద్యోగులు ఉన్నారు.

మా వల్ల కాదు.. మీరే చేయండి!

(5వ పేజీ తరువాయి)

మినీ ఫ్లై ఓవర్ భవితవ్యం డోలాయమానంలో పడింది.

నిర్మాణం ఆగిపోవడానికి కారణమిదే..

గుణదల ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు పదిహేనేళ్ల కిందటే ప్రారంభమయ్యాయి. అప్పట్లో రాజకీయ కారణాల రీత్యా ఫ్లై ఓవర్ డిజైన్‌లో మార్పులు చేయటంతో.. కాంట్రాక్టు సంస్థ మారిన అలైన్‌మెంట్ ప్రకారం పనులు చేయటానికి అసక్తి చూపలేదు. మారిన అలైన్‌మెంట్ ప్రకారం పనులు చేయాల్సి వస్తే కాంట్రాక్టు సంస్థకు భారీగా నష్టం వాటిల్లే అవకాశాలు ఉండటంతో.. అప్పట్లో ఆ సంస్థ పనులను అర్థంతరంగా నిలుపుదల చేసింది.

ఫ్లై ఓవర్‌తో ఎంతో మేలు

విజయవాడ శివారు ప్రాంతమైన నున్న నుంచి ప్రజలు విజయవాడకు రావటానికి గుణదల ఫ్లై ఓవర్ ఎంతగానో దోహదపడుతుంది. నున్న నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా ఏలూరు రోడ్డుకు అనుసంధానమయ్యే మార్గంలో మినీ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ మార్గం చాలా ఇరుగ్గా ఉంటుంది. నున్న నుంచి బెజవాడకు రాకపోకలన్నీ ఈ మార్గంలోనే ఉంటాయి. ఈ మార్గంలో రైల్వేలైన్ ఉండటం వల్ల తరచూ గేటు పడుతుంటుంది. గేటు పడిన ప్రతిసారీ రెండు, మూడు రైళ్లు వెళ్లే వరకు ఆగాల్సి వస్తోంది. ఈ కారణంగా ఈ రోడ్డులో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ ట్రాఫిక్ ఏలూరు రోడ్డు మీదకు కూడా చేరుతోంది. దీంతో ఏలూరు రోడ్డు మీద రాకపోకలకు కూడా తీవ్ర ఆటంకం కలుగుతుంది. పదిహేనేళ్లుగా స్థానిక ప్రజలు ఫ్లై ఓవర్‌ను పూర్తి చేయాల్సిందిగా ప్రభుత్వాలను అభ్యర్థిస్తున్నా వారి కల మాత్రం సాకారం కావటం లేదు.

రూ.45 కోట్లు ఇవ్వలేని రాష్ట్ర ప్రభుత్వం

ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంబంధించి ఆర్‌అండ్‌బీ అధికారులు మార్చిన అలైన్‌మెంట్ ప్రకారం భూములు కావాల్సి ఉందని ప్రతిపాదించారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులు అక్కడ ఉన్న ప్రజలను ఖాళీ చేయించి ప్రత్యామ్నాయంగా ఇళ్లను కేటాయించింది. కొందరికి నష్టపరిహారం కూడా ఇచ్చింది. ఇటీవల కాలంలో ఖాళీ చేసిన ఇళ్లను కూలగొట్టి చదును కూడా చేయించింది. మినీ ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులూ, ఇబ్బందులూ లేవు. ఈ దశలో ఆర్‌అండ్‌బీ అధికారులు మినీ ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.45 కోట్లు ఖర్చు అవుతుందని, డబ్బులు కావాలని ప్రభుత్వానికి రాశారు. ప్రభుత్వం సానుకూలతను వ్యక్తం చేసింది. ఇంకేముంది డబ్బులు వస్తాయి. పనులు మొదలు పెట్టడమే అనుకుంటే.. డబ్బులు రాకపోగా ఈ ప్రాజెక్టు నుంచే ప్రభుత్వం తప్పుకుని కేంద్రానికి బదలాయించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టతా రాకపోవటంతో ఈ ప్రాజెక్టు డైలమాలో పడింది.

విశ్రాంత సివిల్ ఇంజనీర్ కొల్లి వెంకటేశ్వరరావు ఆకస్మిక మృతి

పటమట, ఫిబ్రవరి 9 : ప్రముఖ విశ్రాంత సివిల్ ఇంజనీర్ కొల్లి వెంకటేశ్వరరావు (86) విజయవాడ గాయత్రీనగర్‌లో శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. 1938 ఆగస్టు 7న గుడివాడ సమీపంలోని జమీదింటకుర్రు గ్రామంలో వెంకట సుబ్బారావు, విమలావతి దంపతులకు ఆయన జన్మించారు. ఆయనకు ఇద్దరు తమ్ముళ్లు, సోదరి ఉన్నారు. స్కూల్ విద్యాభ్యాసం అంతా వానపాముల హైస్కూల్‌లో పూర్తి చేసారు. డిప్లొమా ఇన్



కొల్లి వెంకటేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న గద్దె రామ్మోహన్, బొప్పన

సివిల్ ఇంజనీరింగ్ పట్టాను కాకినాడ కాలేజి నుంచి అందుకున్నారు. ఇరిగేషన్ ఇంజనీర్‌గా వెంకటేశ్వరరావు సుదీర్ఘ కాలం పనిచేసారు. సీఈగా 13 కాలేజీలకు ఆయన పనిచేశారు. సుదీర్ఘ కాలం ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసిన వారికి గుర్తింపుగా ఇచ్చే వెటరన్ ఇంజనీర్ అవార్డును 2014 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు హయాంలో ఆయన అందుకున్నారు. 1996 సంవత్సరంలో ఎస్‌ఈగా పదవీ విరమణ చేసారు. వెంకటేశ్వరరావు అకాల మరణం పట్ల నగర ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ నేత బొప్పన భవకుమార్, వైసీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాశ్‌లు వెంకటేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

దేవినేని చంద్రశేఖర్‌కు నారా భువనేశ్వరి నివాళి

కంచికచర్ల రూరల్ : మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సోదరుడు చంద్రశేఖర్‌కు చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఘనంగా నివాళులర్పించారు. కంచికచర్లలోని దేవినేని ఉమా ఇంటికి శుక్రవారం ఆమె విచ్చేసి చంద్రశేఖర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చంద్రశేఖర్ సతీమణి పల్లవి కుటుంబసభ్యులను ఆమె ఓదార్చారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, తంగిరాల సౌమ్య, కొనకళ్ల నారాయణ, నెట్టం రఘురాం, కేశినేని శివనాథ్ (చిన్ని), లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, కనపర్తి శ్రీనివాసరావు, పామర్తి కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి

పశ్చిమలో చందాల శీను!

▸▸ వెలంపల్లిపై చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

▸▸ మాయలమరాఠి ఎమ్మెల్సీ రుహుల్లా

▸▸ బొండా ఉమా ఫైర్



పాయకాపురం, ఫిబ్రవరి 9 : పశ్చిమ నియోజకవర్గంలో వెలంపల్లి 'చందాల శీను'గా పేరు తెచ్చుకున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరావు ఎద్దేవా చేశారు. ప్రశాంతంగా సెంట్రల్ నియోజకవర్గంలో వెలంపల్లి వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడని, ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు నిబంధనలు బేఖాతరు చేస్తున్నాడని ఆరోపించారు. వెలంపల్లిపై పోలీసులు, ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో బొండా ఉమా మాట్లాడుతూ, పశ్చిమలో చెల్లని పైసా వెలంపల్లి శ్రీనివాసరావు అని, సెంట్రల్ నియోజకవర్గంలోకి వచ్చి తాటాకు చప్పుళ్లు చేస్తున్నాడని విమర్శించారు. రౌడీషీటర్లతో పాదయాత్ర చేస్తూ డబ్బులు విరజిమ్మి ఎన్నికల్లో లబ్ధిపొందాలని నక్కజిత్తులు పన్నుతున్నాడని, సెంట్రల్‌లో అతడి ఎత్తులు పారవని అన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి కుక్కర్లు, నగదు పంపిణీపై సత్యనారాయణపురం, నున్న, అజిత్‌సింగ్‌నగర్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లను వెలంపల్లితో పాటు, ఎమ్మెల్సీ రుహుల్లా, డిప్యూటీ మేయర్ అవుతు శైలజలు ప్రలోభపెట్టి తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించారని, వారిపై అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని.. లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. రూహుల్లా పెద్ద మాయలమరాఠీ అని నియోజకవర్గంలో పంపిణీ చేసిన కుక్కర్లు పశ్చిమ నియోజకవర్గంలో ఓ కంపెనీకి చెందిన వ్యాపారిని బెదిరించి తీసుకున్నారని ఆరోపించారు.




పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కొనకళ్ల నారాయణ, తదితరులు

తెలుగు ప్రధానికి సముచిత గౌరవం

▸▸ పీవీ, స్వామినాథన్‌లకు భారత రత్న ప్రకటించడంపై పలువురి హర్షం

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ, ఫిబ్రవరి 9 : మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగుప్రజలు గర్వించదగిన విషయమని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ పార్కు వద్ద ఉన్న పీవీ విగ్రహానికి శుక్రవారం కొనకళ్ల నారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, విగ్రహ కమిటీ కార్యదర్శి పీవీ ఫణికుమార్, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్లు పంచారు. బార్ అసోసియేషన్ హాలులో పీవీ చిత్రపటానికి అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బుద్ధప్రసాద్ హర్షం

తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు, హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్‌లకు భారత రత్న ప్రకటించటం పట్ల మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గాంధీక్షేత్రంలో పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అవనిగడ్డలో శాశ్వత మేజిస్ట్రేట్ కోర్టు, జూనియర్ కళాశాలలు మంజూరు చేశారని గుర్తుచేశారు. స్వామినాథన్ ఫౌండేషన్ ద్వారా దివి ప్రాంతంలో తీర ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. టీడీపీ నాయకులు మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్

చిట్టినగర్ : హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్, మాజీ ప్రధానులు దివంగత చౌదరి చరణ్‌సింగ్, పీవీ నరసింహారావులకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం హర్షణీయమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుజాతి ముద్దు బిడ్డ దేశ ఆర్థిక సంస్కరణల రూపకర్త పీవీకి అవార్డు రావడం తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	136, 145, 156
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

మత్తు అనర్థాలపై అవగాహన

పాయకాపురం, ఫిబ్రవరి 9 : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ నగర పాలక సంస్థ పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బాల భవన్ జోనల్ కో-ఆర్డినేటర్ కె. ప్రియాంక మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కే నజ్మా, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పీవీ చిత్రపటానికి పాలాభిషేకం

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 9: దేశానికి పీవీ చేసిన సేవలు గుర్తింపుగా భారతప్రభుత్వం భారత రత్న అవార్డు ఇవ్వడం సంతోషదాయకమని ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. సత్యనారాయణపురం, శివాజీకేఫ్ సెంటర్‌లో, గిరివీధిలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం పీవీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

పోటీతత్వం అలవర్చుకుంటేనే భవిష్యత్తు



మొగల్రాజపురంలోని జనశిక్షణా సంస్థాన్‌లో మహిళా ఉత్సవంలో పాల్గొని ప్రతిభ కనబర్చిన ఔత్సాహికులు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 9: నేటి పోటీ ప్రపంచంలో రాణించాలన్నా, లక్ష్యాన్ని చేరుకోవాలన్నా పోటీతత్వం అలవర్చుకుంటేనే సాధ్యపడుతుందని మహిళా పారిశ్రామికవేత్త సీహెచ్ సత్య అన్నారు. మహిళా ఉత్సవంలో భాగంగా మొగల్రాజపురంలోని జనశిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో ఏడో రోజు శుక్రవారం నిర్వహించిన ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పోటీలకు పలువురు మహిళలు ఆసక్తిగా పాల్గొన్నారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ప్రతిభకనబర్చిన వారికి జనశిక్షణా సంస్థాన్ ఛైర్ పర్సన్ డాక్టర్ ఎస్.విద్యాకన్నా మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా సీనియర్ రిసోర్స్ పర్సన్స్ పి.వరలక్ష్మి, ఎన్.సునీత వ్యవహరించారు. జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ పాల్గొన్నారు.

పిల్లల పెంపకంలో అప్రమత్తంగా ఉండాలి

కోలవెన్ను (కంకిపాడు), ఫిబ్రవరి 9 : పిల్లలను పెంచే విధానంలో తల్లిదండ్రులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని న్యాయాధికారి పి.రాజారాం అన్నారు. వెట్టిచాకరి నిర్మూలన దినోత్సవం సందర్భంగా కోలవెన్నులో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ, పెద్దపెద్ద కంపెనీల్లో చిన్నారులతో అక్రమంగా వెట్టి చాకరి చేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పై చార్యులు, సర్పంచ్ సీహెచ్ సురేష్, వైస్ సర్పంచ్ చిన్ని పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



గానం చేస్తున్న గాగర్లపూడి నాగార్జున, రమణ శీలం, ఇందు నైనా తదితరులు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9 : పాడవోయి భారతీయుడా ఆడి పాడవోయి విజయగీతికా, ఖుషీ ఖుషీగా నవ్వుతూ... వదంతే సితారే తదితర తెలుగు, హిందీ చిత్రాల పాటల మాలికతో శ్రోతలను పరవశింపజేశారు. బొమ్మినేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో ఆ పాత మధురాలు పేరిట మొగల్రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం సినీ సంగీత విభావరి జరిగింది. పాడుతాతీయగా సోలో ఆర్కెస్ట్రాగా పనిచేస్తున్న సీనియర్ కళాకారులు సాయిప్రసాద్, సాయిప్రకాష్ కీబోర్డుపై, శర్వాన్ షాడ్స్‌పై, బాబీ గిటార్‌పై, సాయికిరణ్ తబలపై వాయిద్య సాకారం అందించగా సీనియర్ గాయనీ గాయకులు శీలం రమణ, జాగర్లపూడి నాగార్జున, ఇందునైనా, నందిత జ్యోతి గానం చేసి ప్రేక్షకులను అలరించారు. సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఎన్.లలిత ప్రసాద్, సభ్యులు తాతినేని శ్రీహరిరావు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఒత్తిళ్లను ఆపాలి

కమిషనర్‌కు మునిసిపల్ కార్మికుల వినతి



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న మునిసిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు

చిట్టినగర్, ఫిబ్రవరి 9 : మునిసిపల్ వర్కర్లకు ఆదివారం, గురువారం సెలవు తీసుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు శుక్రవారం మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.జ్యోతిబాసు, టి. ప్రవీణ్, స్టీఫెన్ బాబు, టి.తిరుపతమ్మ, జి.కృష్ణవేణి, పార్క్ చిన్న వాటర్ సెక్షన్ జైపాల్, సీహెచ్ నరేష్ వినతి పత్రం అందజేశారు. ఇటీవల జరిగిన 17 రోజుల సమ్మెకాలానికి వేతనం ఇవ్వాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఒత్తిడి చేయకుండా చూడాలని, యూనిఫాం, సబ్బులు, చెప్పులు, కొబ్బరి చీపుళ్లు తదితర అంశాలను ప్రస్తావించారు దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఆదివారం, గురువారం పని చేయాలని తాము ఆదేశాలు ఇవ్వలేదని, అయితే వర్కర్ల ఇష్టం మేరకు పని చేయవచ్చునని, పనిచేస్తేడబ్బులు ఇస్తామని తెలిపారు. మిగతా అంశాలపై వారం రోజుల్లో పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బొండా ఉమా

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

పాయకాపురం, ఫిబ్రవరి 9 : ప్రజా వ్యతిరేకతతో సీఎం జగన్ నమ్మకాన్ని కోల్పోతున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. వైసీపీ, ఇతర పార్టీలకు చెందిన పోతాడి నాగరాజు, వీర్ల చిన్నబాబు, కుంభ దాసు, పున్నాన నరసింహారావులతో పాటు 200 మంది శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో బొండా ఉమా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పైడి శ్రీను, నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత అల్లూరికి సతీ వియోగం

కృష్ణలంక, ఫిబ్రవరి 9 : సుదీర్ఘకాలం నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన కాపుసంఘం నేత, జనసేన నాయకులు, కృష్ణలంక లాల్‌బహదూర్ శాస్త్రి వీధికి చెందిన అల్లూరి రామ్మోహన్ సతీమణి అల్లూరి శ్రీదేవి (52) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. శ్రీదేవి పార్థీవదేహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీపీఎం నాయకులు సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్, కాపుసంఘం నేత ఆకుల శ్రీనివాసకుమార్, అల్లం రాజేష్, రాధారంగా మిత్ర మండలి నాయకులు చెన్నుపాటి శ్రీనివాస్, కొప్పుల వెంకట్, 21వ డివిజన్ కార్పొరేటర్ పుప్పాల కుమారి, అమరావతి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నిమ్మల జ్యోతిక, తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం

టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నాయకుడు ఆర్ మాధవ్



గాంధీ మార్కెట్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీలో ఆర్ మాధవ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 9 : జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారని టీడీపీ పశ్చిమ నియోజక వర్గ నాయకుడు ఆర్.మాధవ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని గాంధీ మార్కెట్‌లో శుక్రవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమమం నిర్వహించారు. టీడీపీ -జనసేన ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకతను, మానిఫెస్టోను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గూడేల మహేష్ కోనేటి శ్రావణ్, పైడిపాటి సాయి కిరణ్, యువరాజ్, పిల్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ కె.సునీత

చిట్టినగర్, ఫిబ్రవరి 9: పౌష్టికాహారంతో చిన్నారులను వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని చిట్టినగర్ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కె.సునీత అన్నారు. చిట్టినగర్ చైతన్య స్కూల్‌లో హెల్దీ లైఫ్ స్టైల్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వివిధ రకాల వంటకాలను తయారు చేయించి చిన్నారులకు తినిపించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రాజేష్‌బాబు, సెకండరీ డీన్ నరేష్, ప్రైమరీ ఇన్‌చార్జీ లక్ష్మీదుర్గ, మీనాక్షీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాపుల అభ్యున్నతికి ఐక్యంగా పనిచేయాలి



సంఘీభావం తెలుపుతున్న ప్రజాకాపునాడు సంక్షేమం సంఘం నాయకులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 9 : కాపుల అభ్యున్నతికి, సంక్షేమానికి కాపు నాయకులు ఐక్యంగా పనిచేయాలని ప్రజాకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి సాయి అన్నారు. నగరంలోని 37వ డివిజన్ ప్రజాకాపునాడు అధ్యక్షుడిగా బావిశెట్టి వెంకట రమేష్ నాయుడుకు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల రాజును నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాపు మహిళలకు ప్రభుత్వం పెళ్లి కానుకను ప్రవేశపెట్టి అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు సంఘీభావం తెలిపారు. నాయకులు గణపరాము, తణుకు శంకర్ నాయుడు,కర్రి గౌరి, పలిశెట్టి కనకారావు, ఆలమూరు సాంబ శివరావు,సూరా బత్తుల రమేష్, రాంబాబు, ఇజ్జాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యంతోనే విద్యార్థుల రాణింపు



ఎన్ ఎస్ ఎస్ విద్యార్థుల ర్యాలీ

వన్‌టౌన్, ఫిబ్రవరి 9 : సామాజిక చైతన్యంతోనే విద్యార్థులు రాణించగలుగుతారని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి అన్నారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గొల్లపూడిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సేవా శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీలతో పాటు సామాజిక స్పృహను కలిగి ఉండాలని సూచించారు. గొల్లపూడి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గొల్లపూడి జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, అధ్యాపకులు నవీన్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం, ఫిబ్రవరి 9 : భవానీపురం పరిధిలో ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ టీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్డు, హైవే రోడ్డు, వెంకటేశ్వరఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్డు, బేతపూడి అరుణకుమారిరోడ్డు, బాజీబాబా మందిరంరోడ్డు, సభాపతి రోడ్డు, ఓట్ ఏజెన్సీ, మీరా సాహెబ్ రోడ్డు వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అజిత్‌సింగ్‌నగర్ : అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ టీవీ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా అమరావతి కాలనీ, సుబ్బరాజునగర్, సుందరమ్మదిబ్బ, న్యూ రాజరాజేశ్వరిపేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సత్యనారాయణపురం : ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ భగత్‌సింగ్‌రోడ్డు ఫీడర్‌లో శనివారం ఉదయం 8 నుంచి 12గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు టౌన్ ఈఈ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్ కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా శ్రీనగర్‌కాలనీ మెయిన్‌రోడ్డు, జెండా చెట్టు ఏరియా, భగత్‌సింగ్‌రోడ్డు, కృష్ణా అపార్టుమెంట్ రోడ్డు, గంగానమ్మగుడి ఏరియా, భగత్‌సింగ్ మెయిన్ రోడ్డులో సరఫరాకు అంతరాయం కలుగుతందన్నారు.

● మధురానగర్ సెక్షన్‌లో దుర్గాపురం గులాబి తోట, భానునగర్ , ప్రభుత్వసంగీత కళాశాల, ఐనాక్స్ రోడ్డు, రజకవీధి, ఫౌండ్రీవీధి, విఘ్నేశ్వర టెంపుల్ వీధి, శ్రీశైలం వారి వీధి, నందమూరి నరసింహారావు, గణపతిరావు, రాజీవ్ గాంధీ, సాంబమూర్తిరోడ్డు, పున్నయ్యకాలనీ, సాయిప్రసన్న వీధి, సాయిబాబా, కునపురెడ్డి వీధి, మోహన్‌గాంధీవీధి, కాకర్లమూడి వారి వీధి, గులాబీతోట రోడ్డు, బీఆర్టీఎస్‌రోడ్డు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఒక్క చాన్స్‌తో ప్రజల నెత్తిన అప్పులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 9 : ఒక్కచాన్స్ ఇవ్వండి అని ముద్దులు, నెత్తిన చేతులు పెట్టి ప్రాధేయ పడిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఒరగబెట్టిందేమి లేకపోగా ప్రజలనెత్తిన అప్పులు భారం పెట్టారని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆరోపించారు. ఉయ్యూరు2వ వార్డులో శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించి బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

మైనార్టీలకు తీవ్ర ద్రోహం

పెనమలూరు : నాలుగున్నరేళ్ల పాలనలో మైనార్టీలకు తీవ్ర ద్రోహం చేసిన జగన్‌రెడ్డికి తిరిగి ఓట్లు అడిగే హక్కుందా అని టీడీపీ యువనేత బోడె వెంకట్రామ్ అన్నారు. శుక్రవారం సనత్‌నగర్ రేకుల మసీదు సెంటరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ముస్లిం పెద్దలతో మైనారిటీల సమస్యలపై చర్చించారు. వెంకట్రామ్ వెంట రెహమాన్, షేక్ బుజ్జి, రియాజ్, ఇమాం, రఫీ, ఇక్బాల్, సమీర్ ఉన్నారు.

చోడవరం పాదయాత్రలో బోడె హేమ

చోడవరంలో జరిగిన పాదయాత్రలో బోడె సతీమణి హేమ ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు కోయ ఆనంద్‌ప్రసాద్, కలపాల శ్రీధర్, తుమ్మల రాంకుమార్, చోడవరపు హేమలత, పాల్గొన్నారు.



ఉయ్యూరులో బోడె ప్రసాద్‌కు స్వాగతం



గుణదలమాత వంద వసంతాల వేడుకలను జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్న రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు

వైభవంగా గుణదల మాత శతాబ్ది మహోత్సవాలు ప్రారంభం

విజయవాడ (గుణదల), ఫిబ్రవరి 9: శ్రీ సభలో లూర్దుమాత ఆధ్యాత్మిక తల్లిగా భక్తులకు వరాలు అందిస్తూ విరాజిల్లుతోందని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. గుణదల లూర్దుమాత శతాబ్ది మహోత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా డయోసిస్ గురువులతో కలిసి బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం నుంచి బిషప్ గ్రాసీ ఉన్నతపాఠశాల మైదనంలో ఏర్పాటు చేసిన వేదిక వరకు లూర్దుమాత స్వరూపాన్ని ఊరేగించారు. ఉదయం 7గంటలకు కళావేదికపై మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఎస్ఎస్సి డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్‌రాజు, వికారల్ జనరల్ మేశపాం గాబ్రియేలు గోల్డెన్, సిల్వర్ జూబిలేరియన్ గురువులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు.

అంతులేని అప్పులు!

- రూ.11.23 లక్షల కోట్లు దాటిన రుణాలు
- కొత్తగా ఇంకో రూ.2వేల కోట్ల అప్పు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జగన్ సర్కార్ తెస్తున్న అప్పులకు అంతేలేదు. 2023 నాటికి రాష్ట్ర అప్పులు రూ.6.23 లక్షల కోట్లకు చేరాయని, వైసీపీ దాస్తున్న కార్పొరేషన్ అప్పులు వీటికి కలపాలని కాగ్ నివేదిక బయటపెట్టిన మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వం ఇంకో రూ.2,000 కోట్ల అప్పులు తెచ్చేందుకు సమాయత్తమవుతోంది. ఫిబ్రవరి 13న ఆర్‌బీఐ నిర్వహించే సెక్యూరిటీల వేలంలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం ఈ అప్పు తీసుకురానుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంకు నుంచి ప్రభుత్వం తెచ్చిన మంగళవారం అప్పులు రూ.68,000 కోట్లకు చేరుకున్నాయి. ఇవికాకుండా కార్పొరేషన్ల నుంచి ప్రభుత్వం అప్పులు తెస్తోంది. వీటి వివరాలు ఇవ్వండంటూ కాగ్ ఐదేళ్ల నుంచి ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నప్పటికీ సమాధానం మాత్రం ఇవ్వడం లేదు. దీంతో కాగ్ తన నెలవారీ నివేదికల్లోనూ, ఆర్థిక సంవత్సరంపై పూర్తిస్థాయిలో ఇస్తున్న నివేదికల్లోనూ అరకొర అప్పులనే చూపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం అప్పులు రూ.11.23 లక్షల కోట్లు దాటగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జగన్ సర్కార్ చేసిన అప్పులు రూ.1,05,000 కోట్లు దాటాయి.

దళిత కూలీకి ఊరట

- రూ.1,11,198 బిల్లు చెల్లించొద్దన్న అధికారులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 9: ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో కూలి పని చేసుకునే పిల్లెం వెంకయ్యకు రూ.1,11,198 విద్యుత్ బిల్లు వచ్చిన ఘటనపై అధికారులు స్పందించారు. అధిక మొత్తం బిల్లు ఇచ్చిన అధికారులు, అది చెల్లించలేదని సర్వీసు కట్ చేశారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో స్పందించిన ఇన్‌చార్జి ఏడీ సుబ్బారావు.. సిబ్బందితో కలసి వెంకయ్య ఇంటికి వెళ్లి సమస్య పరిష్కరించి, కొత్త మీటరు ఏర్పాటు చేశారు. నగదు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

వలంటీర్లకు 'బ్రేక్'!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం కోసం పని చేయరు. పూర్తిస్థాయి వైసీపీ కార్యకర్తలుగా మారిపోతారు. వలంటీర్లను వైసీపీ ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నా ఎవరూ అడ్డుకోలేని పరిస్థితి. విమర్శలు, ఆరోపణలు, ఫిర్యాదులను పట్టించుకునే దిక్కులేదు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వలంటీర్ల ప్రమేయం ఉండొద్దని ఈసీ చెప్పినా పెద్దగా ఫలితం లభించలేదు. కానీ... ఎన్నికల షెడ్యూలు వచ్చాక అలా ఉండదు. ఈసీ నేరుగా రంగంలోకి దిగుతుంది. వలంటీర్లపై పూర్తిస్థాయి నిఘా ఉంటుంది. ఈ క్రమంలో వారి సేవలను రాజకీయంగా వాడుకోవడం కష్టమవుతుందని గ్రహించిన వైసీపీ... కొత్త ప్రణాళిక రచించింది. అదే... రెండు నెలలపాటు వలంటీర్లను విధుల నుంచి 'తొలగించడం'! కోర్టు కేసుల పేరుతోనో, ఇంకేదైనా నెపంతోనో వారందరికీ తాత్కాలికంగా బ్రేక్ ఇస్తారు. ఈ రెండు నెలలపాటు వారికి ప్రభుత్వం నుంచి వేతనాలు ఇవ్వరు. అంటే వారు ప్రభుత్వ సేవల్లో లేనట్లు. ఆ సమయంలో వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం పూర్తిస్థాయిలో పని చేయాలి. ఇలా... ఈసీ కళ్లు గప్పి ఏకంగా రెండున్నర లక్షల మంది వలంటీర్లను పార్టీ కార్యకర్తలుగా వాడుకోనున్నారు. ఓటర్లకు సంబంధించిన సమస్త సమాచారాన్ని వలంటీర్లు ఇప్పటికే సేకరించారు. దానిని వైసీపీ ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. నెలనెలా పెన్షన్ పంపిణీ చేస్తూ స్థానికులకు సుపరిచితులైన వలంటీర్ల పరపతిని ఇలా సొమ్ము చేసుకుంటారు.

రెండునెలలు 'సొంత జీతం'

'ఫిబ్రవరి పెన్షన్ పంపిణీ తర్వాత మీకు ఇతర విధులేవీ ఉండవు. ఈ రెండు నెలలు చాలా కీలకం. యాక్టివ్‌గా పని చేయండి. ప్రభుత్వం మిమ్మల్నే నమ్ముకుంది. మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా పక్కన పెడుతోంది" అని ఇప్పటికే ఎంఎల్‌వోలు (మండల స్థాయి అధికారులు) వలంటీర్లకు సందేశాలు పంపించారు. ఇప్పుడు... వైసీపీ ప్రజా ప్రతినిధులు రంగంలోకి దిగారు. "ఈ రెండు నెలలు మిమ్మల్ని ప్రభుత్వ విధుల నుంచి దూరం పెడతాం. దానికి బదులుగా మాకోసం పని చేయాలి. ప్రభుత్వం నుంచి మీకు అందేది నెలకు రూ.5వేలే. కానీ... ఈ రెండు నెలలు రూ.15వేల నుంచి 20 వేల వరకు మేం సొంతంగా ఇస్తాం" అని ఆశ చూపుతున్నారు. ఇలా... వలంటీర్లు వైసీపీ అభ్యర్థుల తరఫున క్షేత్రస్థాయిలో పని చేయడానికి రంగం సిద్ధం చేశారు. విపక్షాల ఫిర్యాదులకు ఈసీ స్పందించి ప్రశ్నించినా... 'వాళ్లను తొలగించాం. ప్రభుత్వ విధుల్లో లేరు' అని తప్పించుకోవచ్చన్నదే వైసీపీ ఆలోచన. కొన్ని రోజులుగా వైసీపీ ఎమ్మెల్యేలు, అభ్యర్థులు వలంటీర్లపై 'ప్రత్యేక' ప్రేమ ప్రదర్శిస్తున్నారు. వారితో సమావేశాలు నిర్వహిస్తూ... 'రాబోయే ఎన్నికల్లో మీదే కీలక పాత్ర' అని చెబుతున్నారు. కుక్కర్లు, మిక్సీలు కానుకలుగా ఇచ్చి పంపిస్తున్నారు.

సొంత రాజకీయం కోసమే...

ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటర్... వారి ద్వారానే పింఛన్ల పంపిణీ! ఇదీ స్కీమ్. ప్రతి ఏటా పెన్షన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తుంటే... ఈ పెన్షన్ పంపిణీ చేసే వలంటీర్లకు రూ.2 వేల కోట్లు వేతనాలుగా అందిస్తున్నారు. అంటే.. 10 శాతం కమీషన్ ఇచ్చి వలంటీర్ల సేవలు వాడుకుంటున్నట్లయింది. ఈ పని సచివాలయ ఉద్యోగులు కూడా చేయగలరు. ప్రతి సచివాలయంలో కనీసం 10 మంది సచివాలయ ఉద్యోగులు పర్మనెంట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉండే పెన్షన్లను విభజించి ఆయా సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేసే అవకాశం ఉంది. పెన్షన్ల పంపిణీ నెలకోసారి మాత్రమే కావడం వల్ల వారికి పెద్ద భారం కూడా కాదు. మిగిలిన 'నవరత్నాల' అమలులో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకం. కానీ... వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయడంలోనే రాజకీయ దూరాలోచన ఉంది. ఇప్పటికే ప్రతి ఆరునెలలకు, ఏడాదికోసారి ఏదో ఒక సర్వే, పథకం పేరుతో మొత్తం ప్రజల సమాచారాన్ని వలంటీర్లు సేకరించారు. నిత్యం ఏదో ఒక కరపత్రం, బుక్‌లెట్ పంపిణీ చేయడం, జగన్ బొమ్మలు ఇళ్ల తలుపులపైన అంటించడం వంటి పనులకూ వారిని వాడుకుంటున్నారు. వైసీపీ అనుకున్నది అనుకున్నట్లు జరిగితే... వలంటీర్లు ఎన్నికల్లో ఆ పార్టీ కార్యకర్తలుగా పని చేయడం ఖాయం!

దళితుడి అంత్యక్రియలను అడ్డుకున్న వైసీపీ వర్గీయులు



అంత్యక్రియలను నిర్వహించకుండా అడ్డుకుంటున్న వైసీపీ వర్గీయులు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 9: ఓ దళితుడి అంత్యక్రియలను వైసీపీ వర్గీయులు అడ్డుకున్నారు. శ్మశానం కోసం దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూమి తమదని, అక్కడ అంత్యక్రియలు నిర్వహించడానికి వీల్లేదన్నారు. దీంతో బాధితులు సుమారు ఐదు గంటలపాటు మృతదేహాన్ని ఖననం చేయలేకపోయారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లిలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనగాల నాగన్న(68) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు అంత్యక్రియల కోసం మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లారు. వీరిని వైసీపీకి చెందిన శంకరనారాయణ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. శ్మశాన వాటిక స్థలం తమదని, అక్కడ మృతదేహాన్ని పూడ్చడానికి వీల్లేదని వాగ్వాదానికి దిగారు. అంత్యక్రియలను అడ్డుకోవడంతో బాధితులు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. తహసీల్దారు, సీఐ, ఎస్‌ఐలు గ్రామానికి చేరుకుని, అది ప్రభుత్వ భూమి అని, అడ్డుకుంటే చర్యలు తప్పవని చెప్పడంతో శంకరనారాయణ కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. అధికారులు, పోలీసులు దగ్గరుండి అంత్యక్రియలను పూర్తి చేయించారు.

కురుక్షేత్ర సంగ్రామానికి సిద్ధంకండి!

- అంతిమ విజయం మనదే: భువనేశ్వరి
- నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 'నిజం గెలవాలి'
- నలుగురు కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



వనపర్తి మల్లిఖార్జునరావు సతీమణికి ఆర్థిక సాయం అందిస్తున్న నారా భువనేశ్వరి

నందిగామ/చందర్లపాడు/జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 9: 'మరో 60 రోజుల్లో జరగబోయే కురుక్షేత్ర సంగ్రామానికి సిద్ధంకండి. ఏ యుద్ధంలోనైనా అంతిమంగా ధర్మానిదే విజయం. రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలోనూ మనదే విజయం' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలుగుదేశం కేడర్‌లో జోష్ నింపారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు తట్టుకోలేక మరణించిన నందిగామ నియోజకవర్గం కోనాయపాలెంకు చెందిన వనపర్తి మల్లికార్జునరావు, జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలుకు చెందిన అలవాల గోపయ్య, గౌరవరానికి చెందిన కుక్కల ప్రకాశరావు, బలుసుపాడుకు చెందిన గండమాల వెంకటేశ్వరరావు కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.3 లక్షలు చొప్పున అందజేశారు. భువనేశ్వరికి నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో అపూర్వ స్వాగతం లభించింది.

మా ముందు హాజరవ్వండి!

- ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రావత్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఎస్ రావత్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రహదారులు భవనాలశాఖ పరిధిలోని ప్రభుత్వ భవనాలు, రహదారుల నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో విఫలమైతే వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరుకావాలని ఇచ్చిన ఉత్తర్వులు పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. కనీసం హాజరు మినహాయింపు పిటిషన్ కూడా దాఖలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. తదుపరి విచారణ రోజు న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశిస్తూ ఫాం-1 నోటీసు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ అండ్‌బీలో పనులు చేపట్టిన తమకు బిల్లులు చెల్లించడం లేదంటూ పలువురు కాంట్రాక్టర్లు గతేడాది హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లకు మూడు నెలల్లో బిల్లులు చెల్లించాలని అదే ఏడాది మేలో హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఉత్తర్వులు అమలుకాకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు కోర్టుధిక్కరణ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ఇటీవల విచారణకు రాగా.. ఈ నెల 9లోగా బిల్లులు చెల్లించడంలో విఫలమైతే కోర్టు ముందు హాజరుకావాలని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ఈ పిటిషన్లు శుక్రవారం మరోసారి విచారణకు రాగా, బిల్లు చెల్లించడంలో విఫలమైన విషయాన్ని పిటిషనర్ తరపు న్యాయవాదులు గుర్తుచేశారు. దీంతో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శిపై న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తదుపరి విచారణ రోజు న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించారు.

'ఆడుదాం ఆంధ్ర' ఫైనల్స్ ప్రారంభం

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యువతలోని ప్రతిభను గుర్తించేందుకు 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తోందని పర్యాటక, క్రీడా, సాంస్కృతిక శాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' ఫైనల్ పోటీలను శుక్రవారం నగరంలోని రైల్వే స్టేడియంలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ యువతలోని క్రీడా ప్రతిభను గుర్తించి సానబెట్టే ఉద్దేశంతోనే ఈ పోటీలను నిర్వహించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 సచివాలయాల పరిధిలో ఆటలు ఆడించామని, ఇప్పుడు విశాఖలో ఫైనల్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 13న ముగింపు కార్యక్రమంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను 8.30 గంటలకే మైదానానికి తరలించారు. క్రీడాకారులతో పరిచయాలు, అతిథుల ప్రసంగాలు పూర్తయ్యేసరికి 12 గంటలు దాటింది. అప్పటివరకూ ఎండలో కూర్చున్న క్రీడాకారులు నీరసించిపోయారు.

ఈవీఎంల నిర్వహణపై నోడల్ అధికారులకు శిక్షణ

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వహణపై (ఈవీఎం మేనేజ్‌మెంట్ సిస్టమ్-ఈఎంఎస్ 2.0) అన్ని జిల్లాలకు చెందిన ఈవీఎంల నోడల్ అధికారులకు, సాంకేతిక సహాయకులకు అమరావతి సచివాలయంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. బిహార్, గోవా రాష్ట్రాలతో పాటు లడక్, లక్షద్వీప్, పుదుచ్చేరి, చండీగఢ్ తదితర కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన నోడల్ అధికారులు, సాంకేతిక సహాయకులు ఆన్‌లైన్ ద్వారా ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో గంజాయి ముఠా అరెస్ట్

- సహకరించిన ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు కూడా

ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 9: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగ్గురు గంజాయి ముఠా సభ్యులు ఈ నెల 7న పోలీసులకు పట్టుబడ్డారు. విచారణలో వారికి ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు సహకరించినట్టు తేలడంతో వారినీ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు కేసు వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన ఉత్తర గౌడ్, కుషా బుయాన్, రంజు గమాంగో ఈ నెల 7న 72 కిలోల గంజాయితో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వారి దగ్గర సూట్‌కేసులు, బ్యాగులు చూసి ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు జుదిష్టి బెహరా, వినోద్ బెహరా అనుమానంతో ఆరా తీశారు. గంజాయి ఉన్నట్టు గుర్తించి.. రూ.20 వేలు ఇస్తే వదిలేస్తామని, లేదంటే కేసులు పెడతామని బెదిరించారు. దీంతో రంజు గుమాంగో వారితో బయటకువెళ్లి నగదు చెల్లించాడు. వీరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో కొందరు ఎస్ఐ సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. నిందితుల వద్ద గంజాయి గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి నుంచి డబ్బులు తీసుకుని ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు సహకరించినట్టు తేలింది. దీంతో ఆ ఐదుగురినీ అరెస్టు చేశారు.

ఐఆర్ఆర్ కేసులో..బాబుపై చార్జిషీటు

కోర్టు పరిశీలనలో!

- ఇందులో నారాయణ, లోకేశ్, లింగమనేని బ్రదర్స్‌పైనా అభియోగాలు
- ఈఎస్ఐ కేసులో ఆర్డర్ పెండింగ్

విజయవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ (ఐఆర్ఆర్) ఎలైన్‌మెంట్ వ్యవహారంలో మాజీ సీఎం చంద్రబాబుపై సీఐడీ అధికారులు దాఖలు చేసిన చార్జిషీటు ప్రస్తుతం కోర్టు పరిశీలనలో ఉంది. ఇందులో ఆయనతో పాటు మాజీ మంత్రి పి.నారాయణ, లోకేశ్, లింగమనేని బ్రదర్స్ రమేశ్, రాజశేఖర్‌పైనా అభియోగాలు మోపిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి సీఐడీ అధికారులు ఇచ్చిన నోట్‌పై న్యాయాధికారి 'చెక్ అండ్ పుటప్' అని రాశారు. ఐఆర్ఆర్ వ్యవహారంలో ఐపీసీ సెక్షన్లు 120(బీ), 409, 420, 34, 35, 36, 37, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(2) రెడ్‌విత్ 13(1)(సీ)(డీ) కింద సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ సెక్షన్ల ప్రకారమే నిందితులను శిక్షించాలని చార్జిషీటులో కోర్టును కోరింది. దీనిని న్యాయస్థానం శుక్రవారం పరిశీలించింది. ప్రజాప్రతినిధులను అరెస్టు చేసినప్పుడు, వారిపై చార్జిషీటు దాఖలు చేసినప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకోవలసి ఉంటుందని న్యాయనిపుణులు చెబుతున్నారు. సీఐడీ తరఫు న్యాయవాదులు మాత్రం చార్జిషీటు దాఖలు చేయడానికి ఎలాంటి అనుమతులూ అవసరం లేదని, కేసు ట్రయల్‌కు వచ్చాక ఏ సమయంలోనైనా అనుమతి తీసుకోవచ్చని అంటున్నారు. ఇంకోవైపు.. ఈఎస్ఐలో రూ.150 కోట్ల వరకు కుంభకోణం జరిగిందని, ఇందులో మాజీ మంత్రి అచ్చెన్నాయుడితోపాటు మరికొంతమంది పాత్ర ఉందని కొద్దిరోజుల క్రితం ఏసీబీ ఇదే కోర్టులో చార్జిషీటు వేసింది. దీనిని పరిశీలించిన న్యాయస్థానం.. అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 19 ప్రకారం.. గవర్నర్ అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించి దానిని పక్కన పెట్టింది. దీనిపై వివిధ కోర్టులు ఇచ్చిన తీర్పుల కాపీలను సీఐడీ అధికారులు కోర్టుకు సమర్పించారు. వాటిని పరిశీలించి త్వరలోనే ఆర్డర్ ఇస్తామని న్యాయాధికారి తెలిపారు. ఇంకా ఆదేశాలివ్వలేదు. ఐఆర్ఆర్ కేసులోనూ ఇదే జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని న్యాయవాద వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

జనం నెత్తిన డిస్కమ్‌ల నష్టాలు

- గెజిట్ విడుదల చేసిన ఏపీఈఆర్‌సీ

అమరావతి,ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జనం నెత్తిన విద్యుత్తు పంపిణీ నష్టాలను వేసేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆమోదముద్ర వేసింది. ఈమేరకు శుక్రవారం గెజిట్ విడుదల చేసింది. వినియోగదారుల టారిఫ్‌ను ఏడాదికోసారి సవరించేందుకు అంగీకరిస్తూనే..విద్యుత్తు సంస్థలు ఐదేళ్లకోసారి తమ టారిఫ్‌ను మార్చుకునేందుకూ అనుమతినివ్వడంపై విద్యుత్తు రంగ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు కొనుగోలు ధరలపై నియంత్రణను ఎత్తివేయడం..విక్రయాలపై నియంత్రణను ఎత్తేయడం వంటి అంశాలు వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి.

మా గ్రామమే నా బలం



మా గ్రామంలో అన్ని వసతులూ ఏర్పాటుచేశాను. డబ్బు సంపాదన మాత్రమే ప్రజలతో మమేకం అయ్యేలా చేయదు. వారికి అవసరమైన గుడి, బడి, ఆసుపత్రి, ఉపాధి అవసరాలను తీరిస్తేనే వారితో మమేకమవుతాం. మా గ్రామమే నా బలం. నేను పదవీ విరమణ చెందినప్పుడు వచ్చిన కమీషన్‌ను అలాగే డిపాజిట్ చేశాను. దాంతోనే ఇప్పుడీ గుడి నిర్మించాను. నా చిన్నప్పుడు గ్రామం ఎలా ఉండేదో చూపించే ఆలోచనలో ఉన్నా. ఇదే గ్రామంలో నేను పుట్టి పెరిగిన ఇంట్లోనే మ్యూజియం ఏర్పాటు చేయాలనేదే నా కోరిక.

- గల్లా రామచంద్రనాయుడు



పేటమిట్టలో నిర్మిస్తున్న రాములవారి గుడి

పేటమిట్టలో 'రామచంద్రుడు'!

- పుట్టిన ఊరి రుణం తీర్చుకుంటున్న 'గల్లా'
- ఇదివరకే విద్యాలయం, వైద్యాలయం..
- నేడు దేవాలయం నిర్మించిన గల్లా కుటుంబం
- 15న కోదండరామస్వామి దేవస్థానం ప్రారంభం

(చిత్తూరు-ఆంధ్రజ్యోతి)

గల్లా రామచంద్రనాయుడు.. కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరంలేని పేరిది!. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలోని పేటమిట్ట గల్లా స్వగ్రామం. అమరరాజా బ్యాటరీస్ అధినేతగా ఎదిగిన ఆయన ఇప్పటికే తన స్వగ్రామంలో విద్యాలయం, వైద్యాలయాన్ని నిర్మించారు. తాజాగా శ్రీరాములవారి ఆలయాన్ని అత్యంత సుందరంగా నిర్మించారు. గ్రామంలో తొలుత ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభించగా, ఇప్పుడు ఇంటర్మీడియట్ వరకు సౌకర్యం ఉంది. 2001లో ఏర్పాటుచేసి ట్రస్టు ద్వారా తక్కువ ఫీజులతో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్, విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కూడా ఉంది. ప్రస్తుతం ఇక్కడ 3వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ అధునాతన సదుపాలయాలతో 2013లో ఆసుపత్రిని నిర్మించి.. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నారు. 2004 నుంచే ఇక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. టెన్త్, ఇంటర్ పిల్లలకు ఉచిత శిక్షణ ఇచ్చి అమర్‌రాజా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

అన్ని సౌకర్యాలతో గ్రామాభివృద్ధి..

గల్లా రామచంద్రనాయుడు 1960 దశకంలో అమెరికా వెళ్లి వచ్చినప్పుడు పేటమిట్టలో 25 పూరిళ్లు మాత్రమే ఉన్నాయి. అప్పట్లో ఆయన ఫ్యాక్టరీ పెట్టగా గ్రామంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. క్రమంగా గ్రామం అభివృద్ధి చెందింది. ఇప్పుడు అక్కడ 180 పక్కా గృహాలున్నాయి. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, అన్ని ఇళ్లకూ మరుగుదొడ్లు, రక్షిత మంచినీటి సౌకర్యాలు కల్పించారు. ఉద్యోగులు, గ్రామస్థుల సౌకర్యార్థం యూనియన్ బ్యాంకు వాళ్లు బ్రాంచీ ఏర్పాటుచేశారు. ఇప్పుడు ఇక్కడ ఇల్లు కట్టుకునేవారు నివాసం ఉండేందుకు ఒకటి, అద్దెకు ఇచ్చేందుకు మరోటి నిర్మిస్తున్నారు. ఇంటి అద్దె కనీసం రూ.5వేలు ఉందంటే ఇక్కడి డిమాండ్ అర్థం చేసుకోవచ్చు. అప్పట్లో ఇక్కడి ప్రజలు విరూపాక్షమ్మను గ్రామదేవతగా కొలిచేవారు. చెట్టు కింద విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని పూజలు నిర్వహించేవారు. అక్కడ పాతికేళ్ల కిందట చిన్నపాటి గుడిని నిర్మించారు. ఇప్పుడు ఆ గుడి కొత్తగా నిర్మించిన రాములవారి గుడి సమీపంలోనే ఉంది. దాన్నీ ఆధునికీకరించారు.

సువిశాల ప్రాంగణంలో...

పేటమిట్టలో కోదండరామస్వామి దేవాలయం పక్కనే ఓవైపు వినాయకుడి ఆలయం, మరోవైపు కృష్ణుడి ఆలయాలను నిర్మించారు. ఆలయ కాంపౌండ్ బయట గ్రామస్థులు నాటకాలు, భజనాలు చేసుకునేందుకు ఓపెన్ ఆడిటోరియం, చిల్డ్రన్స్ పార్కు, 250 మందికి సరిపడా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేశారు. ఉంది. ఆలయ నిర్మాణం తుదిదశలో ఉండగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పక్కనే ఓపెన్ ఆడిటోరియం, కమ్యూనిటీ హాల్ వంటి పనులు కూడా ముగింపు దశలో ఉన్నాయి. ఆలయం చుట్టూ మాడ వీధుల ఏర్పాటుతో పాటు అర్చకులకు కూడా క్వార్టర్స్ సిద్ధమయ్యాయి.

12 నుంచి ప్రారంభోత్సవాలు

ఈ నెల 12 నుంచి 15 వరకు రాములవారి గుడి ప్రారంభోత్సవ పూజల్ని నిర్వహించనున్నారు. తొలిరోజు 12న ప్రతిష్ఠించే సమస్త దేవతా విగ్రహాలను ఊరేగిస్తారు. అరుణకుమారి, రామచంద్రనాయుడు దంపతులు యాగశాలలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. 13న పలురకాల పూజలు, హోమాలు నిర్వహిస్తారు. 14న వినాయకుడు, మూషిక వాహనం, కృష్ణుడి విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. 15న కోదండరామస్వామి, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహస్థాపన చేసి, సీతారాముల కల్యాణం జరిపించనున్నారు.

హాథీరాంజీ మఠం భూముల అమ్మకాలపై యథాతథ స్థితి

- విచారణ పూర్తయ్యే వరకూ అమ్మడానికి వీల్లేదు: సుప్రీంకోర్టు
- ఢిల్లీ నుంచి తిరుపతి వరకూ మఠం భూములు అన్యాక్రాంతం
- దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలన్న ధర్మాసనం
- ఆక్రమణల నుంచి కాపాడలేమన్న ఏపీ సర్కారుపై ఆగ్రహం

న్యూఢిల్లీ/తిరుపతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హాథీరాంజీ మఠం భూముల అమ్మకాలపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. రూ.వేల కోట్లు విలువజేసే ఆ భూముల విక్రయాలపై స్టేటస్ కో విధించింది. విచారణ పూర్తయ్యే వరకూ వాటిని అమ్మడానికి వీల్లేదని ఆదేశించింది. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది. మఠం భూములను లీజుకు తీసుకున్న వారే కొనుగోలు చేసేలా ఏపీ ప్రభుత్వం వీలు కల్పించింది. భూముల అమ్మకాన్ని సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మఠం నిర్వాహకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం మందుకు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. హాథీరాంజీ మఠం భూముల అమ్మకం ఒక పెద్ద భూ కుంభకోణమని మఠం తరఫు సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు కోర్టు దృష్టికి తెచ్చారు. రూ.కోట్ల విలువైన భూములను నామమాత్రపు ధరకు అమ్మారని, దీన్ని నిలువరించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్రమణల నుంచి మఠం భూములను కాపాడటం కష్టమన్న ఏపీ ప్రభుత్వ వాదనతో ధర్మాసనం విభేదించింది. ఢిల్లీ నుంచి తిరుపతి వరకూ రూ.లక్షల కోట్ల విలువైన మఠం భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది.

కేసు నేపథ్యం ఇదీ...

రాష్ట్ర ప్రభుత్వం 1990లో ఇచ్చిన జీవో 751 ప్రకారం తిరుపతి సమీపంలోని పుదిపట్ల గ్రామ సర్వే నం. 51/1, 54/2లో ఉన్న 25.36 ఎకరాల హాథీరాంజీ మఠం భూమిని బహిరంగ వేలంలో కాకుండా, ప్రైవేట్ నెగోషియేషన్స్ ద్వారా మునస్వామి నాయుడు, చెంగమ్మకు ఎకరం రూ.20వేల చొప్పున విక్రయించారు. ఆ తర్వాత ఈ భూమిపై చాలా లావాదేవీలు జరిగాయి. మఠం భూములను నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చడంతో కొంత భూమి కొనుగోలుదారుడికి రిజిస్ట్రేషన్ జరగలేదు. ఈ క్రమంలో అతను హైకోర్టును ఆశ్రయించగా 1990లో జరిగిన భూముల అమ్మకాన్ని తప్పుబడుతూ, అమ్మకాలను రద్దు చేసింది. కొనుగోలుదారులకు వడ్డీతో సహా డబ్బు వాపసు చేసి వాటిని తిరిగి బహిరంగ వేలం వేయాలని తీర్పు ఇచ్చింది. కొనుగోలుదారులు హైకోర్టు ఫుల్‌బెంచ్‌ను ఆశ్రయించగా అమ్మకాలను సమర్థిస్తూ తీర్పు చెప్పింది. దీంతో మఠం అధికారులు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ దాఖలు చేశారు.

వైసీపీ బోగస్ బాగోతం


- ఒంగోలు మేయర్ డివిజన్‌లో భారీగా దొంగ ఓట్లు..!
- అధికారుల పరిశీలనలో వెలుగులోకి

ఒంగోలు (కార్పొరేషన్)/(రూరల్), ఫిబ్రవరి 9: ఎన్నికల్లో గెలుపు కోసం అధికార వైసీపీ అడ్డదారులు తొక్కుతోంది. ఒంగోలులో భారీగా దొంగ ఓట్లు చేర్పించే పనిలో ఆ పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు. వివరాల్లోకెళితే.. నగర మేయర్ గంగాడ సుజాత (వైసీపీ) ప్రాతినిథ్యం వహిస్తున్న 18వ డివిజన్‌లోని వెంగముక్కపాలెంలో కొందరు వైసీపీ నాయకులు కొత్త ఓట్లు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీనిపై స్థానికంగా ఉండే టీడీపీ నాయకులు ఎన్నికల విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి పరిశీలనకు వెళ్లారు. దరఖాస్తు చేసిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా? అని విచారించగా అధికార పార్టీ బాగోతం బట్టబయలైంది. 104 ఓట్లకు సంబంధించి ఎవరూ లేనట్లు గుర్తించారు. డోర్ నంబరు కూడా లేకపోవడంతో బోగస్‌గా తేల్చారు. 35-83-107 అనే ఇంటి నెంబరు పక్కన / 1, 2, 3 ఇలా ఏదో ఒక అంకెను మార్చి దరఖాస్తు చేశారు. డివిజన్లలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా ముందుండి నానా హడావుడి చేసే వైసీపీ నాయకులు ఓట్ల పరిశీలనలో కనిపించకపోవడం గమనార్హం. ఈ వ్యవహారం వెనుక ఆ గ్రామ వైసీపీ నాయకుడి హస్తం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. దరఖాస్తు చేసిన 104 మంది ఓటర్లు సమీపంలో నిర్మాణం జరుగుతున్న ఓ వెంచర్‌లో పనిచేసే ఉత్తరాది కార్మికులుగా అనుమానిస్తున్నారు. వారు గ్రామంలో నివాసం లేకపోయినా వారి పేర్లతో దరఖాస్తు చేశారు. నియోజకవర్గ పరిధిలోని పలు చోట్ల ఇదే తరహాలో ఆయా డివిజన్లకు చెందిన వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా లేని ఇళ్లకు డోర్ నంబరు జోడించి ఓట్లు నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈసీ కార్యాలయంలో రాంప్రసాద్ నియామకం సరికాదు

- ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయి
- ఈసీకి మండలి మాజీ చైర్మన్ షరీఫ్ లేఖలు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీకి అనుకూలంగా పని చేసి, ఎన్నికల నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘించిన రాంప్రసాద్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంలో పనిచేసేందుకు నియమించడం దుర్మార్గమని శాసనమండలి మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత ఎంఏ షరీఫ్ విమర్శించారు. శుక్రవారం ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఐదు లేఖలు రాశారు. ఈ లేఖల్లో రాష్ట్ర వ్యాప్తంగా చోటు చేసుకున్న ఓటర్ల జాబితాల్లోని అవకతవకలపై ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండల తహశీల్దార్‌గా పనిచేసిన జీవీ రాంప్రసాద్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయంటూ వివరించారు. ఆయన డిప్యుటేషన్ వెంటనే రద్దు చేసి ఎన్నికల విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల తుది జాబితాలో ఇప్పటికే అనేక అవకతవకలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల పరిధిలో చోటు చేసుకున్న అవకతవకలను ఆయన తన లేఖల్లో ఉదహరించారు.




జైలు నుంచి విడుదలైన శ్రీనివాస్. చిత్రంలో ఆయన తండ్రి తాతారావు, న్యాయవాది సలీం

జైలు నుంచి కోడికత్తి శ్రీను విడుదల

విశాఖపట్నం/ఆరిలోవ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కోడికత్తి కేసులో అరెస్టయిన జనుపల్లి శ్రీనివాస్ ఎట్టకేలకు శుక్రవారం జైలు నుంచి విడుదలయ్యారు. అనేక పిటిషన్లు, వాదనల అనంతరం హైకోర్టు ఆయనకు గురువారం షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ ఆదేశాలను దళిత సంఘాల నాయకులు విశాఖపట్నం ఎన్ఐఏ కోర్టులో సమర్పించారు. శ్రీనివాసరావు తండ్రి పేరిట, చిన్నాన్న పేరిట ఉన్న ఒక్కొటి రూ.6.25లక్షల విలువైన వేర్వేరు భూమి పత్రాలతో పాటు తహసీల్దార్ కార్యాలయం నుంచి సాల్వెన్సీ పత్రాలు తీసుకురాగా సాయంత్రం 3.45గంటలకు బెయిల్ ఉత్తర్వులను జైలు అధికారులకు మెయిల్ చేశారు. దాని ఆధారంగా శ్రీనివాస్‌ను విడుదల చేయడం కుదరదని, నేరుగా పత్రాలే తీసుకురావాలని విశాఖ జైలు అధికారులు సూచించారు. దీంతో దళిత సంఘాల నాయకులు మళ్లీ ఎన్ఐఏ కోర్టుకు వెళ్లి న్యాయమూర్తి సంతకాలతో కూడిన బెయిల్ ఆదేశాలు తీసుకున్నారు. ఆ పత్రాలను కోర్టు సిబ్బందే జైలుకు తీసుకువచ్చి అందించిన తరువాత శ్రీనివాస్‌ను విడుదల చేశారు. సాధారణంగా రిమాండ్ ఖైదీలు వారి దుస్తుల బ్యాగుతో బయటకు వస్తుంటారు. కానీ శ్రీనివాస్ మాత్రం అంబేడ్కర్ చిత్రపటాన్ని గుండెలపై పెట్టుకొని బయటకొచ్చారు. ఈ సందర్భంగా న్యాయవాది సలీం, విశాఖ దళిత సంఘాల(విదసం) ఐక్యవేదిక సభ్యులు, తదితరులు శ్రీనివాస్‌ను ఆయన తండ్రి తాతారావుకు అప్పగించారు. శ్రీనివాస్‌పై ఇకపై ఎటువంటి కుట్రలు జరగకుండా అడ్డుకుంటామని దళిత సంఘాల నాయకులు నినాదాలు చేశారు. ఈ కేసు కొట్టేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ వేస్తామని న్యాయవాది సలీం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తాను బయటకు వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగమే శ్రీనివాస్‌ను కాపాడిందని న్యాయవాది సలీమ్ అన్నారు. తనకు గానీ, శ్రీనివాస్ కుటుంబానికి గానీ ఎటువంటి భద్రత అవసరం లేదన్నారు. తమలో ఎవరికి, ఏం జరిగినా సీఎం జగనే బాధ్యత వహించాల్సి ఉంటుందని సలీం పేర్కొన్నారు.

రోజా పెట్టిన రొయ్యల పులుసు తిని.. జీవో 203ని ఏపీకి రాసిచ్చారు



- కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్ ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రాజెక్టులు కేంద్రానికి రాసిచ్చేశామంటూ కాంగ్రె‌స్‌ను బద్నాం చేస్తున్నారని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.. అసలు కృష్ణాజలాలను ఏపీకి రాసిచ్చింది ఆయనే నన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రేవంత్‌రెడ్డి శుక్రవారం తెలంగాణ శాసనసభలో మాట్లాడారు. 'ప్రగతిభవన్లో జగన్‌కు కేసీఆర్ పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి జీవో 203 రాసిచ్చారు. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ప్రగతి భవన్లో కేసీఆర్ డైనింగ్ టేబుల్‌పైనే పునాదిరాయి పడింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ ఏపీ పోలీసులు ఏకే-47 తుపాకులతో వచ్చి పూర్తిగా మన భూభాగంలో ఉన్న నాగార్జునసాగర్‌ను ఆక్రమించుకుంటే చేతగాని సన్నాసుల్లా ఇక్కడి ప్రభుత్వం చూస్తుండిపోయింది. ఇంటిదొంగల సహకారం లేకుంటే వాళ్లు వచ్చేవారా? కేసీఆర్ రాయలసీమకు వెళ్లి.. మంత్రి రోజా పెట్టిన రాగిసంగటి, రొయ్యల పులుసు తిని రాయలసీమను రతనాలసీమను చేస్తా అని వచ్చిండు. అలుసు ఇచ్చినందునే.. మన జలాలను వాళ్లు కొట్టుకుపోయిన్రు. ఇప్పుడు మేమొచ్చాక అట్లెట్లా కొట్టుకుపోతారని ప్రశ్నిస్తున్నారు' అని ఆక్షేపించారు.

నకిలీ ఓట్ల దొంగ 'సొంత' మనిషే!

(మొదటి పేజీ తరువాయి)

తిరిగింది. అప్పట్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా పని చేసి, ఇప్పుడు 'మెప్మా' అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళీశ్వర రెడ్డిని ఈసీ ఆదేశాల మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తీగలాగితే డొంక కదిలినట్లు... చంద్రమౌళీశ్వరరెడ్డి చేసిన అక్రమాల బాగోతం మొత్తం బయటపడింది.

అసలు 'దొంగ' ఎవరంటే...

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సమయంలో సుమారు 35వేల ఓటరు ఐడీలను డౌన్‌లోడ్ చేసి, వాటికి నకిలీలను సృష్టించారు. దీనికి సంబంధించి... అప్పుడు ఈఆర్వోగా ఉన్న ఐఏఎస్ అధికారి కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేశారు. ఇది జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించింది. ఈసీ దీంతో ఆగలేదు. దొంగ ఓట్ల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉంది? ఈఆర్వో లాగిన్‌తో ఓటర్ కార్డులను డౌన్‌లోడ్ చేసిన అసలు దొంగ ఎవరు? అనే అంశంపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే చంద్రమౌళీశ్వర రెడ్డి పాత్ర బయటికి వచ్చింది. ఉప ఎన్నికల సమయంలో ఆయన తిరుపతి మునిసిపల్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నారు. తిరుపతి ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) కూడా ఆయనే! ఎలాంటి చట్టబద్ధమైన ఆదేశాలు లేకున్నా, అక్రమంగా... ఈఆర్వో (ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్) పాత్ర పోషించినట్లు తేలింది. 35 వేల ఓటర్ కార్డులు అక్రమంగా డౌన్‌లోడ్ చేసింది చంద్రమౌళీశ్వర రెడ్డి లాగిన్ ఐడీ, ఫోన్ నంబరుతోనే అని స్పష్టమైంది.

గిరీషాకు బదులుగా 'లాగిన్'

తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే నాటికి నగర మునిసిపల్ కమిషనర్‌గా గిరీషా విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆయననే ఈఆర్వోగా కూడా నియమించింది. అయితే... ఆయన అప్పటికే వివిధ హోదాల్లో నాలుగున్నరేళ్లుగా అదే జిల్లాలో పని చేస్తున్నారు. చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా సార్వత్రిక ఎన్నికల్లో కూడా అదే జిల్లాలో విధులు నిర్వహించారు. ఈసీ నిబంధనల ప్రకారం ఒకే జిల్లాలో మూడేళ్లకుపైగా పని చేస్తున్న వారిని ఎన్నికల విధుల్లో ఉంచకూడదు. దీని ప్రకారం... గిరీషాను ఈఆర్వోగా నియమించడం సాంకేతికంగా కుదరదు. అప్పటి కలెక్టర్ ఈ విషయాన్ని ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈఆర్వోను మార్చుకునేందుకు ఈసీ అనుమతించింది. అప్పటి కలెక్టర్ ఆర్వోగా ఉన్న చంద్రమౌళీశ్వర రెడ్డినే ఈఆర్వోగా నియమించారు. కానీ... దీనికి ఎన్నికల కమిషన్ ఆమోదం మాత్రం లేదు. ఉప ఎన్నికే కావడంతో అప్రమత్తంగా లేకపోవడమో, మరైదేనా కారణమో తెలియదుకానీ... ఈసీ రికార్డుల్లోనూ 'గిరీషా' పేరు మారలేదు. ఈసీ రికార్డుల ప్రకారం ఉప ఎన్నిక ఈఆర్వో గిరీషానే! కానీ... తిరుపతిలో ఈఆర్వోగా చక్రం తిప్పింది మాత్రం చంద్రమౌళీశ్వర రెడ్డి. ఈ విషయం గిరీషాకు కూడా తెలియదు. సాంకేతికంగా తాను ఈఆర్వోగా ఉండటం కుదరదని కలెక్టర్ కూడా తేల్చడం వరకే ఆయనకు తెలుసు. దీంతో ఆ తర్వాత జరిగిన పరిణామాలపై ఆయన దృష్టి సారించలేదు. ఇక్కడే అసలు కుట్రకు తెరలేచింది. ఈసీ నిబంధనల ప్రకారం ఈఆర్వో లాగిన్ మారిస్తే, వెంటనే ఈసీ గెజిట్‌లో కూడా అధికారి పేరు మారిపోవాలి. కానీ... తిరుపతి ఉప ఎన్నికల సమయంలో ఈసీ గెజిట్‌లో ఈఆర్వోగా గిరీషా పేరే ఉంది. రాష్ట్రంలో ఈఆర్వో లాగిన్ మాత్రం చంద్రమౌళీశ్వరరెడ్డి పేరుతో మారిపోయింది.

ఇదీ జరిగింది...

ఈసీ ఆమోదం లేకుండానే... ఈఆర్వోగా బాధ్యతలు చేపట్టిన చంద్రమౌళీశ్వర రెడ్డి ఓటరు జాబితాకు సంబంధించిన లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ తీసుకున్నారు. 'ఓటీపీ' కోసం తన ఫోన్ నంబరునే ఇచ్చారు. ఓటరు జాబితాలో మార్పులు, కొత్త ఓటరు కార్డులకోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు మాత్రమే ఈఆర్వోగా ఉన్న అధికారి తన లాగిన్ ఐడీ, ఓటీపీ సహాయంతో వాటిని డౌన్‌లోడ్ చేయాలి. కానీ... 2021 మార్చి- ఏప్రిల్ మధ్యలో ఎలాంటి దరఖాస్తులు లేకున్నా 35వేల ఓటర్ ఐడీలు డౌన్‌లోడ్ చేశారు. వీటి సహాయంతో నకిలీలను సృష్టించారు. ఉపఎన్నికల పోలింగ్ రోజున దొంగ ఓటర్లు తిరుపతి నగరానికి పోటెత్తారు. ఈ అక్రమాలు ఆధారాలతో సహా రుజువు కావడంతో ఈసీ రంగంలోకి దిగింది. తమ రికార్డులో ఈఆర్వోగా ఉన్న ఐఏఎస్ అధికారి గిరీషాను సస్పెండ్ చేసింది. అయితే.. దీనిపై ఆయన ఈసీకి సుదీర్ఘ వివరణ ఇచ్చుకున్నారు. అలాగే, కొందరు ఐఏఎస్‌లు గిరీషా నేపథ్యం, పని తీరును ఈసీకి వివరించారు. అసలేం జరిగిందో పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. దీంతో... ఓటీపీ ఎవరి ఫోన్ నంబరుకు వచ్చిందనే అంశంపై దృష్టి సారించింది. తీగలాగితే డొంక కదిలినట్లుగా... చంద్రమౌళీశ్వర రెడ్డి బాగోతం బయటపడింది.

చంద్రమౌళీశ్వరరెడ్డి సస్పెన్షన్

చంద్రమౌళీశ్వర రెడ్డి తమ అనుమతి లేకుండానే ఈఆర్వో బాధ్యతలు చేపట్టినట్లు ఈసీ గుర్తించింది. ఆయన అక్రమాలపై ఆధారాలను గుర్తించి... సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు... మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి శుక్రవారం పి.చంద్రమౌళీశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ జీవో 154 విడుదల చేశారు. దొంగ ఓటర్ కార్డుల కేసులో పోలీసులు ఆయన పాత్రపై దర్యాప్తుచేయాల్సి ఉందని అందులో పేర్కొన్నారు. అసలు విషయం ఏమిటంటే... ఆయనను ఎప్పుడో సస్పెండ్ చేయాలని ఈసీ సూచించింది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తూ, ఇటీవలే ఆయనను మెప్మా అసిస్టెంట్ డైరెక్టర్‌గా నియమించింది. చివరికి.. ఈసీ నుంచి ఘాటు హెచ్చరికలు రావడంతో శుక్రవారం చంద్రమౌళీశ్వర రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.


33 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో 33 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల చేసింది. కాలుష్య నియంత్రణ మండలిలో గ్రేడ్-2 అనలిస్ట్ 18, టౌన్ ప్లానింగ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ 7, వైద్య విద్యలో లైబ్రేరియన్ 4, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఒకటి, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సర్వీసులో అసిస్టెంట్ డైరెక్టర్ 2, భూగర్భ జలవనరుల్లో అసిస్టెంట్ కెమిస్ట్ ఒకటి చొప్పున పోస్టులకు ఆరు నోటిఫికేషన్లు జారీచేసింది.

దేశంలో 96.88 కోట్ల ఓటర్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: దేశంలో 96.88 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం వెల్లడించింది. వీరు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఉంది. 2019తో పోల్చితే ఓటర్లు 6శాతం పెరిగారు. 18-29 ఏళ్ల మధ్య వయసుగల 2 కోట్ల మంది యువత ఓటరుగా నమోదు చేసుకున్నారని ఈసీ తెలిపింది. ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 2023లో 940మంది స్త్రీ ఓటర్లుండగా 2024లో 948కి పెరిగారు.

రైతు నాయకుడు చరణ్‌సింగ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భారత రాజకీయాల్లో ఎందరో నాయకులు తాము రైతుల పక్షమని చెప్పుకొన్నారు. అన్నదాతల సంక్షేమమే తమ లక్ష్యం అని కూడా ప్రకటించేవారు. కానీ, చరిత్ర చూస్తే అసలైన 'రైతు నాయకుడు' ఎవరంటే మాత్రం ఒక్కరి పేరే చెబుతారు. ఆయనే చౌధరి చరణ్‌సింగ్. అన్నదాతల సంక్షేమం కోసం జీవితాంతం పాటుపడిన నేతగా ఆయనను పేర్కొంటారు. చరణ్‌సింగ్ జయంతిని జాతీయ రైతు దినోత్సవంగా జరుపుకొనడాన్ని బట్టే ఆయన ప్రాధాన్యం ఏమిటో తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో 1902 డిసెంబరు 23న జన్మించారు చరణ్‌సింగ్. గాంధీజీ ప్రేరణతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1937లో ఛప్రౌలీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1946, 1952, 1962, 1967లోనూ విజయం సాధించారు. మంత్రిగానూ పనిచేశారు. కాంగ్రెస్‌తో విభేదించి 1967లో భారతీయ క్రాంతిదళ్‌ను స్థాపించారు. సంయుక్త విధాయక్ దళ్ కూటమి తరఫున ఆ ఏడాది ఏప్రిల్‌లో యూపీకి సీఎం అయ్యారు. ఆ రాష్ట్రానికి కాంగ్రెసేతర తొలి సీఎం చరణ్‌సింగ్ కావడం గమనార్హం. మరోసారి సీఎం అయిన తర్వాత చరణ్‌సింగ్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష అనుభవించారు. ఆ తర్వాత ఏర్పాటైన జనతా పార్టీ ప్రభుత్వంలో మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో ఉప ప్రధానిగా పనిచేశారు. హోం, ఆర్థిక శాఖలు చూశారు. 1979లో జన సంఘ్ మద్దతు ఉపసంహరణలో మొరార్జీ ప్రభుత్వం పడిపోయింది. ఇందిరాగాంధీ సారథ్యంలోని కాంగ్రెస్ అండతో, దేశ ఐదో ప్రధానిగా చరణ్‌సింగ్ 1979 జూలై 28న బాధ్యతలు చేపట్టారు. కేవలం 23 రోజులకే.. లోక్‌సభలో ఆయన బలం కూడా నిరూపించుకముందే కాంగ్రెస్ మద్దతు వెనక్కు తీసుకోవడం ప్రభుత్వం పడిపోయింది. చరణ్‌సింగ్ 1980 జనవరి 14 వరకు ఆపద్ధర్మ ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ వ్యవధిలో ఆయన పార్లమెంటుకు ఒక్కసారిగా కూడా వెళ్లలేదు. పార్లమెంటుకు వెళ్లని ఏకైక ప్రధాని చరణ్‌సింగ్ మాత్రమే. ప్రధానిగా దిగిపోయాక.. 1980లో లోక్‌దళ్ పేరిట చరణ్ సింగ్ సొంత పార్టీని నెలకొల్పారు. చరణ్‌సింగ్ తొలిసారి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే.. రైతులను రుణ విముక్తలను చేసేందుకు 1939లోనే బిల్లు ప్రవేశపెట్టారు. జమీందారీ వ్యవస్థ రద్దు, భూపరిమితి చట్టం తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే జాట్‌లు, యాదవులు, గుజ్జర్లు, కుర్మీలు వంటి వ్యవసాయ సామాజిక వర్గాలు చరణ్‌సింగ్ నాయకత్వాన్ని బలపరిచాయి. ప్రస్తుతం చరణ్‌సింగ్ మనమడు జయంత్ చౌధరి లోక్‌దళ్ అధ్యక్షుడిగా ఉన్నారు. చరణ్‌సింగ్ 1987 మే 29న తుది శ్వాస విడిచారు. రైతులకు చేసిన సేవలకుగాను రాజ్‌ఘాట్‌లోని ఆయన స్మారకానికి కిసాన్ ఘాట్‌గా పేరుపెట్టారు.

భారతరత్నం పీవీ



(మొదటి పేజీ తరువాయి)

ఈ పురస్కారాన్ని ఇవ్వనున్నట్లు శుక్రవారం తెలియజేసింది. ఇప్పటికే బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్, బీజేపీ కురువృద్ధ నేత ఎల్‌కే అద్వానీలకు భారతరత్న ప్రకటించిన విషయం తెలిసిందే. ఒకే ఏడాది ఐదుగురికి దేశ అత్యున్నత పురస్కారం ప్రకటించటం ఇదే ప్రథమం. 1999లో నలుగురికి భారతరత్న ఇచ్చారు. పీవీ, చరణ్‌సింగ్, స్వామినాథన్‌లకు భారతరత్న పురస్కారంపై ప్రధాని మోదీ ట్విటర్‌లో స్పందిస్తూ వారి సేవల్ని కొనియాడారు. 'మన మాజీ ప్రధానమంత్రి శ్రీ పీవీ నరసింహారావు గారిని భారతరత్నతో గౌరవిస్తున్నామని తెలియజేయటానికి సంతోషిస్తున్నా. విఖ్యాత మేధావిగా, రాజనీతిజ్ఞుడిగా నరసింహారావు గారు దేశానికి పలు హోదాల్లో అపారమైన సేవలు అందించారు. ఉమ్మడి ఏపీ సీఎంగా, కేంద్రమంత్రిగా ఎంపీగా, ఎమ్మెల్యేగా ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. భారత్‌ను ఆర్థికంగా ఆధునిక దేశంగా మలచటంలో, దేశాభివృద్ధికి, సుసంపన్నతకు పటిష్ఠమైన పునాది వేయటంలో ఆయన దార్శనిక నాయకత్వం కీలకమైనది. ప్రధానమంత్రిగా నరసింహారావుగారి హయాంలోనే భారత మార్కెట్ల తలుపులను ప్రపంచానికి తెరిచే కీలక నిర్ణయం తీసుకున్నారు. తద్వారా ఓ కొత్త ఆర్థిక శకానికి నాంది పలికారు' అని మోదీ పేర్కొన్నారు. భారత విదేశాంగ విధానం, భాషలు, విద్యారంగాల్లో పీవీ కృషి, అందించిన సేవలు ఆయన బహుముఖ ప్రజ్ఞను తెలియజేస్తాయన్నారు. క్లిష్టమైన పరివర్తన దశలో భారత్‌కు సారథ్యం వహించిన నరసింహారావు గారు మన దేశ సాంస్కృతిక, మేధోరంగాలను సుసంపన్నం చేశారని మోదీ శ్లాఘించారు. చౌదరీ చరణ్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వటంపై స్పందిస్తూ.. రైతు సంక్షేమం కోసం, రైతుల హక్కుల కోసం చరణ్‌సింగ్ జీవితాంతం కృషి చేశారు. యూపీ సీఎంగా, కేంద్ర హోంమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన రైతుల కోసం అనేక చర్యలు తీసుకున్నారు. జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా చరణ్‌సింగ్ చేసిన పోరాటం, ప్రజాస్వామ్యం పట్ల ఆయన అంకితభావం జాతి యావత్తుకూ స్ఫూర్తి కలిగించింది' అని పేర్కొన్నారు. విఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్‌ను తాను దగ్గరి నుంచి చూశానని, ఆయన సలహాలకు సూచనలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చే వాడినని ప్రధాని వెల్లడించారు. 'వ్యవసాయం, రైతు సంక్షేమం రంగాల్లో దేశానికి డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చేసిన సేవలు నిరుపమానమైనవి. భారత వ్యవసాయరంగం గట్టి సవాళ్లను ఎదుర్కొంటూ కూడా స్వయంసమృద్ధి సాధించటంలో, సాగును ఆధునీకరించటంలో ఆయన అత్యంత ముఖ్యపాత్ర పోషించారు. ఆయన దార్శనిక నాయకత్వం దేశ వ్యవసాయ రంగం ముఖచిత్రాన్ని మార్చివేయటమే కాదు, దేశానికి ఆహార భద్రతను కల్పించి సంపదను సృష్టించింది' అని ప్రధాని మోదీ ప్రశంసించారు. కాగా, 1991-96 మధ్య దేశ ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన పీవీ నరసింహారావు 1921లో జన్మించారు. ఆయన స్వస్థలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వంగర. వరంగల్‌లో ప్రాథమిక, హైస్కూలు ఉన్నత విద్యాభ్యాసం తర్వాత హైదరాబాద్, నాగపూర్, పూణేలలో చదివారు. నిజాం వ్యతిరేక పోరాటంతోపాటు స్వాతంత్రోద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. రాజీవ్ మరణానంతరం ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

ప్రధానికి పీవీ కుమారుడి కృతజ్ఞతలు

పీవీకి భారతరత్న పురస్కారంపై ఆయన తనయుడు ప్రభాకర్‌రావు మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇది తెలుగువారికే కాక మొత్తం భారతీయులకు సంతోషం కలిగించే సందర్భమన్నారు. దాదాపు ఆరు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసిన తన తండ్రి స్వాతంత్రానంతర భారతదేశ చరిత్రపై చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ఆయన దూరదృష్టి వల్ల దేశం అభివృద్ధి పథంలోకి పయనించిందని చెప్పారు.

రాజకీయ కారణాలు

బీజేపీ యేతర పార్టీల నేపథ్యం నుంచి వచ్చిన పీవీ, చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించటం ద్వారా బీజేపీ దేశవ్యాప్తంగా ఆమోదయోగ్యతను సాధించుకునే వ్యూహం ఉన్నదని విశ్లేషకులు భావిస్తున్నారు. పీవీకి కాంగ్రెస్ తగిన గౌరవం ఇవ్వలేదన్న విమర్శ ఎంతోకాలంగా ఉంది. ఆయనకు భారతరత్న ప్రకటించటం వల్ల కాంగ్రెస్‌పై పైచేయి సాధించటానికి బీజేపీకి మరో కారణం లభిస్తుందని అంటున్నారు. చరణ్‌సింగ్ మనవడు జయంత్‌సింగ్ ప్రస్తుతం రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) పార్టీకి ప్రస్తుతం సారథ్యం వహిస్తున్నారు. ఇప్పటి వరకూ ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఉన్న జయంత్‌సింగ్.. ఎన్‌డీఏలో చేరనున్నట్లు వార్తలొస్తున్నాయి.

లోకం తీరు



పీవీకి భారతరత్న సముచితం

దేశ చరిత్రను లిఖించిన రాజనీతజ్ఞుడు అయిన పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటించడం సముచితం. అత్యంత దుర్భర కాలంలో సంస్కరణలు అమలు చేసి దేశ ఆర్థిక వ్యవస్థను సరైన దిశలో నడిపించే విషయంలో పీవీ అందించిన సేవలు చిరస్మరణీయం. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు

- అమిత్ షా, కేంద్ర హోం శాఖ మంత్రి

స్వాగతిస్తున్నా.. సందేహమేంటి?

మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటిస్తూ ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. అందులో సందేహం ఏముంది?

- సోనియా గాంధీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు

కాన్షీరామ్‌కు కూడా ఇవ్వాలి

భారతరత్న పురస్కారాల ప్రకటనలో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మేము స్వాగతిస్తున్నాం. కానీ, ఈ విషయంలో దళిత నేతలకు తగిన గౌరవం లభించడం లేదు. అత్యున్నత పురస్కారానికి వారిని ఎంపిక చేయకపోవడం సరికాదు. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. కాన్షీరాంకు కూడా భారతరత్న ప్రకటించాలి

- మాయావతి, బీఎస్పీ అధ్యక్షురాలు

మోదీ సంస్కారానికి నిదర్శనం

» పీవీ కుమార్తె సురభి వాణీదేవి

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా పీవీ సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించడం ప్రధాని మోదీ సంస్కారానికి నిదర్శనమని పీవీ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న ఇవ్వడంతో ఆ పురస్కారం విలువ మరింత పెరిగిందన్నారు. 'పీవీకి భారతరత్న ప్రకటించడంతో తెలంగాణ ప్రజలు, మా కుటుంబసభ్యుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పీవీని గౌరవించుకోవడమంటే.. మనల్ని మనం గౌరవించుకున్నట్లే. భారత్.. ఇప్పుడు అన్ని రంగాల్లో అత్యున్నతంగా నిలిచిందంటే దానికి కారణం.. మా తండ్రి వేసిన బాటలే.. జీవించినంత కాలం పీవీ కాంగ్రెస్‌లోనే ఉన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా భారతరత్న ఇచ్చింది' అని వాణీదేవి వ్యాఖ్యానించారు. టెక్నాలజీని ఉపయోగించడంలో పీవీ దిట్ట అని.. తాను చూసిన మొదటి ల్యాప్‌టాప్ నాన్నదేనని వాణీదేవి చెప్పారు. అష్టావధానం, ఫొటోగ్రఫీ అంటే ఆయనకు ఎంతో మక్కువన్నారు.

ఆకలిపై దేశాన్ని గెలిపించిన.. కృషీ రత్నం

ఆహార కొరత, కరువుకాటకాల భారత్‌కు గోధుమ జన్యు పరిశోధనలతో కొత్త జీవం

చెన్నై, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆకలి రక్కసిని అంతమొందించేందుకు నిరంతరం శ్రమించిన హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్. ఇప్పుడు ఆయన భారత రత్న కూడా అయ్యారు. స్వామినాథన్ పూర్తి పేరు 'మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్'. తమిళనాడులోని తిరుచ్చి జిల్లా కుంభకోణంలో 1925 ఆగస్టు 7వ తేదీన డాక్టర్ ఎంకే సాంబశివన్, పార్వతి తంగమ్మాళ్ దంపతులకు జన్మించారు. స్వామినాథన్ తండ్రి వైద్యుడు. స్వామినాథన్ కూడా తన లాగే వైద్యవృత్తిని స్వీకరించి, తన వైద్యశాల బాధ్యతలు నిర్వర్తించాలని ఆయన కోరుకునేవారు. అయితే అప్పట్లో బెంగాల్‌లో ఏర్పడిన విపరీతమైన కరువు పరిస్థితులు స్వామినాథన్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. స్వామినాథన్ 11 యేళ్ల వయస్సులో ఉండగా ఆయన తండ్రి కన్నుమూశారు. పినతండ్రి సంరక్షణలో పెరిగిన ఆయన.. వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేయాలని భావించారు. 1940-44లో మద్రాస్ వ్యవసాయ కళాశాలలో చేరి వ్యవసాయ శాస్త్రంలో పట్టభద్రులయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలో జన్యు పంటల పరిశోధనలకు సంబంధించి ప్రథమశ్రేణిలో పీజీ డిగ్రీని పొందారు. 1948లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. కానీ పోలీసుశాఖలో చేరలేదు. పలు పరిశోధనా సంస్థల్లో పనిచేయడానికి మొగ్గుచూపారు. వ్యవసాయ పరిశోధనలపై అనేక గ్రంథాలను రచించారు.

ఇదీ గోధుమ విప్లవం...

1960 దశకంలో దేశంలో కరువు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఈ గండం గట్టెక్కేందుకు అప్పట్లో అమెరికా నుంచి గోధుమలను దిగుమతి చేసుకునేవారు. సరిగ్గా ఇదే తరుణంలో స్వామినాథన్ కొత్త ప్రయోగానికి నాంది పలికారు. జపాన్‌లో కొత్తగా కనుగొన్న గోధుమ వంగడాన్ని దేశంలో ప్రవేశపెట్టి, అధిక ఉత్పత్తిని, రెట్టింపు లాభాలను సాధించేందుకు ఆయన దోహదపడ్డారు. దీనినే 'గోధుమ విప్లవం' అని నాటి ప్రధాని ఇందిర కొనియాడారు. అదేవిధంగా చైనా వరివంగడాలను కూడా దేశంలో ప్రవేశపెట్టి వరిధాన్యాల ఉత్పత్తిని ఆయన అధికం చేశారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయం స్వంవృద్ధిని సాధించేందుకు ఎంతో కృషి చేశారు. పస్తులు లేని భారత దేశమే తన సంకల్పమని ఆయన పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఇందుకోసం తమిళనాడులో 1980ల్లో 'ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్'ను స్థాపించారు.



అవార్డులకే వన్నె..

పేరు గడించిన పరిశోధనా సంస్థల్లో ప్రొఫెసర్‌గా, పరిశోధకుడిగా, విభాగాధిపతిగా ఎన్నో పదవులను అధిరోహించిన స్వామినాథన్‌ను దేశవిదేశాల్లోని యూనివర్శిటీలకు చెందిన 84 గౌరవ డాక్టరేట్లు, వందలాది అవార్డులు వరించాయి. 'రామన్ మెగసెసే' అవార్డు ఆయన్ని వరించింది. కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శిగా, కేంద్ర ప్రణాళికా సంఘం సభ్యుడిగా సేవలందించారు. స్వామినాథన్‌కు పద్మశ్రీ (1967), పద్మభూషణ్ (1972), పద్మవిభూషణ్ (1989) అవార్డులు వచ్చాయి. ఇప్పుడు ఆయన మరణానంతరం 'భారతరత్న'ను ప్రకటించడంతో కేంద్రప్రభుత్వం అందించే అన్ని పౌర పురస్కారాలు పొందిన వ్యక్తిగా స్వామినాథన్ రికార్డులకెక్కారు. ఆయన 2007 నుంచి 2013 వరకు రాజ్యసభ సభ్యునిగానూ వ్యవహరించారు. స్వామినాథన్ గత ఏడాది సెప్టెంబరు 28వ తేదీన తన 98వ యేట కన్నుమూశారు.

అధిక దిగుబడులనిచ్చే గోధుమలు, వరిధాన్యాలు..

1960లో భారత్, పాకిస్థాన్‌లలో ఆహారధాన్యాల కొరత తీవ్ర రూపం దాల్చింది. తన పరిశోధనల ద్వారా అధిక దిగుబడులనిచ్చే గోధుమ, వరి వంగడాలను ప్రవేశపెట్టి ఆహారధాన్యాల ఉత్పత్తిలో రెండు దేశాలూ స్వయం సమృద్ధిని సాధించేందుకు స్వామినాథన్ దోహదపడ్డారు. ఆ పరిశోధనల్లో ప్రముఖ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్ ఆయనకు అండగా నిలిచారు. అప్పట్లో రైతులందరినీ కొత్త వంగడాలకు చెందిన వరిపంటలను పండించేందుకు ప్రోత్సహించడం వల్లే హరిత విప్లవాన్ని విజయవంతం చేయగలిగారు. అంతర్జాతీయ వరిధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఆర్ఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా స్వామినాథన్ అందించిన సేవలకు 1987లో తొలి ప్రపంచ ఆహార పురస్కారం ఆయనను వరించింది.

చిన్నప్పటి నుంచే పంటలపై ఆసక్తి..

స్వామినాథన్ పదిహేనేళ్ల బాలుడిగా ఉన్నప్పుడే తన ఊరిలోని కొబ్బరి, మామిడి తోటల పెంపకందార్లు, రైతులతో సుదీర్ఘ చర్చలు జరిపేవారు. వరి, మామిడితోపాటు కాఫీ గింజలను కూడా పెంచాలని ఆయన రైతులకు సూచించేవారు. తండ్రిలా వైద్యవృత్తిని స్వీకరించలేదు. తొలి నుంచీ రైతుల బాగోగులపైనే ఆయన దృష్టిసారించారు. కనుకనే ఆయన జీవిత పర్యంతం వ్యవసాయ రంగంపైనే పరిశోధనలు సాగించి, యువ వ్యవసాయ శాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తూ వచ్చారు. పస్తులు లేని సమాజస్థాపనే తన జీవిత లక్ష్యమని ఆయన పదేపదే ప్రకటించారు. ఆ దిశగానే తుదిశ్వాస విడిచేంత వరకూ ఆయన తన పరిశోధనలు సాగించారు.

భారతరత్నాలు 53 మంది!

» 2024లోనే అత్యధికంగా ఐదుగురికి ప్రదానం

» ఒకే ఏడాదిలో ఇంతమందికివ్వడం తొలిసారి

» 1999లో నలుగురికి ప్రతిష్ఠాత్మక పురస్కారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చరణ్‌సింగ్‌తో పాటు హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్రం 'భారత రత్న' ప్రకటించడంతో ఇప్పటి వరకూ ఈ అత్యున్నత పౌర పురస్కారం అందుకున్నవారి సంఖ్య 53కు చేరింది. ఇందులో 2024లో ఏకంగా ఐదుగురిని ఈ అవార్డు వరించింది. బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అద్వాణీ, బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌లకు ఇటీవలే భారతరత్న ప్రకటించారు. ఒక ఏడాదిలో ఇంత మందిని ఎంపిక చేయడం ఇదే మొదటిసారి. ఇప్పటి వరకూ అత్యధికంగా 1999లో నలుగురు గ్రహీతలకు ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందించారు. చివరిసారిగా 2019లో ప్రణబ్ ముఖర్జీకి, మరణానంతరం భూపేంద్ర కుమార్ హజారికా, నానాజీ దేశ్‌ముఖ్‌కు భారతరత్న ప్రదానం చేశారు. 2020-23 మధ్యకాలంలో ఈ అవార్డును ఎవరికీ ఇవ్వలేదు.

- దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న. మానవ జాతి అభివృద్ధికి పాటుపడే ఏదైనా రంగంలో విశేష కృషి లేదా చేసిన సేవకు గుర్తింపుగా దీన్ని ప్రదానం చేస్తారు.
- 1954లో భారతరత్న, పద్మవిభూషణ్ అనే రెండు పౌర పురస్కారాలను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం ప్రకటించింది. రెండోదానిలో తొలుత మూడంచెలు ఉండగా, 1955 జనవరి 8న రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా వాటికి పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీగా నామకరణం చేశారు.
- ఈ పురస్కారం కోసం సిఫారసులు చేసే విధానం లేకపోయినప్పటికీ ప్రధానమంత్రి మాత్రమే రాష్ట్రపతికి గ్రహీతల జాబితాను సూచిస్తారు.
- చాలా సందర్భాల్లో ఏడాదిలో ముగ్గురికి, ఇద్దరికి ఈ అవార్డు ప్రకటించగా, అసలు ఎవరికీ ప్రదానం చేయని సంవత్సరాలు కూడా ఉన్నాయి.
- తొలి ఏడాది సి. రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్, చంద్రశేఖర వెంకట రామన్‌కు ఈ పురస్కారం లభించింది.
- అవార్డు గ్రహీతలకు రాష్ట్రపతి సంతకం చేసిన సనద్ (సర్టిఫికెట్), పతకం అందజేస్తారు. ఈ పురస్కారం కింద ఎలాంటి నగదు మంజూరు చేయరు.

తాతకు భారతరత్న.. ఆ వెంటనే పొత్తు

» బీజేపీతో కలిసి నడిచేందుకు ఆర్ఎల్డీ అధినేత జయంత్ సై

» పొత్తు ప్రతిపాదనను ఇప్పుడు ఎలా కాదనగలను?

» చరణ్ సింగ్‌కు అవార్డు ప్రకటించిన కొద్దిసేపటికే వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉంటుందని రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్డీ) అధ్యక్షుడు జయంత్ చౌదరీ ప్రకటించారు. ఆయన తాత, మాజీ ప్రధాని చౌదరీ చరణ్ సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన గంటల వ్యవధిలోనే జయంత్ చౌదరీ ఈ ప్రకటన చేయడం విశేషం. బీజేపీతో పొత్తు గురించి వస్తున్న కథనాలపై స్పందన కోరగా.. "బీజేపీ ప్రతిపాదనను ఇప్పుడు నేనెలా కాదనగలను?" అని వ్యాఖ్యానించారు. పైగా ఏ పార్టీ ఇప్పటిదాకా చేయలేని విధంగా తనదైన విజన్‌తో మోదీ పనులు చేశారని కొనియాడారు. జాట్ల సామాజిక వర్గం ఎక్కువగా ఉన్న పశ్చిమ యూపీలో ఆర్ఎల్డీకి విశేష పట్టు ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆర్ఎల్డీతో పొత్తు పెట్టుకుంటే ఇక్కడ భారీగా స్థానాలను దక్కించుకోవచ్చునని బీజేపీ భావిస్తోంది. సీట్ల పంపకాల్లో భాగంగా ఆర్ఎల్డీకి యూపీలోని భాగ్పత్, బిజ్నోర్ లోక్‌సభ స్థానాలను కేటాయించడంతో పాటు, ఓ రాజ్యసభ స్థానంపై బీజేపీ హామీ ఇచ్చినట్లు తెలిసింది.


పేపరు లీకుల నిరోధక బిల్లుకు పార్లమెంటు ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: పోటీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలను నిరోధించడానికి ఉద్దేశించిన బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. పబ్లిక్ పరీక్షల అక్రమ మార్గాల నిరోధక బిల్లు-2024 పేరుతో రూపొందించిన దీన్ని శుక్రవారం రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. కొందరు ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన సవరణలను తిరస్కరించింది. ఈ బిల్లు మంగళవారమే లోక్‌సభ ఆమోదం పొందడం గమనార్హం. దీంట్లోని నిబంధనల ప్రకారం అక్రమాలకు పాల్పడితే పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.కోటి జరిమానా కూడా ఉంటుంది. గుజరాత్, హరియాణా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో పేపర్లు లీకయిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది.

మా ఆదేశాలు అమలు చేయలేదేమి?

» యూపీ సర్కారును ప్రశ్నించిన సుప్రీంకోర్టు

» సహచరుడ్ని విద్యార్థులు కొట్టిన కేసుపై విచారణ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: సహచరుడ్ని కొట్టిన సంఘటనలో విద్యార్థులందరికీ కౌన్సెలింగ్ ఇప్పించాలన్న తమ ఆదేశాలు ఎందుకు అమలు చేయలేదని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వాన్ని శుక్రవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముజఫర్‌నగర్ జిల్లా ఖుబ్బాపూర్ గ్రామ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఓ ముస్లిం విద్యార్థిని హోం వర్కు చేయలేదన్న కారణంతో ఆ క్లాసు టీచరు శిక్షించారు. తోటి విద్యార్థులతో ఆ బాలుడ్ని కొట్టించడంతో పాటు, మతపరంగా కూడా వ్యాఖ్యలు చేశారు. ఈ సంఘటనపై మహాత్మా గాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ధర్మాసనం సంఘటనకు పాల్పడిన, సాక్షులుగా ఉన్న విద్యార్థులను ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) నిపుణుల ద్వారా కౌన్సెలింగ్ జరపాలని ఆదేశించింది. కౌన్సెలింగ్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో తాజాగా విచారణ జరిపిన జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం తప్పుపట్టింది. వెంటనే అమలు చేసి, రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి ఒకటో తేదీకి వాయిదా వేసింది. విద్యార్థిని కొట్టించిన ఆ మహిళా టీచరుపై యూపీ ప్రభుత్వం కేసు నమోదు చేసింది.

దేశాన్ని సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్

యూపీఏ పాలనలో కుటుంబానికే ప్రాధాన్యం.. నిర్మలా సీతారామన్ మండిపాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ నేతృత్వంలోని గత యూపీఏ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను దుర్వినియోగం చేసిందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ విమర్శించారు. కుటుంబానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చిన ఆ పార్టీ 2014లో దేశాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టిందని, ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను నిర్వహించడంపై మోదీ ప్రభుత్వానికి ఉపన్యాసాలు ఇస్తోందని ఎద్దేవా చేశారు. 'భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం, దేశ ప్రజల జీవితాలపై దాని ప్రభావం' అనే అంశంపై లోక్‌సభలో శుక్రవారం ఆమె చర్చను ప్రారంభిస్తూ... దేశానికి తొలి ప్రాధాన్యం ఇచ్చిన మోదీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను టాప్-5కు తీసుకెళ్లిందని తెలిపారు. భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోందని చెప్పారు. ప్రభుత్వం చిత్తశుద్ధి, పారదర్శకతతో వ్యవహరించి దేశానికి తొలి ప్రాధాన్యం ఇస్తే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ శ్వేతపత్రం స్పష్టంగా చెబుతోందన్నారు. "దేశానికికాకుండా కుటుంబానికి మాత్రమే మొదటి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు పారదర్శకత కాకుండా వేరే ఆలోచన చేసినప్పుడు ఎలాంటి ఫలితాలు వచ్చాయో అందరూ చూశారు. అదే ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటే వచ్చే ఫలితాలు కూడా బాగుంటాయని కొవిడ్ అనంతర పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. 2008 తర్వాత ప్రపంచ ఆర్థిక సంక్షోభం కంటే కొవిడ్ సంక్షోభం చాలా ప్రాణాంతకమైంది. మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధి, అంకితభావంతో ప్రజలకు ఉచితంగా టీకాలు ఇచ్చింది"అని సీతారామన్ అన్నారు.

యూపీఏ హయాం..కుంభకోణాల మయం

"2008నాటి సంక్షోభ సమయంలో దేశ ప్రయోజనాలను కాపాడేందుకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు. ఒకటి తర్వాత ఒకటిగా కుంభకోణాలు వెలుగుచూశాయి. భారత ఆర్థిక వ్యవస్థను కాపాడలేకపోయిన వారు ఇప్పుడు మాకు పాఠాలు చెబుతున్నారు" అని నిర్మల మండిపడ్డారు. యూపీఏ హయాంలో బొగ్గు కుంభకోణం వల్ల దేశానికి రూ.1.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని, 214 బొగ్గు బ్లాకుల లైసెన్స్‌లను సుప్రీంకోర్టు రద్దుచేయాల్సి వచ్చిందన్న కాగ్ నివేదికను మంత్రి ఉదహరించారు. మోదీ ప్రభుత్వం పారదర్శకంగా బొగ్గు వేలం నిర్వహించిందన్నారు. మీరు బొగ్గును బూడిదగా మారిస్తే మోదీ ప్రభుత్వం తన విధానాల ద్వారా దాన్ని వజ్రాలుగా మార్చిందన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులకు బొగ్గు గనులు కేటాయించిన వారు క్రోనీ కేపిటలిజంపై ఉపన్యాసాలు ఇస్తున్నారని విమర్శించారు. కాగా, శ్వేతపత్రంపై చర్చకు ప్రతిపక్ష సభ్యులు సౌగతారాయ్ (టీఎంసీ), ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్‌పీ) అభ్యంతరం తెలిపారు. గత యూపీఏ ప్రభుత్వాన్ని కించపరిచే ప్రయత్నమన్నారు.



పదండి... మీకో పనిష్మెంట్ ఉంది..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ శుక్రవారం 8మంది ఎంపీలకు ప్రత్యేకంగా విందు ఇచ్చారు. పార్లమెంట్ క్యాంటీన్‌లో వారితో కలిసి మధ్యాహ్నం శాకాహార భోజనంతోపాటు రాగి లడ్డూలు తిన్నారు. బీజేపీ, బీఎస్పీ, బీజేడీ, ఆర్ఎస్‌పీ ఎంపీలతోపాటు టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు విందులో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రధానితో లంచ్‌కు సంబంధించి ఎంపీలకు సమాచారం అందింది. వెంటనే అంతా పార్లమెంట్ క్యాంటీన్ వద్దకు చేరారు. అక్కడకు వచ్చిన ప్రధాని 'పదండి. మీకో పనిష్మెంట్ ఇవ్వాలనుకుంటున్నాను' అని వారితో సరదాగా అన్నట్లు తెలిసింది. పార్లమెంట్ సమావేశాల సమయంలో అవకాశం ఉన్నప్పుడల్లా ప్రధాని ఇలా విందులు ఇస్తుంటారని రామ్మోహన్ తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో హింస.. ఆరుగురి మృతి

» అక్రమంగా నిర్మించిన ప్రార్థనామందిరం కూల్చివేత సందర్భంగా ఘర్షణ

» హల్ద్వానీలో కర్ఫ్యూ.

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఉత్తరాఖండ్‌లో అక్రమంగా నిర్మించిన మదర్సా కూల్చివేత సందర్భంగా పెద్ద ఎత్తున అల్లర్లు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో కనీసం ఆరుగురు ఆందోళనకారులు మరణించగా, 300 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో 100 మందికి పైగా పోలీసులు, డజన్లకొద్దీ మునిసిపల్ సిబ్బంది ఉన్నారు. ఆందోళనకారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం అల్లర్లకు పాల్పడ్డారని శుక్రవారం అధికారులు తెలిపారు. గురువారం హల్ద్వానీలోని బన్‌భూల్‌పురా ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేయడానికి వచ్చిన మున్సిపల్ కార్మికులు, పోలీసులపై స్థానికులు రాళ్లు రువ్వారు. ఒక జేసీబీ మిషన్‌ను, 70కి పైగా వాహనాలను తగులబెట్టి, పోలీస్‌స్టేషన్‌కు నిప్పుపెట్టారు. ఘటన జరిగిన ప్రాంతంలో కర్ఫ్యూ విధించి, భారీగా పోలీసు బలగాలను మోహరించారు. అల్లర్లు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉత్తరాఖండ్ ప్రభుత్వం రాష్ట్రమంతా హైఅలర్ట్ ప్రకటించింది. ఇంటర్నెట్ సేవలను బంద్ చేసింది. నైనిటాల్ జిల్లా మేజిస్ట్రేట్ వందనా సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆందోళనకారులు ముందస్తు ప్రణాళిక ప్రకారం ఘర్షణలకు పాల్పడ్డారని చెప్పారు. కాగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలోనూ భారీ ఎత్తున అల్లర్లు చెలరేగాయి. ప్రభుత్వ ముస్లిం వ్యతిరేక విధానాలకు నిరసనగా 'జైల్ భరో' ఆందోళనకు స్థానిక ముస్లిం మతగురువు మౌలానాతౌఫిక్ రజా పిలుపునివ్వడంతో ఇస్లామియా బిహారీపూర్ మైదానంలోకి వేల సంఖ్యలో జనం చేరుకున్న దరిమిలా తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

పాకిస్థాన్‌లో స్వతంత్ర అభ్యర్థుల ముందంజ

» వారిలో అత్యధికులు ఇమ్రాన్ ఖాన్ పార్టీ పీటీఐ మద్దతున్న వారే!

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 9: పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్‌సాఫ్(పీటీఐ) మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులు ముందంజలో ఉన్నట్లు శుక్రవారం వెలువడిన ఫలితాలనుబట్టి తెలుస్తోంది. పాక్ ఎన్నికల సంఘం పీటీఐకి ఎన్నికల గుర్తు బ్యాట్‌ని నిరాకరించడంతో ఆ పార్టీ అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగారు. 201 సీట్లకు ఫలితాలు ప్రకటించగా 86 మంది స్వతంత్రులు విజయం సాధించారు. వీరిలో అత్యధికులు పీటీఐ మద్దతున్నవారే. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ పార్టీ పీఎమ్ఎల్-ఎన్ 59, బిలావల్ జర్దారీ పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) 44 సీట్లు గెలుచుకున్నాయి. పీఎంఎల్-ఎన్ అధినేత నవాజ్ షరీఫ్ పీటీఐ అభ్యర్థిపై భారీ మెజారిటీతో గెలుపొందారు.

సర్వనాశే సముత్పన్నే..
అర్ధం త్యజతి పండితః

.." పూర్తిగా నాశనమవుతున్న పరిస్థితుల్లో వివేకవంతులు తమకున్న దాంట్లో సగం వదులుకుంటారు. తద్వారా, మిగిలింది పూర్తిగా నాశనం కాకుండా కాపాడుకోగలమని విశ్వసిస్తారు" అని దీని అర్థం. పీవీ అధికారం చేపట్టిన తర్వాత 1991 సంవత్సరం జూలై 13వ తేదీన విశ్వాస తీర్మానం లోక్‌సభలో ఓటింగ్‌కు వచ్చింది. ప్రధాన మంత్రిగా చేసిన తొలి ప్రసంగంలో సంస్కరణల గురించి చెబుతూ ఆయన చెప్పిన మాటలివి.

సంస్కరణలు ఎందుకంటే..

ఆ రోజు 45 నిమిషాలపాటు అనర్గళంగా స్వేచ్ఛా ప్రసంగం చేసిన ఆయన ఇలాంటి మేలిముత్యాల్లాంటి మాటలెన్నో చెప్పారు. బంగారం అమ్మకాలు, రూపాయి విలువ తగ్గింపు, ఐఎంఎఫ్‌తో చర్చలు వంటి బలమైన చర్యలను వరుసగా తీసుకోక తప్పలేదని సమర్థంగా వివరించారు. "మేము చేసిన దానికి ప్రత్యామ్నాయం ఏమీ లేదని మాకు తెలుసు. మేము ఈ దేశ ప్రతిష్ఠను మాత్రమే కాపాడాము" అని తేల్చిచెప్పారు.




పీవీ మన ఠీవీ



కంప్యూటర్ భాషలూ..

నేర్చుకోవడానికి వయసు అడ్డంకి కాదంటూ కంప్యూటర్ భాషలనూ పీవీ తన వృద్ధాప్యంలో నేర్చుకున్నారు! కోబాల్, బేసిక్ లాంగ్వేజెస్‌ను నేర్చుకుని.. యునిక్స్‌లో ప్రోగ్రామింగ్ కూడా చేసేవారంటారు. ఆయన పడగ్గదిలో ఒక కంప్యూటర్, ప్రింటర్ ఉండేవి. ప్రధానిగా ఉన్నప్పుడు ఇక్కడి నుంచి తెలుగు డీటీపీ ఆపరేటర్‌ను ఢిల్లీకి పిలిపించుకుని.. తెలుగులో టైప్ చేయడం నేర్చుకున్నారు. ఆ తర్వాత కాలంలో తన పుస్తకాలను తానే డీటీపీ చేసుకునేవారాయన.





సిసలైన భారతరత్నం

మాటే మంత్రం అంటారుగానీ..
మౌనమే అసలు మంత్రమని,
కుటిల రాజకీయాల్లో ఎలాంటి
క్లిష్టపరిస్థితులనైనా ఎదురొడ్డి నిలిచే
శక్తినివ్వగల రహస్య తంత్రమని..
తెలిసి మసలుకొన్న మహా జ్ఞాని..
మౌన ముని..

పాములపర్తి వెంకట నరసింహారావు!

ఆయన మాటల మనిషి కాదు. చేతల మనిషి. సముద్రమంత లోతైన మనసున్న లోపలి మనిషి.

పదిహేడు భాషలు మాట్లాడగలిగే బహుభాషా కోవిదుడైనా.. 'పలుకు'ను బంగారం కన్నా పొదుపుగా వాడి మాటకున్న శక్తిని మౌనంగానే నిరూపించిన అపర బృహస్పతి.

సంక్షోభంలో చిక్కుకుని.. అదుపు తప్పిన ద్రవ్యోల్బణ సుడిగుండంలో పడి కొట్టుకుపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దిన అపర కౌటిల్యుడు.. ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడై ఉజ్వల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసిన ఆధునిక భారత నిర్మాత!

నిప్పులగుండంలాంటి నిత్య అసమ్మతిని నిమ్మళంగా ఎదుర్కొంటూనే.. ముఖ్యమంత్రిగా ఇక్కడ భూసంస్కరణలు.. ప్రధానిగా అక్కడ ఆర్థిక సంస్కరణలతో పచ్చటి భవితకు బాటలు వేసిన చాణక్యుడు!

ఇన్ని మాటలేల.. భరతమాత సిగను ధరించిన నిజమైన రత్నం పీవీ! ప్రభుత్వం ఇప్పుడిచ్చిన భారతరత్న పురస్కారం లాంఛనమే!!

పీఠాధిపతి అవుదామనుకుంటే..

కాంగ్రెస్ పార్టీ 1991 ఎన్నికల్లో పీవీకి టికెట్ కేటాయించలేదు. మరోవైపు.. తమిళనాడు కుర్తాళంలోని సిద్ధేశ్వర పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించాలంటూ పీఠం నుంచి ఆయనకు సందేశాలు వస్తున్నాయి. ఎన్నికల్లో టికెట్ కూడా రాకపోవడంతో ఆయన రాజకీయ జీవితానికి చుక్క పెట్టి ఆధ్యాత్మికం వైపు అడుగులు వేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పీఠానికి సంకేతాలు కూడా పంపారు. కానీ.. విధి ఆయనకు మరో బాధ్యతను అప్పజెప్పబోతున్న విషయం ఆయనకు అప్పటికి తెలియలేదు. అనూహ్యంగా రాజీవ్‌గాంధీ హత్యకు గురికావడం.. సోనియా గాంధీ పార్టీ పగ్గాలు చేపట్టడానికి నిరాకరించడంతో.. పార్టీ బాధ్యతలను ఎవరికి అప్పజెప్పాలన్న ప్రశ్న తలెత్తింది. జనంలో కరిష్మా ఉన్న అతిరథ, మహారథుల్లాంటి నేతలను కాదని సొంత బలం లేని పీవీకి పార్టీ పగ్గాలు అందించాలని సోనియా తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రనే మార్చేసింది.


సాహితీ మూర్తి

ఆ నిద్రాణ నిశీథిని మానిసి మేల్కాంచినాడు
ఒళ్లు విరిచి కళ్లు తెరిచి ఓహో అని లేచినాడు
కటిక చీకటుల చిమ్మెడు కారడవిని పయనించు
నిజ జఠరాగ్ని జ్వాలలు నింగినంత లేపినాడు

ఈ కవితను రాసిన వ్యక్తి ఎవరో కాదు పీవీ నరసింహారావు. 1972 ఆగస్టు 15న స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా అర్ధరాత్రి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆయన చేసిన కవితాగానమిది. ఇదొక సుదీర్ఘ కవిత. అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు లేచిన భారతీయుడి హృదయ గానం. ఆ మేల్కొన్న మనిషి ఎవరు? ఆయనే వివరించారు.

యుగయుగాల అన్యాయం
నగుమోముల దిగమ్రింగగ
సాంధ్యారుణ రౌద్ర క్షితిజ ముఖుడై చెలంగినాడు
వాడొక విప్లవ తపస్వి

పీవీ వర్ణించిన భారతీయుడు సామాన్యుడని, ఆకలితో దహించుకుపోతున్నాడని, అన్యాయాన్ని సహించలేక రుద్ర రూపం దాల్చిన విప్లవ తపస్వి అని స్పష్టంగా అర్థమవుతుంది. ఎక్కడ విప్లవం, ఎక్కడ తపస్సు. విప్లవ తపస్విఅనేదే ఒక విరోధాభాస. అది పీవీకే సాధ్యమయింది. పీవీ నరసింహారావుకు పాండిత్యం, భాషాపరిజ్ఞానంతో సరిసమానంగా చైతన్యవంతమైన, కవికి అవసరమైన భావోద్వేగాలున్నాయని ఈ ఒక్క కవిత చదివితే అర్థమవుతుంది. పీవీ రాజకీయనాయకుడైనప్పటికీ ఆయన జీవితంలో సాహిత్యం అంతర్లీనంగా ప్రవహిస్తూ వచ్చింది. పీవీ, ఆయన మిత్రుడు సదాశివరావు కలిసి కాకతీయ అనే పత్రిక నడిపేవారు. కాకతీయ కళాసమితి పేరిట ప్రతిసంవత్సరం సంగీత సాహిత్య సభలు నిర్వహించేవారు. వరంగల్‌లో తెలంగాణ తాత్విక కవిగా గుర్తింపు పొందిన గార్లపాటి రాఘవరెడ్డి.. హిందీ కవిత్వంలోని మార్మిక ఛాయావాదాన్ని వారికి పరిచయం చేశారు. కాళోజీ గురువు కూడా ఆయనే. విశ్వనాథ సాహిత్యాన్ని చదివి ఆయనపై అభిమానాన్ని పెంచుకున్న పీవీ.. 1955లో విశ్వనాథ ఒక సభకు వచ్చినప్పుడు ఆయనను కలిసి 'వేయిపడగలు' నవలను హిందీలో అనువదిస్తానని చెప్పి అనుమతి పొందారు. రాజకీయనాయకుడుగా తన చుట్టూ ఉన్న దుర్మార్గాలను చూసిన పీవీలో ప్రతిఘటనా స్వరం అడుగడుగునా కనిపిస్తుంది. విశ్వనాథ, సి.నారాయణరెడ్డికి జ్ఞానపీఠ, కాళోజీకి పద్మవిభూషణ్ పీవీ చొరవ వల్లే లభించాయి. పీవీ రచనలు.. లోపలి మనిషి (ఇన్ సైడర్), గొల్ల రామవ్వ, మంగయ్య అదృష్టం.. మూడూ సామాజిక, రాజకీయ పరిణామాలపై విశ్లేషణలే. మరాఠీ నుంచి 'పన్ లక్షత్ కోన్ ఘెటో' నవలను పీవీ 'అబల జీవితం' పేరుతో అనువదించారు. దీన్ని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది.



కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో పీవీ

భారత రాజకీయాల్లో అరుదైన మేధావి, ఆర్థిక సంస్కరణల ద్వారా దేశం ఆర్థిక, సామాజిక రూపురేఖల్ని పరివర్తనం చేసి, అభివృద్ధిని ఎజెండాగా మార్చిన రాజనీతిజ్ఞుడు, మైనారిటీ ప్రభుత్వమైనప్పటికీ అయిదు సంవత్సరాలు స్థిరంగా దేశానికి నాయకత్వం అందించిన చాణక్యుడు, అమెరికా, ఇజ్రాయిల్ తదితర దేశాలతో వినూత్న సంబంధాలు ప్రారంభించి, లుక్ ఈస్ట్ విధానం ద్వారా దేశ విదేశాంగ విధానాన్ని కొత్త పుంతలు తొక్కించిన దౌత్యనీతిజ్ఞుడు అయిన పీవీ నరసింహారావుకు ఆయన మరణించిన దాదాపు రెండు దశాబ్దాలకు భారత రత్న లభించింది. 1991-96 మధ్య ప్రధానిగా ఉన్న పీవీనరసింహారావు భారత దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఏ విధంగా మార్చారు? దేశానికి ఆయన చేసిన కృషి ఏమిటి? ప్రధానిగా ఆయన నిర్వహించిన పాత్రపై ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో చీఫ్ రచించిన 'విప్లవతపస్వి' నుంచి కొన్ని భాగాలు..

సంస్కరణల సారథి

పీవీ గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభించారు. ఆయన పగ్గాలు చేపట్టేనాటికి మన ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. అంతర్జాతీయ ఏజెన్సీలు భారత ఆర్థిక వ్యవస్థ పతనాన్ని సూచించాయి. విదేశీ రుణాలు పుట్టడం కష్టతరమైంది. రుణ చెల్లింపులను వాయిదా వేయడం కూడా గగనమైంది. ద్రవ్యలోటు జీడీపీలో 8 శాతానికి, విదేశీ అప్పులు జీడీపీలో 41 శాతానికి చేరుకోవడంతో దేశం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో మునిగి ఉన్నదని, దిగుమతులకు చెల్లించడానికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు కేవలం రెండువారాలకు మాత్రమే సరిపోతాయని ఆయన గమనించారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టినప్పటికీ సాహసోపేతంగా వాటిని అమలు చేసి దేశంలో నూతన ఆర్థిక సంస్కృతికి ఒరవడి దిద్దిన నేత నరసింహారావు. దేశంలో ప్రజల జీవన నాణ్యత పెరుగుదల పీవీ చలవేనంటే అతిశయోక్తి కాదు. అలాగే.. ఈ సంస్కరణల అమలు క్రమంలో ఆయన ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుని ఎన్నో పథకాలకు ఆద్యుడుగా నిలిచారు. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన, ఎంపీ లాడ్స్ పథకం, పార్లమెంటు స్థాయీసంఘాల వ్యవస్థను ప్రవేశపెట్టడం వంటివి ఇందుకు ఉదాహరణలు. ఆర్థిక సంస్కరణలను అమలు చేసేవిషయంలో పీవీ.. మన్మోహన్ సింగ్‌ను ఒక ఉపకరణంగా మాత్రమే ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన వెంటనే ఆయన.. అప్పటి క్యాబినెట్ సెక్రటరీ నరేశ్ చంద్ర, ఫైనాన్స్ సెక్రటరీ ఎస్.పి. శుక్లా, ప్రధాన ఆర్థిక సలహాదారు దీపక్ నయ్యర్‌ను పిలిచి దేశ ఆర్థిక పరిస్థితిపై చర్చించారు. ఆర్థిక మంత్రిగా రాజకీయ




నాయకుడిని కాక ఒక ఆర్థిక వేత్తను నియమించాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఆయన తనకు సన్నిహితుడైన పీసీ అలెగ్జాండర్ (ఇందిరాగాంధీ కాలంలో ప్రిన్సిపల్ సెక్రటరీ) సలహా తీసుకున్నారు. తొలుత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ డైరెక్టర్, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ ఐజీ పటేల్ (ఇంద్రవదన్ గోవర్ధన్ భాయి పటేల్)ను ఆర్థిక మంత్రిగా నియమించాలనుకున్నారు. కానీ ఆయన అందుకు అంగీకరించపోవడంతో మన్మోహన్ సింగ్‌ను ఎంపిక చేశారు. ప్రధాన మంత్రి పదవి నుంచి దిగిపోయాక 2018 డిసెంబర్‌లో తన పుస్తకం 'ఛేంజింగ్ ఇండియా' ఆవిష్కరణ సందర్భంగా మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ.. తాను యాదృచ్ఛికంగా ఆర్థిక మంత్రిని అయ్యానన్న విషయాన్ని అంగీకరించారు.

నిర్ణయం తీసుకోకపోవడమూ..

కొన్ని సందర్భాల్లో నిర్ణయాలు తీసుకోకపోవడం కూడా ఒక నిర్ణయమే అన్నది పీవీ నమ్మి ఆచరించిన సిద్ధాంతం. అది నిర్ణయ రాహిత్యమేననే ఆరోపణను ఆయన ఎంతమాత్రం ఒప్పుకోలేదు. 'నాది నిర్ణయరాహిత్యమే అయితే దేశంలో ఇన్ని బృహత్తర మార్పులు వచ్చేవా?' అని పీవీ తన మూడున్నర ఏళ్ల పాలన తర్వాత ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. ఆర్థిక సంస్కరణలు అనుకున్న విధంగా అమలు అయి భారత దేశం పేదరికం వంటి సమస్యలు పరిష్కారం కావాలంటే రాజకీయ సుస్థిరత ముఖ్యమని, అందుకే ఎన్ని అడ్డంకులు వచ్చినా స్పందించకుండా తన పనితాను చేసుకుపోవడం ముఖ్యమని పీవీ భావించారు.

విదేశాలతో సంబంధాలు

విదేశాంగ వ్యవహారాల విషయంలో పీవీ కొత్త ఒరవడిని సృష్టించారు. ఇజ్రాయిల్‌ను గుర్తించడం, చైనాతో సరిహద్దు సంఘర్షణలను నివారించడం వంటి అనేక అంశాలపై ఆయన ఏకాభిప్రాయ సాధన తెచ్చేందుకు ప్రయత్నించారు. అమెరికాలో ఆరు రోజులు పర్యటించి ఆ దేశంతో సంబంధాల్లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. అణుపరీక్షలపై నిషేధాన్ని అమలు చేసే ఒప్పందం (సీటీబీటీ) పై అమెరికాను చర్చల్లోకి దించి, చివరి వరకు ఆ ఒప్పందంపై సంతకం చేయకుండా కాలక్షేపం చేసిన పీవీ దౌత్యనీతి అమోఘం. 1947లో ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయిల్ ఆవిర్భావానికి వ్యతిరేకంగా ఓటు వేసిన భారత్ అప్పటి నుంచీ ఆ దేశంతో పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు ఏర్పర్చుకోలేదు. ముంబైలో ఇజ్రాయిల్‌కు ఒక చిన్న దౌత్య కార్యాలయం మాత్రమే ఉండేది. ఇజ్రాయిల్‌లో భారత్‌కు ఆ మాత్రం ఉనికి కూడా ఉండేది కాదు. పీవీ నరసింహారావు ఈ పరిస్థితిని మార్చి వేశారు. అయితే.. ఇజ్రాయిల్‌తో సంబంధాలు ఏర్పరచుకునే ముందు ఆయన పాలస్తీనా నేత యాసర్ అరాఫత్‌ను 1992 జనవరిలో భారత దేశానికి ఆహ్వానించారు. ఇక్కడ తనకు లభించిన ఘన స్వాగతానికి అరాఫత్ ఉబ్బి తబ్బిబ్బయ్యారు. వెళుతూ వెళుతూ 'భారత దేశం ఇజ్రాయిల్‌తో సంబంధాలు పెట్టుకుంటే తప్పేమిటి..' అని అరాఫత్ ప్రశ్నించడంతో.. అందరూ నివ్వెరపోయారు. ఫలితంగా.. 43 ఏళ్లుగా ఇజ్రాయిల్‌తో కొనసాగుతున్న ప్రతిష్టంభన కొద్ది రోజుల్లోనే తొలగిపోయింది. సింగపూర్, జపాన్ వంటి తూర్పు ఆసియా దేశాలతో సంబంధాలను కూడా పీవీయే పునరుద్ధరించారు. పీవీ అవలంబించిన 'లుక్ ఈస్ట్' విధానం మంచి ఫలితాలను ఇచ్చింది. చైనాతో కూడా నరసింహారావు సంబంధాలు పెంచుకోవాలనుకున్నారు. చైనా ప్రధాని లీ పెంగ్ 1991లో భారత్ రాగా, నరసింహారావు 1993లో చైనాకు వెళ్లారు. ఆయన హయాంలోనే భారత్, చైనా సరిహద్దుల్లో ప్రశాంతతకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నాయి.



వాజపేయి, పీవీ ఆత్మీయ ఆలింగనం

అభివృద్ధి మీకొద్దా?

చంద్రబాబునాయుడు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ చేపట్టారు. ఈ రోడ్ల విస్తరణ కారణంగా నష్టపోతున్న పీవీ సన్నిహితులు, బంధువులు కొందరు.. 'ఈ సీఎంకు చెక్ పెట్టాలంటే పీఎంను కలవాల్సిందే' అనుకుంటూ ఢిల్లీ బాట పట్టారు. తన ఇంటికి వచ్చినవారిని సాదరంగా ఆహ్వానించిన పీవీ.. వారు వచ్చిన పని గురించి అడిగి తెలుసుకున్నారు. అంతా మౌనంగా విని.. పార్లమెంటు నుంచి వచ్చాక సాయంత్రం వారితో సావకాశంగా మాట్లాడతానని చెప్పారు. ఈలోగా ఢిల్లీ చూసి రావాలంటూ వారికి ఒక ఏసీ వాహనం ఏర్పాటు చేశారు. వారు ఆ వాహనంలో ఢిల్లీని చుట్టబెట్టి సాయంత్రానికి పీవీ ఇంటికి చేరారు. అప్పటికే ఇంటికి వచ్చి ఉన్న పీవీ.. 'వచ్చారా. ఢిల్లీ బాగుందా?' అని అడిగారు. అందరూ ముక్తకంఠంతో.. 'చాలా బాగుంది' అని చెప్పారు. 'మరి ఇలాంటి రోడ్లు కావాలన్నా.. మీ ఊరు అభివృద్ధి చెందాలన్నా రోడ్ల విస్తరణ చేయాల్సిందే కదా?' అని అడగడంతో వారి వద్ద సమాధానం లేకపోయింది.

సామగ్రి తయార్ హై.. వాజపేయికి అణు రహస్యం

పీవీ హయాంలో పృథ్వి, అగ్ని క్షిపణి పరీక్షలు జరిగాయి. పృథ్వి క్షిపణితో ఇస్లామాబాద్ పై దాడి చేయగల శక్తి సమకూర్చుకుంటే.. అగ్ని క్షిపణితో చైనాపై కూడా దాడి చేయగల సామర్థ్యాన్ని సంపాదించుకున్నాం. 1995 డిసెంబర్‌లో అణు పరీక్షలకు కూడా పీవీ రంగం సిద్ధం చేశారు. ఆ విషయాన్ని అమెరికా పసిగట్టడంతో వాటిని తాత్కాలికంగా వాయిదా వేసి ఆ బాధ్యతను వాజపేయికి అప్పజెప్పారు. పీవీ మరణించిన తర్వాత వాజపేయి ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఈ విషయాన్ని చెప్పారు "అణు పరీక్షల నిజమైన ఘనత పీవీదే. ఆయనే అణు పరీక్షలకు సిద్ధం చేసి.. 'సామాగ్రి తయార్ హై' అని నాకు చెప్పారు.." అని గుర్తుచేసుకున్నారు.

ఐక్యరాజ్యసమితికి వాజపేయిని పంపి..

అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ ప్రతినిధులు కశ్మీర్ సమస్యను లేవనెత్తకుండా ఉండేందుకు ప్రధాన ప్రతిపక్షమైన భారతీయ జనతా పార్టీని ఉపయోగించుకోవడం పీవీ బుద్ధికుశలతకు నిదర్శనం. 1991లో ఆస్ట్రియాలో యూరోపియన్ పార్లమెంట్ నిర్వహించిన సదస్సుకు బీజేపీ లోక్‌సభా పక్ష నేత అడ్వాణీ, కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్‌ను పంపించారు పీవీ. ఆ తర్వాత 1994లో జెనీవాలో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ సదస్సుకు అటల్ బిహారీ వాజపేయిని ప్రతినిధిగా పంపారు. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, విదేశాంగ సహాయమంత్రి సల్మాన్ ఖుర్షీద్ భారత్ తరఫున ఆధునిక ముస్లింలుగా రంగంలోకి దిగారు.



బహుభాషా కోవిదుడు

పీవీ నరసింహారావు బహు భాషా కోవిదుడనే విషయం అందరికీ తెలుసు. ఆయనకు 17 భాషలు వచ్చు. తెలుగు, ఉర్దూ, తమిళం, కన్నడం, సంస్కృతం, ఒరియా, మరాఠీ, బెంగాలీ, గుజరాతీ, ఫ్రెంచ్, స్పానిష్, పర్షియన్, జర్మన్, అరబిక్, ఇంగ్లిష్ తదితర భాషలు చక్కగా మాట్లాడేవారు. సంభాషించడమేకాదు.. ఒక భాషలో పుస్తకాలను మరోభాషలోకి అనువదించే స్థాయి పాండిత్యం ఆయనది. మహారాష్ట్రలోని పుణెలో బీఎస్సీ చదివినప్పుడు మరాఠీ భాషను క్షుణ్ణంగా నేర్చుకున్న ఆయన.. అక్కడి ప్రముఖ రచయిత హరినారాయణ్ ఆప్టే నవలను 'అబలా జీవితము' పేరుతో తెలుగులోకి అనువదించారు. అలాగే విశ్వనాథవారి 'వేయిపడగలు'ను హిందీలోకి 'సహస్రఫణ్'గా అనువాదం చేశారు. వేరే దేశాల అధ్యక్షులు, ప్రధానులు వస్తే వీలైనంతవరకూ వారి భాషల్లోనే మాట్లాడేవారు. ఒకసారి స్పెయిన్‌కు చెందిన దౌత్యప్రతినిధులు బృందం మనదేశానికి వచ్చి ఇంగ్లిష్‌లో మాట్లాడబోతే.. 'ఎందుకు మీ భాషలోనే మనం మాట్లాడుకుందాం' అని చక్కగా సంభాషించడంతో నివ్వెరపోవడం వారి వంతు అయింది. అంతేనా.. 1980లో ఆయన హవానా పర్యటనకు వెళ్లినప్పుడు నాటి ప్రధాని ఇందిరాగాంధీ నుంచి ఆయనకు ఒక సందేశం వెళ్లింది. అక్కడున్న అలీన ఉద్యమ నాయకులతో మాట్లాడి.. వారి తదుపరి సమావేశాన్ని ఇరాక్‌లో కాకుండా భారత్‌లో పెట్టేలా ఒప్పించాలన్నది దాని సారాంశం. వెంటనే పీవీ అక్కడున్న క్యూబన్లతో స్పానిష్ భాషలో.. ఇరాన్‌వారితో పర్షియన్‌లో.. ఇరాక్, ఈజిప్టువారితో అరబిక్‌లో, ఆఫ్రికా దేశాల ప్రతినిధులతో ఫ్రెంచ్ భాషలో, పాకిస్థానీ ప్రతినిధులతో ఉర్దూలో మాట్లాడి ఒప్పించారు!

దేశానికే గర్వకారణం: సీఎం రేవంత్

» పీవీ సేవలకు సరైన గుర్తింపు: కిషన్‌రెడ్డి






హైదరాబాద్/న్యూఢిల్లీ/హుస్నాబాద్/అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశానికి ప్రధానిగా ఎనలేని సేవలందించిన తెలుగు బిడ్డ, తెలంగాణ బిడ్డ పాములపర్తి వెంకట (పీవీ) నరసింహారావుకు భారతరత్న పురస్కారం దక్కటం దేశ ప్రజలందరికీ గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆలస్యమైనా పీవీకి గౌరవం దక్కటం సంతోషంగా ఉందని చెప్పారు. అసెంబ్లీలో రేవంత్ మాట్లాడుతూ.. ప్రధానిగా అనేక ఆర్థిక సంస్కరణలు తెచ్చి ప్రపంచ దేశాలతో పోటీపడేలా దేశాన్ని తీర్చిదిద్దిన ఘనత పీవీకే దక్కిందన్నారు. సీఎంగా శాసనసభ తరఫున, తెలంగాణ ప్రజల తరఫున వారి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు సభలో ప్రకటించారు. ఇటు ఢిల్లీలో బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దూరదృష్టి గల నాయకుడిగా దేశానికి వివిధ హోదాల్లో పీవీ చేసిన సేవలకు సరైన గుర్తింపు లభించిందన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలకు గుర్తుగా భారతరత్న పురస్కారం లభించటం హర్షించదగిన విషయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా పీవీ నిలిచారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పీవీకి భారతరత్న దక్కడం గర్వించతగిన విషయమని తెలంగాణ శాసన మండలి తీర్మానం ఆమోదించింది. శుక్రవారం మండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తెలంగాణ ముద్దుబిడ్డ గొప్ప సంస్కరణలతో దేశాన్ని గాడిలో పెట్టారని ప్రశంసించారు.

బీఆర్ఎస్ డిమాండ్ మేరకు ప్రకటించినందుకు థ్యాంక్స్: కేసీఆర్



పీవీకి భారత రత్న.. తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అభివర్ణించారు. పీవీకి భారతరత్న ప్రకటించాలని బీఆర్ఎస్ చేసిన డిమాండ్‌ను గౌరవించి భారత రత్న ప్రకటించిన కేంద్రానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. పీవీకి భారత రత్న ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి ప్రతిపాదన పంపామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. పీవీకి స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సముచిత గౌరవాన్నిచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఏడాది పాటు పీవీ శత జయంతి ఉత్సవాలను చేపట్టామని గుర్తు చేశారు.

తెలుగువారికి గర్వకారణం: చంద్రబాబు



అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్‌కు 'భారతరత్న'ను కేంద్రం ప్రకటించడంపై టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. పీవీకి భారతరత్న ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా తెలుగుజాతికి గర్వకారణమన్నారు. 'పీవీ తెచ్చిన ఆర్థిక సంస్కరణలు భారత్‌ను ప్రపంచవేదికపై నిలబెట్టాయి. గొప్ప రాజనీతిజ్ఞుడైన పీవీ దేశం కోసం చూపిన దార్శనికత, స్ఫూర్తిని పొంది, ఆయనను కలిసే గొప్ప అదృష్టాన్ని పొందాను. రైతుల శ్రేయస్సు కోసం అవిశ్రాంతంగా పోరాడిన మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్, హరిత విప్లవ పితామహుడిగా కీర్తించబడే డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించడం సముచితం' అని శుక్రవారం చంద్రబాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు. పీవీ నరసింహారావుకు భారతరత్న దక్కడం తెలుగువారంతా గర్వపడాల్సిన సందర్భమని నారా లోకేశ్ పేర్కొన్నారు.

పీవీ సేవలకు సముచిత గౌరవం: పవన్ కల్యాణ్




దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికిన పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఆయన అందించిన సేవలు అనుపమానమైనవని అన్నారు. పీవీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం ప్రతి తెలుగువాడు సంతోషించదగ్గ అంశమన్నారు. రైతు బాంధవుడిగా పేరొందిన చౌధురి చరణ్‌సింగ్, హరిత విప్లవానికి ఆద్యుడైన ఎం.ఎస్.స్వామినాథన్‌ను భారతరత్నతో గౌరవించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ఆనందదాయకమన్నారు.

పీవీ స్టాంపు విడుదల ఎప్పుడు?

» 2020లోనే మాజీ ప్రధాని పేరిట ముద్రణ

» విక్రయాలకు మాత్రం అనుమతించని కేంద్రం



విజయవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్రం భారతరత్న ప్రకటించింది. ఇది తెలుగువాడికి దక్కిన అత్యున్నత గౌరవంగా భావిస్తున్నారు. పీవీకి భారతరత్న వస్తే నంద్యాలకు వచ్చినట్టేనని మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పీవీని కాంగ్రెస్ అవమానిస్తే భారతరత్న ఇచ్చి బీజేపీ గౌరవించిందని కమలం నేతలు ప్రకటనలు చేస్తున్నారు. ఇదే సమయంలో పీవీ పేరిట ముద్రించిన స్టాంపును మాత్రం కేంద్రం ఎందుకు విడుదల చేయలేదన్న ప్రశ్న తెరపైకి వస్తోంది. 2020లో పీవీ పేరుతో రూ.5 స్టాంపు ముద్రించారు. నాలుగేళ్లు కావస్తున్నా ఈ స్టాంపును కేంద్రం విడుదల చేయలేదు. వీటిని తపాలా కార్యాలయాలకు పంపినా విక్రయాలకు అనుమతించపోవడం చర్చనీయాంశంగా మారింది. పీవీ పేరుపై ముద్రించిన స్టాంపును ఇప్పటి వరకు ఎందుకు విడుదల చేయలేదని అంతర్జాతీయ ఫిలటెలిస్ట్(స్టాంపుల సేకరణ ప్రవృత్తిగా గలవారు) దేవ నరసింహారావు ప్రశ్నించారు.

మోదీతో పొత్తుతోనే జగన్‌కు క్లీన్‌చిట్

- ఏపీ కోరిన వెంటనే అప్పులకు కేంద్రం ఆమోదం
- ఇసుక, మద్యం వ్యాపారాల్లో బీజేపీకి వాటాలు
- షర్మిలను తిడుతున్నా జగన్ పట్టించుకోరేం?: కేవీపీ



అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీతో పొత్తు ఉన్నందునే సీఎం జగన్‌కు కేంద్రం క్లీన్‌చిట్ ఇస్తోందని రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు ఆరోపించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక, మద్యం వ్యాపారాల్లో బీజేపీకి వాటాలు అందుతున్నాయని... అందుకే జగన్, ఆయన మంత్రివర్గ సభ్యులపై సీబీఐ, ఈడీ కేసులు ఉండట్లేదన్నారు. పైగా ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని దాటేస్తున్నా రాష్ట్రానికి కేంద్రం ఎడాపెడా అప్పులకు ఆమోదం తెలుపుతోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో నగదు చెల్లింపులతో మద్యం విక్రయాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవట్లేదని నిలదీశారు. ఇసుక అమ్మకాలపై కూడా కేంద్రం స్పందించడం లేదన్నారు. ఆప్ అధినేత కేజ్రీవాల్‌తో సహా మోదీని వ్యతిరేకించిన వారందరిపైనా సీబీఐ, ఈడీ కేసులు పెడుతున్నారని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారం కోల్పోతే ఆమె జైలుకెళ్లడం ఖాయమని వ్యాఖ్యానించారు. సోదరి వైఎస్ షర్మిల, తల్లి విజయలక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, సోషల్ మీడియాలో దుర్భాషలాడుతున్నా జగన్ ఎందుకు పట్టించుకోవడం లేదని కేవీపీ ప్రశ్నించారు.

వైసీపీ ఫేక్ ప్రచారం

ఇండియా టుడే సర్వేతో మైండ్ బ్లాంక్

రిపబ్లిక్ టీవీ సర్వేలో వైసీపీకి 132 సీట్లంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

మరో టీవీ లోగో పెట్టిన పేటీఎం బ్యాచ్

దుష్ప్రచారం అలవాటేనంటూ నెటిజన్ల కామెంట్లు

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎన్నికల సర్వేలో నిబద్ధత కలిగిన ఇండియా టుడే రాష్ట్రంలో ఓట్ల షేరింగ్‌పై వెల్లడించిన సర్వే నివేదికతో వైసీపీ మైండ్ బ్లాంక్ అయింది. మొదట్నుంచి ఫేక్ ప్రచారాన్ని నమ్ముకున్న వైసీపీ వర్గాలు ప్రతిష్ఠాత్మకమైన ఈ సర్వే చూసి దాన్ని బుకాయించే ప్రయత్నాలు ప్రారంభించాయి. ఇండియా టుడే సర్వేను ప్రతి ఒక్కరు విశ్వసిస్తారనే ఉద్దేశంతో తమకు అనుకూలంగా తప్పుడు ప్రచారం చేసుకుంటున్నాయి. ఇండియా టుడే కంటే పాపులర్ టీవీ అయిన రిపబ్లిక్ టీవీ సర్వే చేపట్టిందని, ఆ సర్వేలో వైసీపీకి 132 సీట్లు వస్తాయంటూ వైసీపీ పేటీఎం బ్యాచ్ ఊదరగొడుతోంది. ఇండియా టుడే సర్వేలో టీడీపీకి 45 శాతం, టీడీపీ-జనసేన కలిస్తే 52 శాతం, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి 54 శాతం ఓట్లు వస్తాయని వెల్లడించిన సంగతి తెలిసిందే. టీడీపీ, దాని మిత్రపక్షాలకు ఏ అనుకూల అంశం ఉన్నా దానిపై దుష్ప్రచారం చేస్తూ, ప్రజల్లో అయోమయం సృష్టించేలా వైసీపీ పేటీఎం బ్యాచ్ పనిచేస్తోంది. టీడీపీకి అనుకూలంగా ఉన్న సర్వే నివేదికను చూసి జీర్ణించుకోలేకపోయిన పేటీఎం బ్యాచ్ దొంగ సర్వేలు రూపొందించింది. రిపబ్లిక్ టీవీ సర్వే అంటూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి 41 సీట్లలో, ఇతరులు 2 సీట్లలో, వైసీపీ 132 సీట్లు గెలుచుకుంటాయని ఒక పోస్టర్‌ను తయారు చేసింది. అయితే పేటీఎం బ్యాచ్‌కు అవగాహన లేకనేమో రిపబ్లిక్ టీవీ లోగోకు బదులుగా హైదరాబాద్ కేంద్రంగా రవి ప్రకాశ్ నిర్వహిస్తున్న ఆర్‌టీవీ లోగోను పెట్టి ప్రచారం చేసుకుంటున్నారు. ఇది చూసిన నెటిజన్లు ఇది ఫేక్ సర్వే అంటూ తమ అభిప్రాయాలను పోస్టు చేస్తున్నారు. వైసీపీ పేటీఎం బ్యాచ్‌కు ఇది అలవాటేనని, ఇలాంటి పోస్టులను రాష్ట్రంలో ఎవరూ నమ్మరని కామెంట్ చేస్తున్నారు. కాగా జగన్ రోత పత్రిక శుక్రవారం సీ-ఓటర్ నేతిబీర సర్వే అంటూ కొట్టి పడేసింది. 2019లోనూ ఇదే రీతిలో సర్వే చేశారని, లెక్కలు తప్పాయంటూ సమర్థించుకుంది.



రిపబ్లిక్ టీవీ సర్వే అంటూ ఆర్‌టీవీ లోగోతో సోషల్ మీడియాలో వైసీపీ పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారం

జగన్‌ను సాగనంపడానికి జనం సిద్ధం



- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ తుంగలో తొక్కారు
- మళ్లీ మోసం చేయడానికే 'సిద్ధం' అంటున్నారు
- అమ్మఒడి ఒక బిడ్డకేనా?
- మరో బిడ్డ చదవకూడదా? పుట్టకూడదా?
- తుని, చాగల్లు సభల్లో నిప్పులు చెరిగిన షర్మిల



తునిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

"దేనికి సిద్ధం? రూ.8లక్షల కోట్లు అప్పు చేయడానికి సిద్ధమా? బీజేపీతో అక్రమ పొత్తుకు సిద్ధమా? బీజేపీతో దోస్తీ చేసి ప్రజలను తాకట్టు పెట్టడానికి సిద్ధమా? మద్య నిషేధం అని ప్రజలను మోసం చేయడానికి సిద్ధమా? 25లక్షల ఇళ్లు కడతానని చెప్పి మోసం చేయడానికి సిద్ధమా? దేనికి సిద్ధం? ప్రజలను మరో సారి దగా చేయడానికి వైసీపీ సిద్ధమైతే, ఆ పార్టీని ఇంటికి పంపడానికి జనం కూడా సిద్ధంగా ఉన్నారు"

\- వైఎస్ షర్మిల

కాకినాడ, రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిన వైసీపీ ప్రభుత్వం మళ్లీ ఏం మోసం చేయడానికి సిద్ధం అంటోందని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.8లక్షల కోట్ల అప్పులు తెచ్చిన ప్రభుత్వం బటన్ నొక్కడానికి రూ.2.50లక్షల కోట్లు ఖర్చు చేసిందని, మిగిలిన రూ.5.50లక్షల కోట్లు ఏం చేసిందని నిలదీశారు. ఆ లక్షల కోట్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. కాకినాడ జిల్లా తుని బహిరంగ సభ, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చాగల్లు ఎస్సీ పేట రచ్చబండలో షర్మిల ప్రసంగించారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

అంతా మోసం..

"వైసీపీ పాలన అంతా మోసం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చింది. ఇన్ని అప్పులు చేసినా రాష్ట్ర ప్రజలు కనీసం బాగుపడలేదు. తెచ్చిన అప్పులతో రాజధాని కట్టలేదు. పోలవరం పూర్తి చేయలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ దగ్గర నుంచి మెట్రో, రహదారుల నిర్మాణం దాకా ఏదీ సక్రమంగా చేయలేదు. కనీసం జీతాలకు కూడా డబ్బులు లేవు. మరి తెచ్చిన అప్పులు ఏం చేశారు?"

ప్రజల్లో నాన్న.. ప్యాలెస్ దాటని జగనన్న

"మా తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మనిషి. నిత్యం ప్రజల్లో ఉండేవారు. చనిపోయేటప్పుడు కూడా రచ్చబండ పేరుతో ప్రజల్లోకి వెళ్తూనే చనిపోయారు. కానీ జగన్ ఐదేళ్లుగా ప్యాలెస్‌కే పరిమితమయ్యారు. ఏ రోజూ ప్రజల మధ్యకు రాకుండా ఇప్పుడు సిద్ధం అంటున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదు. పదేళ్ల కిందట రాష్ట్రం ఎక్కడ ఉందో ఇప్పుడు కూడా అక్కడే ఉంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ప్రత్యేక హోదా కోసం ఉద్యమాలు, నిరాహార దీక్షలు చేశారు. ఎంపీలతో మూకుమ్మడి రాజీనామాలు చేయించారు. తీరా ముఖ్యమంత్రి అయిన తర్వాత హోదా కోసం ఒక్క నిజమైన ఉద్యమం చేయలేదు. కేంద్రంతో పోట్లాడి పోలవరం సాధించారా అంటే అదీ లేదు. రాజధాని ఎక్కడుంది? ఒకటి కాదు.. మూడు రాజధానులు అని చెప్పిన జగన్ ఒకటైనా కట్టారా? విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తే ఏనాడు జగన్ ప్రశ్నించలేదు. కానీ అసెంబ్లీలో మాత్రం వైసీపీ ప్రభుత్వం నిస్సిగ్గుగా అబద్ధాలు చెప్పింది. కేంద్రం నుంచి రూ.30వేల కోట్ల గ్రాంట్లు వచ్చాయని చెప్పి అన్నీ సాధించేశామని, కొట్లాడడానికి ఇంకేమీ లేదన్నారు. సభలో ప్రతిపక్షం ఉన్నా... అది బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు.

వారిద్దరూ పట్టుబట్టలు కడితే చాలా..

"కేంద్రంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలను ఆడిస్తోంది. జగన్ ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దల ఎదుట సాష్టాంగపడ్డారు. ఎందుకీ బానిస బతుకులు? అధికారంలోకి రాక ముందు ఏటా జనవరి 1న జాబ్‌క్యాలెండర్ అని జగన్ ప్రకటించారు. ఎన్నో జనవరి ఫస్ట్‌లు వెళ్లిపోయాయి. సంక్రాంతికి జగన్, ఆయన భార్య పట్టుబట్టలు కట్టుకుంటున్నారు. కానీ నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ లేదు...మెగా డీఎస్సీ లేదు"

'అనుభవించు రాజా'

"ఎన్నికల ముందు తుని వచ్చిన జగన్ దివీస్ ఫార్మాను బంగాళాఖాతంలో కలుపుతామని చెప్పారు. సీఎం అయ్యాక ఆ పరిశ్రమకు సహకరిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ మంత్రి రాజా నియోజకవర్గం తునిలో రోడ్లు గోతులుగా మారాయి. ఆయన పేరు దాడిశెట్టి రాజా కాదు...అనుభవించు రాజా".

గారడీ చేస్తున్నారు..

"అమ్మఒడి ఒక్క బిడ్డకేనా? మరో బిడ్డ చదవకూడదా? పుట్టకూడదా? పాదయాత్రలో జగనన్న ఏమి చెప్పాడు? ఎంత మంది పిల్లలుంటే అందరికీ అమ్మఒడి వేస్తానని హామీ ఇచ్చాడుకదా? మాట తప్పను. మడమ తిప్పను అంటే ఇదేనా? ప్రభుత్వం గారడీ చేస్తోంది. ఇక్కడ (చాగల్లులో) ఓ అన్న నాకో లిస్ట్ ఇచ్చాడు. 60 మందిపై అధికారికంగా జరిగిన దాడుల వివరాలవి. హోంమంత్రి దళితురాలు. ఇక్కడే హోంమంత్రిగా ఉండి, ఇక్కడి దళితులనే కాపాడుకోకపోతే ఇక వీళ్లకు పదవులు ఎందుకు? రాజీనామా చేయండి."

తొలి సంతకం హోదా ఫైలుపైనే..

"పిల్లలంటే రాజశేఖరరెడ్డికి ఎంతో మమకారం ఉండేది. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంటే ఆయనకు ఎంతో ప్రియమైన పథకం. దాని ద్వారా ఎంతోమంది బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే చదివించింది. ఇప్పుడా పరిస్థితిలేదు. ఉద్యోగాలూ లేవు. ఆ రోజు చంద్రబాబు 7వేల ఉద్యోగాలతో డీఎస్సీ వేస్తే, ఆయనకు సిగ్గులేదా అని జగన్ తిట్టారు. తాను సీఎం అయితే 25వేల పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ వేస్తానని అన్నారు. ఆయన చెప్పిన మెగా డీఎస్సీ ఏమైంది? మా నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని అయిన వెంటనే ప్రత్యేక హోదా ఫైలు మీదే సంతకం పెడతానని చెప్పారు. ఈ సమావేశంలో పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఎన్.రఘువీరారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మోదీ.. ముక్తసరిగా!

రాజకీయాలు మాట్లాడేందుకు జగన్‌కు అవకాశమివ్వని ప్రధాని

- గంటకుపైగా నిరీక్షణ తర్వాత 15 నిమిషాలు భేటీ
- నిర్మలా సీతారామన్‌తోనూ అంతే
- రాత్రి నుంచి అడుగుతున్నా అపాయింట్‌మెంట్ ఇవ్వని అమిత్ షా
- నిరాశతో వెనుదిరిగిన ముఖ్యమంత్రి
- పార్లమెంటు ప్రాంగణంలో 4 గంటలున్నా పట్టించుకోని వైసీపీ ఎంపీలు
- దుబాయ్ వెళ్లిపోయిన వేమిరెడ్డి



ఢిల్లీలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చిస్తున్న సీఎం జగన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. అయితే ఆయనతో ప్రధాని ముక్తసరిగా సంభాషించారని.. ఆయన చెప్పింది విని మౌనంగా ఉండిపోయారని, ఎలాంటి స్పందనా తెలియజేయలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఉదయం 11.30 గంటలకు పార్లమెంటు ప్రాంగణంలోని ప్రధాని చాంబర్‌కు జగన్ వచ్చారు. మోదీ బంగ్లాదేశ్ ప్రతినిధి వర్గంతో చర్చల్లో ఉండడంతో గంటకు పైగా వేచి ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా ప్రధానితో జగన్ కేవలం 15 నిమిషాలే భేటీ అయ్యారు. అయితే రాజకీయాలు ప్రస్తావించడానికి మోదీ పెద్దగా అవకాశమివ్వలేదని, రాష్ట్రం గురించే కొన్ని ప్రశ్నలు వేశారని తెలిసింది. అనంతరం బయటకు వచ్చిన జగన్.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీకి కూడా అరగంటకు పైగా నిరీక్షించాల్సి వచ్చింది. ఆమెతోనూ పావుగంట సమావేశమయ్యారు. ఇక ప్రధానితో భేటీ తర్వాత బయటకు రాగానే జగన్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా అపాయింట్‌మెంట్ గురించి ఆరా తీశారు. ఈ రోజు సమయం ఇచ్చే అవకాశాలు లేవని తెలియడంతో నిరాశతో బయటకు వచ్చారు. కాగా.. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి గెలుస్తుందన్న వార్తల నేపథ్యంలో.. ఓడిపోతే తనకు రాజకీయ భవిష్యత్ ఉండదని.. 2019లో మాదిరిగానే ఈ సారి కూడా తనను ఆదుకోవాలని మోదీని ఆయన అభ్యర్థించారని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో తాను కాంగ్రెస్‌వైపు చూడడం లేదని వివరణ ఇచ్చినట్లు తెలిసింది.

అమిత్ షాను కలుసుకోలేని జగన్

గురువారం సాయంత్రం ఢిల్లీలో అడుగుపెట్టినప్పటి నుంచి అమిత్ షాను కలుసుకోవడానికి జగన్ ఎంతగానో ప్రయత్నించారు. కానీ ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. శుక్రవారం కూడా ఆయన నుంచి జగన్‌కు పిలుపు రాలేదు. ప్రధాని గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే అమిత్ షా పిలుస్తారని.. రాజకీయ చర్చలకు మోదీ అవకాశం ఇవ్వనందువల్లే హోం మంత్రి కూడా అపాయింట్ మెంట్ ఇవ్వలేదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. కాగా పార్లమెంటు ప్రాంగణంలో జగన్ దాదాపు నాలుగు గంటలు ఉన్నప్పటికీ ఆయన్ను ఇతర పార్టీల నేతలు పెద్దగా పలుకరించలేదు. వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి తదితరులు ఆయనతోనే ఉన్నా ఇతర వైసీపీ ఎంపీలు మాత్రం ఆయన్ను కలిసి మాట్లాడేందుకు ఆసక్తి చూపలేదు. కొందరు ఎంపీలు చుట్టుపక్కల తచ్చాడుతూ ముఖం చూపించి వెళ్లిపోయారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జగన్ పర్యటనను పట్టించుకోలేదు. వేమిరెడ్డి ఉదయమే దుబాయ్ వెళ్లిపోయినట్లు సమాచారం. ఇక సీఎం చాలా అసంతృప్తిగా కనిపించారని, భోజనం చేస్తున్నప్పుడు కూడా అన్యమనస్కంగా ఉన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇక మనకు ఢిల్లీతో పనేముందని ఆయన ఒక ఎంపీతో అన్నట్లు సమాచారం. ఇంకోవైపు.. జగన్ పర్యటన వివరాలపై రాత్రి 8.30 ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. పోలవరం ప్రాజెక్టు తొలి విడత పూర్తి చేసేందుకు నిధులు, తెలంగాణ నుంచి విద్యుత్ బకాయిలు, జిల్లాకో మెడికల్ కాలేజీ, విశాఖతో భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానం, విభజన చట్టంలో పేర్కొన్న పారిశ్రామిక కారిడార్, రైల్వే లైన్లు, మెట్రో ప్రాజెక్టు గురించి గతంలో ఇచ్చిన వినతిపత్రాన్ని మళ్లీ విడుదల చేశారు. ప్రత్యేక హోదా అంశాన్ని మొక్కుబడిగా ఇందులో చేర్చారు.

సాయిరెడ్డి చెబుతారు!

పీవీకి భారత రత్నపై సీఎం 'స్పందన'

విస్తుపోయిన ఢిల్లీ మీడియా ప్రతినిధులు!

'తెలుగు వారైన పీవీ నరసింహరావుకు భారత రత్న ప్రకటించడంపై మీ స్పందనేవిటి?' అని ప్రశ్నిస్తే.. 'సాటి తెలుగు వాడిగా నేను ఎంతో ఆనందిస్తున్నాను' అని చెప్పొచ్చు. అసలు ఏమీ చెప్పడం ఇష్టం లేకుంటే మౌనంగా వెళ్లిపోవచ్చు. కానీ... ముఖ్యమంత్రి జగన్ రూటే వేరు! పీవీకి భారత రత్నపై స్పందించాలని ఢిల్లీలో జాతీయ మీడి యా ప్రతినిధులు కోరగా.. 'సాయి రెడ్డి చెబుతారు' అంటూ కారు ఎక్కేశారు. ఇది విని విలేకరులు విస్తుపోయారు. 'నెక్స్ట్ సీఎం సాయి రెడ్డి కాబోలు' అంటూ జోకులు కూడా వేసుకున్నారు. ముఖ్యమంత్రిగా జగన్ ఒకేఒక్కసారి... అదీ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఆ తర్వాత దూరం దూరమే! శుక్రవారం పార్లమెంటు భవనం నుంచి వస్తున్న ఆయనతో మాట్లాడించేందుకు విలేకరులు శతవిధాలా ప్రయత్నించి విఫలమయ్యారు. పొత్తులు, పాలన ఇతర అంశాలపై ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పాల్సి వస్తుందని కాబోలు... తనదైన శైలిలో నవ్వుతూ, నమస్కారాలు పెడుతూ జగన్ ముందుకు వెళ్లారు. చివరికి... పీవీకి భారత రత్న గురించి అడగ్గా, 'సాయి రెడ్డి చెబుతారు' అంటూ కారెక్కి, నేరుగా విమానాశ్రయానికి వెళ్లిపోయారు. లాంజ్‌లోనే భోజనం చేసి విజయవాడకు తిరుగుపయనమయ్యారు.

మళ్లీ తేదీయే మారింది!

- అవే అంశాలతో ప్రధానికి పదేపదే అదే వినతిపత్రం!!
- హోదా, పోలవరం, రైల్వే జోన్, విభజన హామీలపై పట్టుబట్టని జగన్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రధాని మోదీని ఢిల్లీలో కలిసినప్పుడల్లా.. రాష్ట్రానికి సంబంధించి ప్రధాన డిమాండ్లతో వినతిపత్రం సమర్పించామని జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకోవడం పరిపాటిగా మారింది. ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, విభజన హామీల అమలు గురించి చర్చల సందర్భంగా ప్రధానిని ఆయన అడుగుతున్నారో ఎవరికీ తెలియదు. కానీ ఆయనకు ఈ డిమాండ్లతో వినతి పత్రం అందజేసినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతూ వస్తున్నాయి. శుక్రవారం కూడా అదే జరిగింది. వినతిపత్రంలో తేదీ మాత్రమే మారింది. యథాప్రకారం పోలవరం, ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం ఓడరేవు.. రామాయపట్నం ఓడరేవు.. విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కువ ప్రైవేటీకరణ నిలుపుదల, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ వంటి అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుకు కాంపోనెంట్ వారిగా సీలింగ్‌ను ఎత్తివేయడానికి కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించిందని.. సత్వరమే రూ.12,911 కోట్ల విడుదలకూ సరే అందని అందులో విన్నవించారు. ఈ మొత్తానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణకు అందించిన విద్యుత్‌కు బకాయిల కింద రూ.7,230 కోట్లు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక హోదా కూడా అందులో కోరారు. కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నామని.. వీటికి సహాయ సహకారాలు అందించాలన్నారు.విశాఖ నగరాన్ని భోగాపురం ఇంటర్నేషల్ ఎయిర్‌పోర్టుతో అనుసంధానించేలా భీమిలి, రుషికొండ, విశాఖ పోర్టులను కలిపి 55 కిలోమీటర్ల మేర ఆరు లేన్ల రహదారికి సహకరించాలని అభ్యర్థించారు. విశాఖ- కర్నూలు హైస్పీడ్ కారిడార్‌ను కడప మీదుగా బెంగుళూరు వరకూ పొడిగించాలని.. కడప- పులివెందుల -ముదిగుబ్బ-సత్యసాయి ప్రశాంతి నిలయం-హిందూపురం కొత్త రైల్వే లైన్, విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు వీలైనంత త్వరగా ఆమోదం తెలపాలని ప్రధానిని జగన్ కోరారని అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఇచ్చిన వినతిపత్రంపై ప్రధాని కార్యాలయం ఎంత వరకూ చర్యలు తీసుకుందో తెలుసుకునే వ్యవస్థను సీఎం ఏర్పాటుచేయలేదు. సంబంధిత శాఖల ముఖ్యకార్యదర్శులు తరచూ పీఎంవోతో సంప్రదింపులు జరిపి..సానుకూల ఫలితంవచ్చేలా చేయడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారని అధికారవర్గాల్లోనూ చర్చ సాగుతోంది.

తొలి ఏడాది 50 శాతం జీతమే

- డీఎస్సీ-2024 టీచర్లకు రెండేళ్లు అప్రెంటీస్
- పోస్టుల వివరాలతో ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో భర్తీ అయ్యే టీచర్లకు రెండేళ్ల పాటు అప్రెంటీస్ ఉంటుందని ప్రభుత్వం స్పష్టంచేసింది. అప్రెంటీస్ కాలంలో బేసిక్ జీతంలో మొదటి ఏడాది 50 శాతం, రెండో ఏడాది 60 శాతం పారితోషికంగా వారికి అందుతుందని పేర్కొంది. పాఠశాల విద్యాశాఖ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ మేరకు తెలిపింది. కొత్త నోటిఫికేషన్‌లో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 2 వేలు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 2,060 భర్తీ చేయనున్నట్టు తెలిపింది. ఇక ఏపీ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ 15, మోడల్ స్కూల్ పీజీటీ 23, మోడల్ స్కూల్ టీజీటీ 248, ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ 4, ఏపీఆర్ఎస్ టీజీటీ 118, సాంఘిక సంక్షేమ శాఖలో టీజీటీ 386.. ఇలా పలు పోస్టులు పొందుపరిచారు. మొత్తం 6,100 పోస్టులకు ఈ నెల 12న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

విద్యాశాఖలోకి మున్సిపల్ టీచర్లు

- సర్వీసు రూల్స్ విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ టీచర్లను పాఠశాల విద్యా శాఖ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ వీరు మున్సిపల్ శాఖ పరిధిలో ఉన్నారు. విశాఖపట్నం గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టీచర్లకు ప్రస్తుతం ఉన్నట్టుగానే వేర్వేరుగా సర్వీసు రూల్స్ రూపొందించి నాలుగు జీవోలు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా మున్సిపల్ టీచర్లకు ఉమ్మడి సర్వీసు రూల్స్ రూపొందించాలనే డిమాండ్ ఉండగా, గతేడాది ప్రభుత్వం జీవో 84 ద్వారా అందరికీ కలిపి ఒకే సర్వీసు రూల్స్ చేసే ప్రయత్నం చేసింది. దీనిపై అనేక అభ్యంతరాలు వ్యక్తం కావడంతో మళ్లీ ప్రస్తుత పద్ధతిలోనే గ్రేటర్ కార్పొరేషన్లు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఎవరికి వారుగా బదిలీలు చేసుకునేలా తాజా రూల్స్ తయారుచేసింది. మున్సిపల్ కార్పొరేషన్లలో అపాయింట్ అథారిటీని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నుంచి డీఈవోకు బదిలీ చేసింది. విజయవాడలోని మున్సిపల్ పాఠశాలలకు అపాయింటింగ్ అథారిటీని కార్పొరేషన్ స్థానంలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీగా మార్చింది. బదిలీలు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే జరుగుతాయని తెలిపింది. అయితే మున్సిపల్ టీచర్లు...సర్కారు చర్యను వ్యతిరేకిస్తున్నారు. క్రమంగా పాఠశాల విద్యాశాఖ టీచర్లతో సమానంగా మార్చే అవకాశం ఉంటుందని, దానివల్ల పట్టణ ప్రాంతాల్లో ఉండే తాము గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మాజీ మంత్రి నారాయణపై పోలీసు గురి!



నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



- నెల్లూరు క్యాంపు కార్యాలయంపై దాడులు

నెల్లూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణను జగన్ సర్కారు మరోసారి టార్గెట్‌చేసింది. మెడికల్ కాలేజీలో నాసిరకం మందులు కొనుగోలు చేశారన్న ఆరోపణలపై డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం సాయంత్రం నెల్లూరు శివార్లలో నారాయణ మెడికల్ కాలేజీ ఆవరణలోని నారాయణ క్యాంపు ఆఫీసు (నివాసం)పై దాడి చేశారు. సుమారు 5 గంటలపాటు సోదాలు నిర్వహించారు. ఆయన సతీమణి రమాదేవిని గృహనిర్బంధం చేశారు. ఐదు గంటల సోదాల అనంతరం అనుమానించదగిన ఫైళ్లు, డబ్బులు ఏవీ లభ్యం కాకపోవడంతో రాత్రి ఎనిమిది గంటలకు వెనుతిరిగారు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో క్యాంపు కార్యాలయంలోకి జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారులు, ఆరుగురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, స్థానిక వీఆర్వో, వీఏవో, ఇతర రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు.. ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 11 మంది ఎస్ఐల ఆధ్వర్యంలో 70 మందికి పైగా పోలీసులు ప్రవేశించారు. మెడికల్ కాలేజీ నాసిరకం డ్రగ్స్ కొనుగోలు చేస్తోందనే అభియోగాలపై ఈ దా డులు చేశారు. క్యాంపు కార్యాలయ ప్రాంగణాన్ని పోలీసు బలగాలతో దిగ్బంధం చేశారు. లోనికి చొరబడిన వారు ఎవరో, ఎందుకు వచ్చారో, ఏం వెతుకుతున్నారో అర్థం కాక కార్యాలయ సిబ్బంది హడలిపోయారు. నారాయణ సతీమణి రమాదేవిని హౌస్ అరెస్టు చేసి.. మొబైల్ స్వాధీనం చేసుకున్నారు. అధికారులు చాలా దురుసుగా ప్రవర్తించారని, బీరువాలు పగలగొట్టారని, మంచాలు విరిచేశారని కార్యాలయ సిబ్బంది చెప్పారు. మందుల నాణ్యత, కొనుగోళ్ల పరిశీలనకు.. ఇంత హంగామా చేయాల్సిన అవసరం ఏమిటని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. ఎన్నికల వేళ నారాయణను భయపెట్టేందుకే ఇదంతా అని విమర్శిస్తున్నారు. నారాయణను ఏదో రూపంగా ఇరికించాలనే కుట్రలో భాగంగానే ఈ దాడులు జరిగాయని టీడీపీ నాయకులు అంటున్నారు.

ధైర్యంగా ఎదుర్కొనలేకనే!

నారాయణను ధైర్యంగా ఎదుర్కోలేకనే ఆయన సంస్థల్లో దొంగ సోదాలు చేశారని నారాయణ విద్యాసంస్థల ఎండీ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి విమర్శించారు. అనుమతి లేని ఫార్మసీ మందులు వాడుతున్నారన్న నెపంతో తనిఖీలకు వచ్చారని, డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్లు టి.వెంకటకృష్ణ, వాకాటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తనిఖీలు చేశారని.. తమ సంస్థలకు చెడ్డపేరు తేవాలన్న ఉద్దేశంతోనే ఇలా చేశారని దుయ్యబట్టారు. సోదాలు చేసేందుకు వచ్చినవారు నారాయణ హాస్పిటల్లో పరిశీలించకుండా ఆయన నివాసంలో తనిఖీలు చేయడమేంటని మండిపడ్డారు. అయితే ఇలా సోదాలు చేయడం ఇదే మొదటిసారి కాదని ఓ ప్రకటనలో తెలిపారు.

కక్ష సాధింపులు మళ్లీ మొదలు!

ఎన్నికల వేళ టీడీపీ నేతల మెడపై దాడుల కత్తి.. నారాయణ సంస్థల్లో తాజాగా సోదాలు

- వైసీపీ తరపున పోటీచేయడానికి నిరాకరించినందుకే?

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రధాన ప్రతిపక్షం టీడీపీ నేతలపై మళ్లీ కక్ష సాధింపు చర్యలు మొదలయ్యాయి. తమ మాట వినని.. వైసీపీలో చేరడానికి అంగీకరించని నేతలను టార్గెట్ చేసుకుని ప్రభుత్వ పెద్దలు అధికారులతో దాడులు చేయిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ మంత్రి, నారాయణ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు పొంగూరు నారాయణ సంస్థలపై శుక్రవారం నెల్లూరులో జరిగిన దాడులు ఈ కోవలోవేనని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలతోపాటు ఆయన ఇల్లు, కార్యాలయంపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించి సోదాలు జరిపారు. ఈ దాడులకు ముందు తెర వెనుక ఒక సంఘటన జరిగింది. కొద్ది రోజుల క్రితం తాడేపల్లి ప్యాలెస్ నుంచి నారాయణకు ఫోన్ వెళ్లింది. నెల్లూరులో ఆయన వైసీపీ తరపున పోటీ చేస్తే బాగుంటుందని, ఆయన వైసీపీలోకి వస్తే వ్యాపారపరంగా.. విద్యా సంస్థలపరంగా అన్ని విధాలా సహకరిస్తామని ఫోన్ చేసిన వారు చెప్పారు. కానీ నారాయణ తిరస్కరించారు. తనకు అటువంటి ఆలోచన లేదని, వైసీపీలోకి రాలేనని ఆయన సున్నితంగా తేల్చేశారు. వాస్తవానికి జగన్ ప్రభుత్వం వచ్చాక నారాయణ మీద పలు కేసులు పెట్టింది. రాజధాని అమరావతికి భూ సేకరణ నుంచి ఇన్నర్ రింగ్‌రోడ్డు, ప్రశ్నపత్రాల లీకేజీ ఇలా ఎన్నో కేసులు నమోదు చేసింది. ఏ కేసులోనూ ఆయన్ను దోషిగా నిరూపించలేకపోయారు. ఇన్ని చేసి కూడా ఆయన్ను వైసీపీలోకి తీసుకెళ్లాలని ప్రయత్నించడం టీడీపీ వర్గాలను విస్మయపరుస్తోంది. తాడేపల్లి ఆఫర్‌ను తిరస్కరించగానే శుక్రవారం ఆయన సంస్థలపై దాడులు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని డ్రగ్ కంట్రోల్ అథారిటీ ఈ సోదాలు చేసింది. ఈ అథారిటీకి ప్రస్తుతం ఐజీ కొల్లి రఘురామిరెడ్డి ఆధ్వర్యం వహిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు సంబంధించిన కేసులను విచారించిన సిట్‌కు ఆయన ఇన్‌చార్జిగా ఉన్న సంగతి తెలిసిందే. ఆయన పనిగట్టుకుని అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని గతంలో అనేకసార్లు టీడీపీ నేతలు ఆరోపించారు. నారాయణకు ముందు.. కొద్ది రోజుల క్రితం బాపట్ల జిల్లాలో పరుచూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సంబంధించిన గనుల క్వారీలు, ఆయన అనుచరులైన టీడీపీ నేతల క్వారీలపై గనుల శాఖ అధికారులు దాడులు చేశారు. తన నియోజకవర్గంలో వైసీపీ నేతలు, సిబ్బంది కుమ్మక్కై దొంగ ఓట్లను భారీగా చేర్పించడంపై సాంబశివరావు పెద్ద పోరాటం చేశారు. దీని ఫలితంగా కొందరు అధికారులు సస్పెండ్ కూడా అయ్యారు. దీనికి ప్రతీకారంగానే ఆయన క్వారీలపై దాడులు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. అదీగాక గనుల శాఖ అధికారులు తమతోపాటు వైసీపీ నేతలను వెంటబెట్టుకుని దాడులకు వెళ్లడం.. వాహనాల్లో ఫ్యాక్షనిస్టుల మాదిరిగా కర్రలు, కత్తులు, కారం పొట్లాలు ఉండడం పెద్ద వివాదంగా మారింది. టీడీపీలో క్రియాశీలంగా ఉన్నవారిని ఎంచుకుని ఎన్నికల వేళ జగన్ అండ్ కో ఇటువంటి అరాచకాలకు పాల్పడుతోందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మరికొందరు నేతలపైనా ఇటువంటి దాడులు జరిగే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 10 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com

ఏదో ఏదో మాయ

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ఈ చిత్రంలో ఆయన పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. ఏ హర్ష దర్శకత్వంలో కేకే రాధామోహన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. శుక్రవారం 'ఏదో ఏదో మాయ' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేసింది. రవి బస్రూర్ స్వరపరిచిన ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: స్వామి జె గౌడ. ఎడిటర్: తమ్మిరాజు





పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా చిరంజీవిని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సత్కరించారు. చిరంజీవి, సురేఖ దంపతులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చిరంజీవికి ప్రతిష్మాత్మకమైన పద్మవిభూషణ్ పురస్కారం ప్రకటించడం పట్ల సౌందరరాజన్ హర్షం వ్యక్తం చేశారు. కోట్లాది ప్రేక్షక హృదయాలను గెలుచుకున్నారని ఆమె చిరంజీవిని అభినందించారు.



కాంబినేషన్ కుదిరింది



విభిన్న కథలు, సరికొత్త గెటప్పులతో ప్రేక్షకులను మెప్పించడం తమిళ హీరో విక్రమ్ పంథా. ఆయన కథానాయకుడిగా ఎస్ యూ అరుణ్ కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. 'చియాన్ 62' వర్కింగ్ టైటిల్. ఇందులో విక్రమ్ ఎలాంటి పాత్ర చేయబోతున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్. తాజాగా చిత్రబృందం స్పెషల్ అప్‌డేట్‌ను వదిలింది. మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మరో స్టార్ యాక్టర్ ఎస్ జే సూర్య భాగమవుతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. ఈ చిత్రంలో సూర్య మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో కనిపిస్తారని యూనిట్ తెలిపింది. రియా శిబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

కమల్ ఆదాయం ఎంతో తెలుసా?



తమిళ చిత్రరంగంలో ప్రస్తుతం అత్యధిక ఆదాయం సంపాదిస్తున్న హీరో ఎవరో ఊహించండి. రజనీకాంత్.. విజయ్, అజిత్, ధనుష్, సూర్య...? వీళ్లెవరూ కాదు.. కమల్ హాసన్. ఆశ్చర్యంగా ఉంది కదూ. అవును తమిళ చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం అత్యధిక ఆదాయం పొందుతున్న హీరో ఆయనే!. పారితోషికం పరంగా కానీ, సినిమాల లాభాల్లో వాటా పరంగా కానీ తన సొంత చిత్ర నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఇంటర్నేషనల్ నిర్మించే చిత్రాల ఆదాయం వల్ల కానీ కమల్ మిగిలిన హీరోల కంటే ఓ మెట్టు పైనే ఉన్నారు. ఆయన వార్షిక ఆదాయం రూ. 570 కోట్లు. ఒక సినిమాలో నటించడానికి ప్రస్తుతం కమల్ తీసుకుంటున్న పారితోషికం రూ. వంద కోట్లు. అలాగే రూ 450 కోట్ల ఆదాయంతో కమల్ మిత్రుడు రజనీకాంత్ రెండో స్థానంలో ఉన్నారు.. మూడో స్థానంలో రూ. 410 కోట్ల ఆదాయంతో హీరో విజయ్ ఉన్నారు. ఇక అజిత్ రూ. 350 కోట్లు, సూర్య రూ 300 కోట్లు, ధనుష్ రూ 160 కోట్లు, కార్తి రూ 110 కోట్లు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. ఇటీవల ఓ ఆంగ్ల మీడియాలో వచ్చిన ఈ అంకెల వివరాలు ఇప్పుడు జనంలో చర్చనీయాంశం అయ్యాయి.

నేనూ ప్రేమలో పడ్డా



సుబ్బు, శ్రీవల్లి, కిట్టయ్య ప్రధాన పాత్రలు పోషించిన 'ఏ హేట్ లవ్' చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. 'నేనూ ప్రేమలో పడ్డా' అనేది ఉప శీర్షిక. వెంకటేశ్ రవి దర్శకత్వంలో డాక్టర్ బాల రవి ఈ సినిమాను నిర్మించారు. చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు వీరశంకర్ ఆవిష్కరించారు. సినిమా కో ప్రొడ్యూసర్ పాలగుమ్మి వెంకట కృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మంచి చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అలాగే మా సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. దర్శకుడు వెంకటేశ్ మాట్లాడుతూ 'కోనసీమ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. యూత్‌ను ఆకట్టుకొనే సందేశాత్మక చిత్రం ఇది' అని చెప్పారు. ఈ చిత్రానికి అంగర శివ సాయి గౌడ ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

డే వన్ పోరాటం



2018లో వచ్చిన హాలీవుడ్ హారర్ థ్రిల్లర్ 'ఏ క్వైట్ ప్లేస్' ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. ఏ మాత్రం అలికిడి అయినా మనుషులను గుర్తుపట్టి నంజుకుతినే విచిత్ర జీవులతో ఓ కుటుంబం జరిపిన పోరాటం ప్రేక్షకులను థ్రిల్ చేసింది. ఆ తర్వాత అదే ఫ్రాంచైజీలో వచ్చిన పార్ట్ 2 కూడా సక్సెస్ అయింది. ఈ ఫ్రాంచైజీలో మూడో పార్ట్ 'ఏ క్వైట్ ప్లేస్: డే వన్' చిత్రం జూన్ 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిర్మాణ సంస్థ పారామౌంట్ పిక్చర్స్ ట్రైలర్‌ను గురువారం విడుదల చేసింది. మానవాళిని అంతమొందించే విచిత్ర గ్రహాంతర జీవులు భూమిమీదకు ఎలా వచ్చాయి, తొలి రోజు అవి ఎలాంటి విధ్వంసం సృష్టించాయి అనేది ట్రైలర్‌లో ఆసక్తికరంగా అనిపించింది. గ్రాఫిక్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రానికి మైఖేల్ సర్నోస్కీ దర్శకత్వం వహించారు. జిమోన్ హౌన్సో, అలెక్స్ వోల్ఫ్ కీలకపాత్రలు పోషించారు.

హాలీవుడ్ స్థాయి యాక్షన్‌తో

విద్యుత్ జమ్వాల్ కథానాయకుడిగా నటిస్తూ, నిర్మించిన స్పోర్ట్స్ యాక్షన్ చిత్రం 'క్రాక్. నోరా ఫతేహీ కథానాయిక. అర్జున్ రామ్‌పాల్ ప్రతినాయక పాత్ర పోషించారు. ఆదిత్య దత్ దర్శకుడు. ఈ నెల 23న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం చిత్ర బృందం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో 'క్రాక్' ట్రైలర్‌ను విడుదల చేసింది. భారతీయ ప్రేక్షకులకు హాలీవుడ్ స్థాయి యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ సినిమా ద్వారా చూపించబోతున్నాం, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది అని విద్యుత్ జమ్వాల్ తెలిపారు. చాలా ప్రమాదకరమైన ప్రదేశాల్లో జమ్వాల్ ఎలాంటి జంకు లేకుండా స్టంట్స్ చేశారని దర్శకుడు తెలిపారు.



షో టైమ్ ఖరారు

బంధుప్రీతి బాలీవుడ్ చిత్ర పరిశ్రమను ఎలా ప్రభావితం చేస్తుందనే అంశం చుట్టూ, వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న హిందీ సిరీస్ 'షో టైమ్'. ఇమ్రాన్‌హష్మీ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మౌనీరాయ్, మహిమా మక్వానా, శ్రియా శరణ్, నసీరుద్దీన్ షా ప్రధాన పాత్రధారులు. మిహిర్ దేశాయ్, అర్చిత్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్ నిర్మాత. శుక్రవారం ఆయన ఈ సిరీస్ స్ట్రీమింగ్ డేట్‌ను సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. మార్చి 8నుంచి ఈ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఈ సందర్భంగా ఆయన చిత్రీకరణకు సంబంధించిన ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. 'ఇది నా మనసుకు బాగా నచ్చిన సిరీస్, ఇందులో ఇప్పటివరకూ బాలీవుడ్ తన అంతరాలలో దాచుకున్న ఎన్నో రహస్యాలను వెలుగులోకి తేబోతున్నాం' అని చెప్పారు.





ధర్నాచౌక్ వద్ద విద్యుత్ కార్మికుల మహాధర్నాలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు

విద్యుత్ కార్మికులకు జగన్ మోసం

- వారిని రెగ్యులర్ చేస్తానని మాటిచ్చి..మడమ తిప్పారు
- మహాధర్నాలో జి.ఓబులేసు ఆగ్రహం

ధర్నాచౌక్, ఫిబ్రవరి 9: "అనేక ఏళ్లుగా పనిచేస్తున్న విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయకుండా ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మడమ తిప్పారు. రెండు రోజులుగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం." అని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని ధర్నాచౌక్‌లో శుక్రవారం కార్మికులు మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొని కార్మికులకు ఓబులేసు సంఘీభావం తెలిపారు. కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ సాధన కమిటీ నేతలు ఎం.బాలకాశి, కట్ట నాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, సంస్థ యాజమాన్యం స్పందించకుంటే ఈ నెలాఖరున విద్యుత్‌సౌధ ఎదుట ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికులకిచ్చిన..

హామీలు అమలు చేయాలి

- వారి డిమాండ్లు ఆమోదిస్తూ జీవో విడుదల చేయాలి: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు జేమ్స్

చిట్టినగర్, ఫిబ్రవరి 9: "మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి. కార్మికుల న్యాయమైన డిమాండ్లు ఆమోదించేలా వెంటనే జీవో విడుదల చేయాలి." అని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షుడు జె.జేమ్స్ డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మె సమయంలో ప్రభుత్వం అమలు చేస్తానని చెప్పిన హామీల జీవోను వెంటనే విడుదల చేయాలని శుక్రవారం ఈద్గా మసీద్ వెనుకనున్న శానిటరీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. 16 రోజులు కార్మికులు సమ్మె చేశారని, ఆ సమయంలో చర్చలు జరిపిన ప్రభుత్వం కార్మికుల డిమాండ్లు ఆమోదిస్తూ మూడు రోజుల్లో ప్రత్యేక జీవో ఇస్తానని హామీ ఇచ్చిందని జేమ్స్ తెలిపారు. 30 రోజులవుతున్నా జీవో ఇవ్వకుండా కార్మికులను మోసగిస్తోందన్నారు. ఇచ్చిన హామీలు అమలుచేయాలని ఈనెల 12న నల్లబ్యాడ్జీలతో నిరసన, 13న కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. తుపాకుల నాగేశ్వరరావు, కొండా వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ఎన్.భారతి, పి.రమణమ్మ, డి.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గగుడి డిప్యూటీ ఈవోగా లీలాకుమార్



వన్‌టౌన్, ఫిబ్రవరి 9: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం డిప్యూటీ ఈవోగా జీవీడీఎన్ లీలాకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు బందరు నేషనల్ కాలేజీ ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు. అంతకు ముందు మోపి దేవి, పలు ఆల యాల్లో ఈవోగా పనిచేశారు. దుర్గగుడిలో ఇప్పటి వరకు ఇన్‌చార్జి డిప్యూటీ ఈవోగా ఉన్న గురుప్రసాద్ తన సొంత ప్రాంతం రాయ లసీమకు బదిలీ అయ్యారు.

ఆరోగ్యకర సమాజమే ధ్యేయం

- చిన్నారుల్లో రక్తహీనత నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ, అనీమియా పరీక్షలు
- జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో వైద్య, ఆరోగ్యం, కుటుంబసంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న జె.నివాస్

కృష్ణలంక, ఫిబ్రవరి 9: ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, వీటిని విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ జె.నివాస్ సూచించారు. శుక్రవారం పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఢిల్లీరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఆయన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. చిన్నారుల్లో రక్తహీనత నివారణకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామని మూడు నెలలకోసారి అనీమియా పరీక్షలు నిర్వహిస్తు న్నామని నివాస్ వెల్లడించారు. నులిపురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం ఏర్పడుతోందని, వివిధ శారీరక, మానసిక ఆరోగ్యసమస్యలు ఎదురవుతాయని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యల బారిన పడకుండా ఉండొచ్చన్నారు. 1-19 ఏళ్ల వయస్సు వారికి మాత్రలు అందించామని, మిగిలిన వారికి ఫిబ్రవరి 16న మాత్రలు పంపిణీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఆర్బీఎస్‌కే రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ఇ.ప్రశాంత్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, హెచ్ఎం ఎ.లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

దుర్గగుడిలో భక్తుల రద్దీ


వన్‌టౌన్, ఫిబ్రవరి 9: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు శీఘ్రదర్శనం చేసుకునేలా ఇన్‌చార్జి ఈవో ఈఈ కోటేశ్వరరావు పర్యవేక్షించారు. భక్తుల రద్దీని నియంత్రించారు. ఆలయంలో శ్రీచక్రనవారణార్చన, లక్ష కుంకుమార్చన. శాంతికల్యాణం, చండీ హోమం తదితర ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ నేతలు

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 9: మోటారు రంగంలో పని చేసే డ్రైవర్లపై భారీ జరిమానాలు, జైలుశిక్షలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన హిట్ అండ్ రన్ యాక్టును రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మజ్దూర్ అధికార్ సంఘర్ష అభియాన్(మాసా), ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ, అమిత్‌షాల నేతృత్వంలోని ఫాసిస్టు ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబరు కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ పిలుపునిచ్చారు.



ఆత్మీయ కలయికలో పాల్గొన్న కేసరి హయ్యర్ సెకండరీ స్కూల్ 1975-86 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

ధర్నాచౌక్, ఫిబ్రవరి 9: చెన్నైలోని కేసరి హయ్యర్ సెకండరీ స్కూల్ 1975-86 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం శుక్రవారం హాయ్ ల్యాండ్‌లో జరిగింది. యాభై ఏళ్ల కిందట కలిసి చదువున్న తామంతా కలవడం సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఆట, పాటలతో హాయిగా గడిపారు. పాములర్తి చంద్రశేఖర్, గిరిజా శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రశేఖర్, తిమ్మారెడ్డి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

సజ్జలా..సోది డైలాగులు మానుకో: గురుమూర్తి

విద్యాధరపురం, ఫిబ్రవరి 9: చచ్చు సలహాలు ఇస్తూ.. ప్రభుత్వ సలహాదారుగా రూ.140 కోట్లు రాష్ట్ర ప్రజల సొమ్మును మింగేసిన సజ్జల రామకృష్ణారెడ్డి..ఇకనైనా సోది డైలాగులు మానుకోవాలని టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి హితవుపలికారు. నిధుల కోసం సీఎం జగన్‌రెడ్డి ఢిల్లీ వెళ్లాడని సజ్జల సోది మాటలు చెబుతున్నాడన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో గురుమూర్తి మాట్లాడారు. మేనిఫెస్టోలోని హామీలను వైసీపీ ప్రభుత్వం ఎంత బాగా అమలు చేసిందో మద్య నిషేధం, ప్రత్యేక హోదా అంశాలను చూస్తే తెలుస్తోందన్నారు. ఇంకా ఏదో ఉద్ధరించామని చెబితే ప్రజలు చీపుళ్లతో కొడతారని ఆయన హెచ్చరించారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ఊడ్చేశారన్నారు. ఇప్పుడు తన కుటుంబ చిచ్చును జగన్‌రెడ్డి రాష్ట్రానికి ఆపాదించడాన్ని ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు.

16న బంద్‌ను జయప్రదం చేయండి

- కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహించే గ్రామీణ బంద్- పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నేతలు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఐక్యవేదిక కన్వీనర్ జి.ఓబులేసు మాట్లాడారు. మోదీ ప్రభుత్వ విధానాలపై దేశవ్యాప్తంగా ఇప్పటికే అనేక ఆందోళనలు చేశామన్నారు. సీఎం జగన్ పూర్తిగా మోదీ అడుగుజాడల్లో నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం పెట్టే రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక బిల్లులు, చట్టాలను రాష్ట్రంలో ఆమో దం తెలుపుతూ బలపరుస్తున్నారన్నారు. మోదీ నిర్ణయాలతో దేశ ప్రజల, రైతులు, కార్మికులు, రైతాంగానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఈనెల 15న అర్ధరాత్రి 12 గంటల నుంచి 16 సాయంత్రం 6గంటల వరకు టైర్ బంద్ నిర్వహిస్తున్నామని, ఈ బంద్‌లో ప్రదర్శనలు, ధర్నాలు చేస్తామని తెలిపారు.

కార్పొరేట్ల సేవల్లో తరిస్తున్న ప్రభుత్వాలు

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 9: ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల నిర్ణయాల వల్ల లక్షలాది మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారని, వారి హక్కులకు భద్రత లేదని, ప్రభుత్వాలు కార్పొరేట్ల సేవలోనే తరిస్తున్నాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర మహాసభలు శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకెలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా లక్ష్మణరావు విచ్చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కుమార్ పతాకావిష్కరణ చేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూవీ క్రిష్ణయ్య, రిసెప్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్, రమేష్‌సుందర్, సునీల్, చంద్రకుమార్ పాల్గొన్నారు.

గండిగుంట ఆర్బీకే టెక్నికల్ అసిస్టెంట్

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు

- ధాన్యం శాంపిళ్ల సేకరణ, అనాలసిస్ సరిగా చేయడం లేదు
- వ్యవసాయ సలహా మండలి సమావేశంలో రైతుల ఆందోళన



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఫిర్యాదు చేస్తున్న రైతు కొల్లి రాధాకృష్ణ

ఉయ్యూరు, ఫిబ్రవరి 9: గండిగుంట ఆర్బీకేలో టెక్నికల్ అసిస్టెంట్ ధాన్యం శాంపిళ్లను సక్రమంగా సేకరించడం లేదని దీంతో నష్టపోతున్నామని రైతులు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి మండల సమా వేశంలో ఆందోళనకు దిగారు. టెక్నికల్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల బస్తాకు రూ.200 వరకు నష్టపోయి, రూ.1240కే అమ్మాల్సి వచ్చిందని రైతు కొల్లి రాధాకృష్ణ ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యం ఎనాలిసిస్ చేసి బస్తాకు రూ.1200 పడుతుందని చెప్పారని, దానిని ఆన్‌లైన్ చేసి దోసపాడు సత్యనారాయణ ట్రేడర్స్ మిల్లుకు పంపితే వారు రూ.1400 చొప్పున ధర కట్టి ధాన్యం దిగుమతి చేసుకున్నారని మరో రైతు నాదెళ్ల సుబ్బారావు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ చెప్పిన దానికి మిల్లరు తీసుకున్న దానికి రూ.200 వ్యత్యాసం ఉందని అన్నారు. చర్యలు తీసుకోని పక్షంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని మండల వ్యవసాయ ఇన్‌చార్జ్ అధికారి గణేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.



ఖోనా నాటకంలో నటించిన పాత్రధారులు

బెంగాలీ సంస్కృతికి అద్దం పట్టిన ఖోనా నాటకం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9: చరిత్రాత్మక సంఘటనలతో ప్రదర్శించిన ఖోనా నాటకం బెంగాలీ సంస్కృతికి అద్దం పట్టింది. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖల సంయుక్త అధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత రంగోత్సవంలో భాగంగా నాలుగోరోజు శుక్రవారం ఖోనా నాటకాన్ని ప్రదర్శించారు. బంగ్లాదేశ్ దేశానికి చెందిన 'బొట్టాల ఎ పెర్ఫార్మెన్స్ స్పేస్' బృందం ప్రదర్శించిన ఈ నాటకాన్ని లండన్ అక్స్‌ఫోర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సమినా లూతఫా రచించారు. మహ్మద్ అలీ హైదర్ దర్శకత్వం వహించారు. సంజయ్ శ్రీ వాస్తవ, నీతి శ్రీవాస్తవ, సంకిత్ సెజ్వార్, ఉదయ్ షానే, హర్ష్ దౌండ్, అమోఘ్ విక్రమ్విమలేష్ పటేల్ ప్రధాన పాత్రల్లో నటించారు. కళాకారులను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామ ప్రతినిధి వివేక్ సత్కరించి అభినందించారు.

వస్త్రలతను అభివృద్ధి చేస్తాం: పోతిన మహేష్

వన్‌టౌన్, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికల తర్వాత టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే వస్త్రలత కాంప్లెక్సును అభివృద్ధి చేస్తామని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతిన మహేష్ హామీ ఇచ్చారు. ఇంటింటికీ రాబోయే జనసేన-టీడీపీ ప్రభుత్వం నినాదంతో ఆయన వస్త్రలత కాంప్లెక్సులో శుక్రవారం ప్రచారం చేశారు. వ్యాపారులు, గుమాస్తాలు, ముఠా కార్మికులను కలిసి జనసేన-టీడీపీ ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. వస్త్రలతలో పార్కింగ్, మరుగుదొడ్లు, అద్దెల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వస్త్రలతలో పనిచేసే గుమాస్తాలు, ముఠా కార్మికుల్లో సొంత ఇళ్లు లేని వారికి ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. పశ్చిమ నియోజ కవర్గంలో సొంత ఇల్లులేని పేద సామాన్య వర్గాలకు నియోజ కవర్గంలోనే ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఆత్మీయుడు పోతిన మహేష్ తమ కాంప్లెక్సుకు రావడం ఆనందంగా ఉందని, తమ సమస్యలను విని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఆయనకు తమ మద్దతు ఉంటుందని వస్త్రలత అసోసియేషన్ అధ్యక్షుడు ఓలేటి జగన్మోహనరావు తెలిపారు. వ్యాపారులు కొత్త అనిల్‌కుమార్, త్రివేణి నాగభూషణ్, పంచకుర్తి నాగభూషణ్, మద్ది సుబ్బారావు, బసవరాజు, పి.రామ్‌కుమార్ సాహితీ శివ, సిగనంశెట్టి రాము గుప్తా, మారుతి, జనసేన నాయకులు తిరుపతి అనూష, పొట్నూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ కూటమిదే విజయం..
వైసీపీ పతనం ఖాయం

- మోదీని కలిసినా జగన్ ఆశలు నెరవేరవు
- యాత్ర-2 టికెట్లు ఫ్రీగా పంచుతున్నా ప్రేక్షకులు కరువు
- 'రచ్చబండ'లో ఎంపీ రఘురామ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఈ దఫా ఎన్నికల్లో టీడీపీ కూటమి ఊహించని విజయం సాధిస్తుందని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణ రాజు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన కలయికతోనే పెను మార్పులు వచ్చాయని, ఎన్డీఏలోకి తెలుగుదేశం పార్టీని బీజేపీ ఆహ్వానించడాన్ని బట్టి.. కూటమిలో బీజేపీ కూడా చేరితే అద్వితీయ విజయం ఖాయమని పేర్కొన్నారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా రఘురామ శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఇండియా టుడే మూడ్ ఆఫ్ ది నేషన్ పేరిట నిర్వహించిన సర్వే ఫలితాల వెల్లడి ద్వారా వైసీపీ నాయకత్వం వెన్నులో అణుబాంబు పేలినట్టయిందన్నారు. ఈ సర్వేలో టీడీపీ తన ఓటు బ్యాంకును 45 శాతానికి పెంచుకుందని, జనసేనతో కలిసి ఆ పార్టీ 52 శాతం ఓటు షేర్ దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఇక, 50 శాతం ఓటుబ్యాంకు కలిగిన వైసీపీ ఇప్పుడు 41 శాతానికి పడిపోయిందన్నారు. ఎన్నికలకు ఇంకా రెండు నెలల సమయం ఉండడంతో, వైసీపీ ఓటు బ్యాంకు మరింత పతనం కావడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో జగన్‌ను గెలిపించి ప్రజలు తాము చేసిన తప్పుకు కుమిలిపోతున్నారని.. చంద్రబాబు వంటి అభివృద్ధి కాముకుడిని, కార్యదీక్షపరుడిని ఈసారి ఓటు వేసి గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ విషయం తెలిసే.. ఇటీవల తిరుపతిలో ఇండియా టుడే నిర్వహించిన కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి జగన్.. పోతే పోతాం అని వైరాగ్యం ప్రదర్శించారని పేర్కొన్నారు. ఇక, కోరం లేకుండానే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరు చూస్తే వాస్తవ పరిస్థితి ఏమిటో వైసీపీ నాయకత్వానికి ఈపాటి కే అర్థమై ఉంటుందన్నారు. కాగా, ఎట్టకేలకు ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ దొరికినా, జగన్.. ఆయన కాళ్లకు దండం పెట్టడం తప్ప, కోరికలు మాత్రం తీరే అవకాశం లేదన్నారు. మరోవైపు జగన్ బయోపిక్‌గా వచ్చిన యాత్ర 2 సినిమా టికెట్లను వైసీపీ ఎమ్మెల్యేలు కొని, ఉచితంగా ప్రేక్షకులకు పంచిపెట్టి.. వంద రూపాయలు కవర్‌లో పెట్టి, కూల్ డ్రింక్స్ కూడా కొనిపెడుతున్నా థియేటర్లలో జనమే కనిపించడం లేదని రఘురామ ఎద్దేవా చేశారు.

పరాకాష్ఠకు జగన్ కులపిచ్చి: అనగాని

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో సొంత సామాజికవర్గానికి పెద్దపీట వేసిన జగన్ కులపిచ్చి పరాకాష్ఠకు చేరుకుందని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఒక ప్రకటనలో విమర్శించారు. పదవులన్నీ తన సొంత సామాజిక వర్గానికి కట్టబెట్టి బడుగు, బలహీనవర్గాలను ముఖ్యమంత్రి జగన్ అణిచేస్తున్నారన్నారు. రాష్ట్రం కంటే తన సామాజికవర్గమే ఎక్కువని రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో జగన్ నిరూపించారని పేర్కొన్నారు. రాయలసీమలో ప్రధానమైన బలిజ సామాజికవర్గానికి చెందిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్‌కు మొదట రాజ్యసభ ఇస్తున్నట్లు ప్రకటించారని, తడి ఆరకముందే ఆయనను తొలగించి సొంత సామాజికవర్గానికి చెందిన మేడా రఘునాథ్‌రెడ్డికి కేటాయించడం బలిజల గొంతు కోయడం కాదా? అని నిలదీశారు.

జగన్ ఆరు విధ్వంసకర ఆర్థిక విధానాలు: యనమల

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బ్యాడ్ డెబ్ట్, హై కరప్షన్, హై ఇన్‌ఫ్లేషన్, హై అన్‌ఎంప్లాయిమెంట్, హై డెఫిసిట్స్, సిస్టమ్స్ కొలాప్స్ అనే ఆరు ఆర్థిక విధ్వంసక ఆర్థిక విధానాలతో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. జగన్ దోపిడీలో భాగంగా రాష్ట్రంలోని సహజ వనరులను ఇష్టానుసారం దోచుకున్నారని, జగన్ ఐదేళ్లలో రూ.6 లక్షల కోట్లు దోచుకున్నారన్నారు. 2-3 శాతం కంటే ఎక్కువ ఉండకూడని ద్రవోల్బణం నేడు రాష్ట్రంలో 8.5%, పట్టభద్రుల నిరుద్యోగిత 24% ఉందన్నారు. 2018-19లో రూ.35,467 కోట్లుగా ఉన్న ద్రవ్యలోటు 2022-23 నాటికి రూ.52508 కోట్లకు చేరుకుంది. అదే విధంగా రెవెన్యూ లోటు 2018-19లో రూ.13899 కోట్లు ఉన్న రెవెన్యూ లోటు 2022-23 నాటికి రూ.43487 కోట్లకు చేరుకుందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి శాసనసభకు చెప్పి తెచ్చిన అప్పులను సైతం బుగ్గన దాచిపెట్టారని, ఇవి కాక ఏడాదికి రూ.ఒక లక్ష కోట్లకు పైగా బడ్జెటేతర అప్పులు తెచ్చారని పేర్కొన్నారు. జగన్ పాలన మొదలైన ఏడాది నుంచి చివరి ఏడాది వరకు ఏడాదికి రూ.లక్ష కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్లు కార్పొరేషన్ రుణాలు తీసుకున్నారని, ఈ అప్పులను ఎక్కడ ఖర్చు చేశారో కాగ్‌కు సైతం చెప్పలేదన్నారు. జగన్ ప్రభుత్వ అప్పులపై కేంద్రం, ఆర్‌బీఐ ఇప్పటికే హెచ్చరించాయన్నారు. పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేయాల్సిన ఆరోగ్య శ్రీకి కూడా జగన్ రూ.1,200 కోట్లు బకాయిలు పెట్టారని యనమల ఆరోపించారు.

ఉక్కు పెట్టుబడుల ఉపసంహరణపై సమీక్షించాలి

- రాజ్యసభ సభ్యుడు కనకమేడల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 'వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు పెట్టుబడుల ఉపసంహరణ' నిర్ణయంపై సమీక్షించాలని, ఈ ప్లాంట్ పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన.. రాజ్యసభలో మాట్లాడుతూ.. విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో పెట్టుబడులను పూర్తిగా ఉపసంహరించాలని ఆర్థిక వ్యవహారాల కేంద్ర కెబినెట్ కమిటీ సూత్రప్రాయంగా ఆమోదించిందని గుర్తు చేశారు. ఈ నిర్ణయం పట్ల కోట్లాది మంది ఆంధ్రులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉక్కు కర్మాగారానికి సొంత గనులు లేవని, ఎన్ఎండీసీపై ఆధారపడుతోందని తెలిపారు. అంతేకాకుండా ఆస్ట్రియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని ఆయన చెప్పారు. దీంతో ఇతర ప్లాంట్లతో పోలిస్తే వైజాగ్ స్టీల్ ప్లాంట్ రూ.20 వేల కోట్లు భరించాల్సి వస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో ప్లాంట్‌ను ప్రభుత్వం రంగంలోనే కొనసాగేలా చూసేందుకు కేంద్రం పెట్టుబడుల ఉపసంహరణపై పునఃసమీక్షించాలని కనకమేడల కోరారు.

జగన్‌రెడ్డి కులగణనకు చట్టబద్ధత ఉందా?: కొల్లు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరించి, ఎన్నికల వేళ బలహీన వర్గాలను భయపెట్టి, రాజకీయంగా లబ్ధి పొందాలని జగన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ఆరోపించారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వలంటీర్లతో చేయిస్తున్న కులగణనకు చట్టబద్ధత ఉంటుందని జగన్‌రెడ్డి చెప్పగలడా? బీసీలకు రాజ్యాంగబద్ధంగా స్థానిక సంస్థల్లో దక్కాల్సిన 16 వేలకుపైగా పదవులు దక్కకుండా చేసిన జగన్‌రెడ్డి కులగణనతో బీసీలను ఉద్ధరిస్తాడా? అని నిలదీశారు. టీడీపీ - జనసేన అధికారంలోకి రాగానే బీసీలకు న్యాయం జరిగేలా కులగణన చేపడతామని చెప్పారు.

ఇండియా టుడే సర్వేతో తాడేపల్లిలో భూకంపం

- పరిస్థితి అర్థమై అసెంబ్లీకి మొహం చూపని మంత్రులు, ఎమ్మెల్యేలు: బొండా ఉమ

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ - జనసేన కూటమి రాబోయే ఎన్నికల్లో సునామీ సృష్టించబోతోందని ఇండియా టుడే సర్వే వెల్లడించడంతో తాడేపల్లి కొంపలో భూకంపం వచ్చిందని తెలుగుదేశం పార్టీ ఎద్దేవా చేసింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు శుక్రవారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'టీడీపీ, జనసేన కలిపి 60 శాతం ఓట్లతో క్లీన్ స్వీప్ చేస్తాయని ఇండియా టుడే - సీ ఓటర్ సర్వేలో వెల్లడైంది. ఇవే సంస్థలు 2019లో వైసీపీ గెలుస్తుందని చెప్పాయి. అప్పుడు జగన్‌రెడ్డి, ఆయన అనుచర బృందం జబ్బలు చరుచుకొన్నారు. ఇప్పుడు అవే సంస్థలు టీడీపీ కూటమి గెలుస్తుందని చెప్పగానే అక్కసు వెళ్లగక్కుతున్నారు. దీనిని ఎదుర్కోవడానికి ఫేక్ సర్వేలను తయారు చేసి బయటకు వదిలే దిక్కుమాలిన పనులకు వైసీపీ పాల్పడుతోంది' అని ఆయన అన్నారు. చంద్రబాబుతో చర్చల తర్వాత మోదీ, అమిత్ షా ఎక్కడ తన ఆట కట్టిస్తారో అన్న భయంతో పెద్దలను బతిమాలుకోవడానికే జగన్ హడావుడిగా ఢిల్లీ పరుగులు తీశారని బొండా ఆరోపించారు. ముడుపులు కుమ్మరించినా గతం మాదిరిగా జాతీయ మీడియా సంస్థలు జగన్‌కు కొమ్ము కాయడానికి ఇష్టపడటం లేదని, వైసీపీ సృష్టించిన ఫేక్ సర్వేను రిపబ్లిక్ టీవీ ఖండించడమే దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. వైసీపీ పని అయిపోయిందని ఆ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా అర్థమైపోయిందని, అందుకే అసెంబ్లీ సమావేశాల్లో మొహం చాటేశారని బొండా ఉమ అన్నారు.

స్పెషల్ సీఎస్ ఆదేశించారు
వసూల్‌రాజా ఆపేశారు

- గనుల అక్రమాలపై విచారణ బుట్టదాఖలు
- స్పెషల్ సీఎస్ లేఖలకే దిక్కులేదు
- శాఖాపరమైన, విజిలెన్స్ విచారణకు అడ్డు
- అక్రమాలకు స్వర్గధామంగా ఏపీఎండీసీ
- సంస్థ అధికారులు అడ్డగోలుగా దోపిడీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అధికారులపై ఫిర్యాదులు రావడం.. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విచారణకు ఆదేశించడం.. ఆ వెంటనే వసూల్ రాజా రంగంలోకి దిగి అడ్డుకోవడం! అంతే.. శాఖాపరమైన, విజిలెన్స్ విచారణ ఏదీ ఉండదు. స్పెషల్ సీఎస్ ఆదేశాలకే దిక్కులేకుండా పోతోంది. అక్రమాలకు స్వర్గధామంగా మారిన ఏపీఎండీసీలో జరుగుతున్న తంతు ఇది. ప్రభుత్వ ఖజానాను నింపే విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఒకటి. ఏటా నాలుగువేల కోట్ల ఆదాయం అందిస్తోంది. లాభం సర్కారుకేనా? తమకూ దక్కాలన్న దుష్టపన్నాగంతో గనుల శాఖలో కొందరు అధికారులు పెద్దల అండదండలతో అడ్డగోలు అక్రమాలకు పాల్పడ్డారు. అర్హత లేని కంపెనీలకు టెండర్లు కట్టబెట్టారు. ఇసుక, బొగ్గు, బైరైటీస్‌లో అందినకాడికి దండుకున్నారు. అస్మదీయ కంపెనీలకు దోచిపెట్టారు. కొందరు అధికారులే బినామీ కంపెనీలను పుట్టించి బైరైటీస్ వ్యాపారం చేశారు. ఇవన్నీ కాలనుగుణంగా ప్రభుత్వానికి ఫిర్యాదుల రూపంలో తెలిశాయి. ఫిర్యాదులు భారీగా వస్తుండటంతో గనుల శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(మైన్స్) శాఖాపరమైన, విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఆరోపణలున్న అధికారులను తక్షణమే ఏపీఎండీసీ నుంచి తప్పించి వారిపై విచారణ జరిపి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. కొందరినైతే తప్పించారు కానీ విచారణ మాత్రం బుట్టదాఖలు చేశారు. మరికొందరిని టచ్ కూడా చేయలేదు. అదేమంటే వసూల్‌రాజా ఎఫెక్ట్. ముఖ్యనేత వద్ద పనిచేస్తున్న వసూల్‌రాజాది కూడా ఉమ్మడి కడప జిల్లానే. ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖుల్లో అదే జిల్లాకు చెందినవారున్నారు. అన్నింటికి మించి వారంతా కీలక అధికారి కోసం నిబంధనలను ఉల్లంఘించి పనిచేశారు. దీంతో వసూల్‌రాజా తన అధికారాన్ని అడ్డుపెట్టి విచారణను అడ్డుకున్నారు. విచారణ చేయమన్న పత్రాలే లేకుండా చేశారు. అంతే విచారణలు బుట్టదాఖలయ్యాయి. ఆరోపణలున్నవారు సేఫ్‌గా ఏపీఎండీసీని వదిలేసి సొంత విభాగాలకు వెళ్లిపోయారు. ఏపీఎండీసీలో పనిచేయాలంటే వాణిజ్యం, జియాలజీ, సైన్స్, ఖనిజాల గురించిన అంశాలపై అధ్యయనం చేసి ఉండాలి. లేదంటే ఆయా విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉండాలి. అలాంటి వారికే ఏపీఎండీసీలో కీలక పోస్టులు ఇవ్వాలన్న విధానం ఉండేది. ఈ సంప్రదాయాన్ని పక్కనపెట్టి విద్యార్హతలు, హోదాలతో సంబంధం లేకుండా నచ్చిన వ్యక్తులను తీసుకొచ్చి కీలక పోస్టులు కట్టబెట్టారు. వారు చేసిన పనులపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. మచ్చుకు కొన్ని..

విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి..

విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి బోస్ అనే అధికారి ఏపీఎండీసీకి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఆయనకు జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్, కాంట్రాక్ట్స్) పోస్టు ఇచ్చారు. బొగ్గు (సూలియారి కోల్‌బ్లాక్) అమ్మకం టెండర్లలో ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అంతేస్థాయిలో ఆయనపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. బొగ్గు టెండర్లతో పాటు ఏపీఎండీసీ కాంట్రాక్టుల్లో ఆయన పాత్రపై విచారణ చేయాలంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. వెంటనే వీటిని గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశీలించి ప్రభుత్వానికి నివేదించారు. రెగ్యులర్ శాఖాపరమైన విచారణ చేపట్టాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గత ఏడాది ఏప్రిల్ 24న గనుల శాఖను ఆదేశించారు. వెంటనే ఆయన్ను ఏపీఎండీసీ నుంచి తప్పించి సొంత విభాగానికి పంపించాలని ఏపీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు. బోస్‌ను తప్పించారు. కానీ విచారణ చేయలేదు. విచారణ చేయాలన్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు బుట్టదాఖలయ్యాయి.

వ్యవసాయ శాఖ నుంచి..

లీల అనే అధికారి వ్యవసాయ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై ఏపీఎండీసీకి వచ్చారు. ఆమెకు కీలకమైన విజిలెన్స్, ఇంటర్నల్ ఆడిట్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగాలు అప్పగించారు. వ్యవసాయ శాఖలో పనిచేసిన అధికారిణికి వేల కోట్ల వ్యాపారం చేసే ఏపీఎండీసీ ఆడిట్, అకౌంట్ల విభాగాలు అప్పగించడంలోనే అసలు ఉద్దేశం కనిపిస్తోంది. ఆమెపై కొన్ని తీవ్ర ఆరోపణలు వచ్చాయి. గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి కార్యాలయం నుంచే ఆమెపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకునేందుకు ఓ అధికారి వారం పాటు శ్రమించినా ఫలితం లేకపోయింది. ఆమెను ఏపీఎండీసీ బాధ్యతల నుంచి తక్షణమే తప్పించి సొంత విభాగానికి పంపించడంతో పాటు ఆమెపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఏపీఎండీసీ ఎండీకి గత ఏడాది మే ఒకటిన లేఖ రాశారు. ఆమెను ఏపీఎండీసీ నుంచి తప్పించగలిగారు కానీ విచారణ మాత్రం చేయలేదు.

ఏపీఎండీసీలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్ అధికారులు, ఓ రిటైర్డ్ ఈడీపై విజిలెన్స్ విచారణ చేయాలన్న సిఫారసులు ఉన్నాయి. డిప్యూటేషన్‌పై వచ్చిన బోస్, లీల అనే అధికారులపై శాఖాపరమైన విచారణ చేయాలన్న సిఫారసులున్నాయి. ఇతర శాఖల నుంచి వచ్చిన ఈ ఇద్దరిని మాత్రమే ఏపీఎండీసీ నుంచి తప్పించారు. మిగిలిన ఆరుగురు అదే విభాగంలో ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరిపైనా ఎలాంటి విచారణ లేదు. ఇటు శాఖాపరమైన, అటు విజిలెన్స్ విచారణలను వసూల్‌రాజా దిగ్విజయంగా అడ్డుకున్నారు. ఏ ఒక్కరికీ ఇసుమంతైనా నష్టం కలగకుండా, విచారణ అన్న పదమే వినపడకుండా ముఖ్యనేత వద్ద మంత్రాంగం నడిపించారు. దీంతో అందరూ సేఫ్. ఈ మాత్రం దానికి ఇతర విభాగాల నుంచి వచ్చిన వారిని తప్పించడం దేనికి? ఆరోపణలున్నవారిందరికీ మరింత కీలకమైన బాధ్యతలు అప్పగిస్తే ఓ పనైపోతుంది కదా అని సీనియర్ అధికారులు మండిపడుతున్నారు.

మళ్లీ 'చీకటి' పదోన్నతులు!

- దేవదాయశాఖలో మరోసారి సేమ్ సీన్
- గురువారం అర్ధరాత్రి గ్రేడ్-1 ఈవోలకు అసిస్టెంట్ కమిషనర్లుగా ప్రమోషన్
- శుక్రవారం ఉదయమే విధుల్లో చేరాలని ఆదేశం
- సీనియారిటీని కాదని పదోన్నతులు
- డీసీల పదోన్నతుల్లోనూ ఇదే వ్యవహారం

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సీనియారిటీని పరిగణనలోకి తీసుకోరు. కోర్టు ఆదేశాలను పట్టించుకోరు. బాధితుల అభ్యంతరాలను బుట్టదాఖలు చేస్తారు. పదోన్నతుల విషయంలో దేవదాయ శాఖలో ఉన్నతాధికారుల తీరు ఇదీ. ఒక్క మాటలో చెప్పాలంటే అధికారులకు నచ్చినోళ్లకు ప్రమోషన్లు ఇచ్చేస్తున్నారు. దేవదాయ శాఖలో మరోసారి 'చీకటి' పదోన్నతులు కల్పించారు. బుధవారం అర్ధరాత్రి అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్‌గా 20 మందికి పదోన్నతులు ఇచ్చి గురువారం ఉదయమే కొత్త స్థానాల్లో చేరిపోవాలని ఫోన్లలో సమాచారం ఇచ్చిన సంగతి తెలిసిందే. అలాగే గ్రేడ్-1 ఈవోల నుంచి అసిస్టెంట్ కమిషనర్ పదోన్నతుల విషయంలోనూ సేమ్ సీన్ రిపీట్ అయింది. గురువారం అర్ధరాత్రి పదోన్నతులు ఇచ్చి శుక్రవారం ఉదయమే విధుల్లో చేరాలని ఫోన్లలో సమాచారం ఇచ్చారు. పదోన్నతుల ఆర్డర్లు కూడా వారి వ్యక్తిగత ఫోన్లకు పంపించేశారు. ఎక్కడా బయటకురానివ్వకుండా అత్యంత జాగ్రత్తగా చీకటి పదోన్నతులు కల్పించేశారు. పదోన్నతులు దక్కని గ్రేడ్-1 ఈవోలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతుల విషయంలో దేవదాయ శాఖ మంత్రి దగ్గర నుంచి కమిషనర్ వరకూ అందరూ ఒకే విధంగా వ్యవహరించారు. ఎక్కడా నిబంధనలు పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా నచ్చినోళ్లకు పదోన్నతులు ఇచ్చేశారు. ఈ మాత్రం దానికి రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, సీనియారిటీ లిస్టులు, ప్రభుత్వ నిబంధనలు ఎందుకన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతుల విషయంలోనూ, గ్రేడ్-1 ఈవోల నుంచి అసిస్టెంట్ కమిషనర్‌గా పదోన్నతులు కల్పించే విషయంలోనూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారు.

బోటుయార్డు స్థలం స్వాహా!

- రూ.50 కోట్లు విలువజేసే రెండెకరాలు కబ్జా
- వైసీపీ కేంద్ర కార్యాలయం ఏర్పాటుకు వ్యూహం
- ఏడాది క్రితం దొంగచాటుగా జీవో 52 జారీ
- ఎకరాకు రూ.1,000 చొప్పున 33 ఏళ్లకు లీజు
- సీడ్ యాక్సిస్ రోడ్డునూ అడ్డుకునే ఎత్తుగడ?



బోటు యార్డు స్థలంలో రహస్యంగా జరుపుతున్న నిర్మాణాలు

మంగళగిరి, ఫిబ్రవరి 9: అది గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన స్థలం. రూ.కోట్లు విలువజేసే ఆ స్థలంపై వైసీపీ నేతల కన్నుపడింది. దాన్ని హస్తగతం చేసుకొనేందుకు పావులు కదిపారు. ఒక్కో ఎకరం రూ.25 కోట్లకు పైగా విలువజేసే రెండెకరాల స్థలాన్ని కబ్జా చేయడానికి వ్యూహం రచించారు. రాజధాని ప్రాంతంలో దాదాపు భాగంగా ఉన్న తాడేపల్లి పరిధిలోని కొత్త హైవే, పాత హైవే మధ్యలో ఉన్న ఈ స్థలాన్ని వాడుకునేందుకు వీలుగా జీవో 52ని గుట్టుగా విడుదల చేయించారు. గతేడాది ఫిబ్రవరి 16న విడుదలైన ఈ జీవోలో... సర్వే నం.202/ఏ-1 కింద ఉన్న రెండెకరాల బోటు యార్డు స్థలాన్ని వైసీపీ పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం ఏడాదికి ఎకరాకు రూ.1,000 చొప్పున 33ఏళ్ల పాటు లీజుకు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ తర్వాత దాదాపు ఆరు నెలలకు అంటే గత ఆగస్టులో ఈ జీవో బహిర్గతం కావడంతో టీడీపీ, జనసేన, వామపక్ష పార్టీలు ఆందోళన బాటపట్టాయి. దీంతో వెనక్కి తగ్గిన వైసీపీ... నిర్మాణ పనులు నిలిపేసింది. అయితే ఎన్నికలు తరుముకొస్తుండటంతో మళ్లీ అత్యంత రహస్యంగా ఆ స్థలంలో నిర్మాణ పనులు ఆరంభించింది.

జలరవాణా నిలిచిపోవడంతో...

బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో విజయవాడ నుంచి చెన్నై వరకూ బకింగ్‌హాం కాలువ (మద్రాసు కాలువ) ద్వారా జలరవాణా జరిగేది. ఇందుకోసం తాడేపల్లి ఏరియాలో కాలువ వెంబడి సుమారు రెండెకరాలకు పైగా ఖాళీగా ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని బోటుయార్డుగా వినియోగించేవారు. అక్కడ పడవలు నిలుపుకోవడం, వాటికి మరమ్మతులు నిర్వహించడంతో పాటు సరుకులను ఎగుమతి, దిగుమతి చేసేవారు. కాలక్రమంలో బకింగ్‌హాం కాలువలో జలరవాణా నిలిచిపోవడంతో బోటు యార్డు నిరుపయోగంగా మారిపోయింది. ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు అప్పటి ప్రభుత్వం చుట్టూ పటిష్టమైన ప్రహరీ నిర్మించింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ పెద్దల కన్ను విలువైన ఈ బోటుయార్డు స్థలంపై పడింది. అంతే పార్టీ కార్యాలయం నిర్మాణం కోసమంటూ ఆగమేఘాలపై జీవో 52ను జారీ చేయించారు. దీనిపై జనసేన పోరాటం ఆరంభించింది. టీడీపీ, వామపక్ష పార్టీలు కూడా ఈ స్థలాన్ని రక్షించాలంటూ ఉద్యమాలు చేపట్టాయి. ఉద్యమాలు ఉధృతం కావడంతో పార్టీ కార్యాలయ నినిర్మాణంపై వైసీపీ వెనకడుగు వేసింది.

సీడ్‌యాక్సిస్ రోడ్డుకు మంగళం

బోటుయార్డు స్థలం కబ్జా చేయడం ద్వారా ఈ ప్రాంతంలో విలువైన స్థలాన్ని కారుచౌకగా దక్కించుకోవడంతో పాటు టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీడ్‌యాక్సిస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవడమే వైసీపీ పెద్దల ఉద్దేశం కావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాజధాని అమరావతి మాస్టర్‌ప్లాన్‌లో కోర్ కేపిటల్ ప్రాంతాన్ని తూర్పు, పశ్చిమ దిశలు రెండువైపులా హైవేలకు అనుసంధానిస్తూ రెండు అద్భుతమైన రహదారుల నిర్మాణాన్ని చేపట్టాలని చంద్రబాబు సర్కారు ప్రతిపాదించింది. వాటిలో ఒకటి ఇబ్రహీంపట్నం రింగు నుంచి బందరు-హైదరాబాద్ హైవేను కోర్ కేపిటల్‌కు అనుసంధానిస్తూ కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించడం. ఇక రెండోది కనకదుర్గ వారధి నుంచి కోల్‌కతా-చెన్నై హైవేను కోర్ కేపిటల్‌కు అనుసంధానిస్తూ సీడ్ యాక్సిస్ రోడ్డును నిర్మాణం చేయడం. రాజధాని ప్రాంతంలో సీడ్‌యాక్సిస్ రోడ్డు చాలవరకు పూర్తయినప్పటికీ కనకదుర్గ వారధి నుంచి ఉండవల్లి వరకు మొత్తం ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉంది. ఈ రోడ్డు బోటుయార్డు మీదుగా వెళ్లాల్సి ఉంది. స్థలాన్ని కబ్జా చేయడం ద్వారా రోడ్డుకు మంగళం పాడాలన్నది వైసీపీ నేతల ఉద్దేశం కావొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న సీఎం సలహాదారు అజేయకల్లం

భేష్.. భళా.. సూపర్!

- వర్సిటీ వేదికగా వైసీపీ స్కీమ్‌లపై భజన
- జగన్ పథకాలపైనే ప్రత్యేకంగా సెమినార్
- కాకినాడ జేఎన్‌టీయూకేలో నిర్వహణ
- విద్యార్థులు బయటకుపోకుండా ఆడిటోరియానికి తాళం

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 9: జగన్ పథకాల ప్రచారానికి చివరకు విశ్వవిద్యాలయాలనూ వదిలిపెట్టడం లేదు. భేష్.. భళా.. సూపరు.. ఇదీ ఈ 'ప్రచారం'లో పాల్గొన్న వక్తల వరుస. కాకినాడ జేఎన్టీయూకేలో 'సంక్షేమం, అభివృద్ధి, సమ్మిళిత పాలన, ప్రగతి పథంలో ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఓపెన్ మైండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. పరీక్షలు, ప్రాజెక్టు వర్కులు, పుస్తకాలతో కుస్తీ పట్టే ఇంజనీరింగ్ విద్యార్థులను బలవంతంగా సెమినారులో కూర్చోబెట్టారు. ప్రభుత్వ ప్రచార తంతులా ఈ కార్యక్రమం సాగింది. ప్రభుత్వ పథకాలను విద్యార్థులకు వివరించి వారిలో వైసీపీపై సానుకూలత ఏర్పడేలా చేయాలని ప్రయత్నించారు. ఈ కార్యక్రమానికి ఓపెన్‌మైండ్స్ సొసైటీ అధ్యక్షుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా మాజీ సీఎస్, సీఎం ముఖ్య సలహాదారు అజేయకల్లం, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, రెక్టార్ కేవీ రమణ పాల్గొన్నారు. అజేయకల్లం తన ప్రసంగంలో నాడు-నేడు, అమ్మఒడి, విదేశీ విద్యాదీవెన, రీసర్వే, ఏపీల్యాండ్ టైట్లింగ్ చట్టం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను ఏకరువు పెట్టారు. విద్యార్థులంతా వీటన్నింటిని అమలు చేస్తున్న ప్రభుత్వం గురించి ఆలోచించాలన్నారు. అనంతరం వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ....వర్సిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. శేషారెడ్డి మాట్లాడుతూ....ఇంగ్లీష్ మాట్లాడలేకపోవడమే విద్యార్థుల ఓటమికి ప్రధాన కారణమన్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదువులతో ప్రపంచం మనదవుతుందని తెలిపారు. ఈ దిశగా జగన్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వ్యాఖ్యానించారు. వర్సిటీ ప్రొఫెసర్ మురళీకృష్ణ ...అతిథులను పొగడ్తలతో ముంచెత్తారు. విసుగు చెందిన కొందరు విద్యార్థులు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆడిటోరియం తలుపులు మూసివేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఏపీల్యాండ్ టైట్లింగ్ చట్టం గురించిన సమాచారంతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. వాటిపై ముద్రించిన వారి పేరు, చిరునామా, ఫోన్ నంబరు లేకపోవడం గమనార్హం.

ప్రసాదంలో ఎముకలు

- శ్రీశైలం క్షేత్ర పవిత్రతకు భంగం
- విచారణకు ఆదేశించిన అధికారులు



పులిహోరలో దర్శనమిచ్చిన ఎముక ముక్కలు

శ్రీశైలం, ఫిబ్రవరి 9: శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల ప్రసాదంలో ఎముక ముక్కలు ప్రత్యక్షమవడం కలకలం రేపింది. ఈ ఘటనతో భక్తులు తీవ్రంగా కలత చెందారు. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులు శుక్రవారం ఉదయం మల్లన్న, భ్రమరాంబికా అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వెలుపలికి వచ్చే సమయంలో దేవస్థానంవారు భక్తులందరికీ ఉచిత తీర్థప్రసాదాలు అందిస్తుండగా.. వేణుగోపాల్ అనే వ్యక్తి అమ్మవారి ప్రసాదం పులిహోరను స్వీకరించాడు. ఆ ప్రసాదం నోట్లో వేసుకుంటుండగా.. రెండు ఎముకముక్కలు రావడంతో కంగుతిన్నాడు. వెంటనే తమ ఫోన్లలో చిత్రీకరించి ఆలయ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్వామి, అమ్మవార్ల ప్రసాదంలో ఎముక ముక్కలు రావడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు కూడా చేశారు. ఈ ఘటనపై భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారు. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేసి ఉంటారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసును వివరణ కోరగా విచారణకు అదేశించామని తెలిపారు.

నియోజకవర్గానికో స్కిల్ సెంటర్: మంత్రి బుగ్గన

ఎండాడ (విశాఖపట్నం), ఫిబ్రవరి 9: రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో స్కిల్ సెంటర్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 26 స్కిల్ అకాడమీలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందిస్తున్నామన్నారు. భీమిలి బీచ్‌రోడ్డులో గల రాడిసన్ బ్లూ హోటల్‌లో 'నేషనల్ స్కిల్ కాన్‌క్లేవ్'ను శుక్రవారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. స్థానిక పరిశ్రమల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నైపుణ్య శిక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అయ్యనార్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సైబర్ టెర్రరిజం, ఆన్‌లైన్ మోసాలను అధిగమించడానికి నైపుణ్యం చాలా అవసరన్నారు. అనంతరం మంత్రి సమక్షంలో 100 మిలియన్ లెర్నర్స్, ట్రస్టెడ్ జాబ్స్, తాత్విక్ బ్యూటీ అండ్ వెల్‌నెస్, ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఎన్ఏఐ), ఎక్సెల్ ఐఆర్, జీయూవీఐ, హెచ్‌ఈఆర్‌ఈ టెక్నాలజీస్ సంస్థలతో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఒప్పందాలు కుదుర్చుకుంది. కార్యక్రమంలో కియా మోటార్స్ సీఏవో లీ, మహారాష్ట్ర స్టేట్ స్కిల్ వర్సిటీ వీసీ అపూర్వ పాల్కర్, సీడాప్ సీఈవో శ్రీనివాసులు, ఏపీ కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు ఆశ చూపి
వ్యభిచార రొంపిలోకి..

- బాలికపై లైంగికదాడి.. ఇద్దరు వీఆర్వోలపై పోక్సో కేసు
- మరో ముగ్గురిపైనా.. నిడదవోలులో ఘటన

నిడదవోలు, ఫిబ్రవరి 9: డబ్బులిస్తామని చెప్పి ఇద్దరు వీఆర్వోలు ఓ బాలికను శారీరకంగా అనుభవించిన ఘటనపై పోక్సో చట్టం కింద శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన బాలిక(14) తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో తెలిసిన వారింటికి వచ్చింది. ఆ బాలికకు డబ్బులు ఆశచూపి నిడదవోలుకు చెందిన షేక్ అఖిలాండేశ్వరి, బండారి లలిత, దాడిశెట్టి దుర్గారావు అనేవారు వ్యభిచార కూపంలోకి దింపారు. ఈ క్రమంలో నిడదవోలు మండలంలో గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేస్తున్న పార్ల వెంకట్రావు, ఇంజేటి చిట్టిబాబుల వద్దకు గురువారం రాత్రి దుర్గారావు బేరం మాట్లాడి బాలికను పంపాడు. ఆ బాలికను వారిద్దరూ గురువారం రాత్రి శారీరకంగా అనుభవించారు. తర్వాత బాలికను స్థానిక గణేష్‌చౌక్ సెంటర్‌లో దింపేందుకు వీఆర్వో చిట్టిబాబు వెళ్లాడు. అక్కడ ముందుగా మాట్లాడుకున్న మేరకు డబ్బులు ఇవ్వకపోవడంతో వీఆర్వో చిట్టిబాబుపై దుర్గారావు, మరికొంతమంది దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో బాలిక ఫిర్యాదు మేరకు ఆమెను వ్యభిచార కూపంలోకి దింపిన ముగ్గురు దళారులతోపాటు, అత్యాచారం చేసిన ఇద్దరు వీఆర్వోలపై పోలీసులు పోక్సో తదితర చట్టాల కింద కేసులు నమోదు చేశారు. అలాగే తమపై దాడిచేసి, డబ్బు లాక్కొని.. కులం పేరిట దూషించారంటూ వీఆర్వో చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. దుర్గారావుతోపాటు మరికొంతమందిపైన కేసులు నమోదైనట్లు నిడదవోలు ఎస్ఐ పులపా అప్పారావు తెలిపారు.

డోన్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కాలేజీకి అనుమతి

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా డోన్‌లో కొత్త వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీకి అనుమతించిన ప్రభుత్వం తాజాగా హార్టికల్చర్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కాలేజీని మంజూరు చేసింది. ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉద్యాన పంటల్లో రైతుకు ఆదాయం సమకూర్చే పరిజ్ఞానాన్ని అందించే డిప్లొమా కోర్సుతో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఏపీపీఎస్సీ సభ్యునిగా సిద్ధం శివరామ్

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యునిగా సిద్ధం శివరామ్ నియమితులయ్యారు. కమిషన్‌లో ప్రస్తుతం ఉన్న ఖాళీలో ఆయన నియామకాన్ని నోటిఫై చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

అధికార, ప్రతిపక్షాల తీరు సిగ్గుచేటు: వామపక్షాలు

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ నేతలు కనుసైగ చేస్తే చాలు.. ఢిల్లీలో వాలిపోతున్న రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల తీరు సిగ్గుచేటని వామపక్షాలు విమర్శించాయి. సీపీఐ, సీపీఎం రాష్ట్ర నాయకులు శుక్రవారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో సమావేశమయ్యారు. దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై చర్చించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని వ్యతిరేకించే లౌకిక పార్టీలతో కలిసి పోరాడాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం రెండు పార్టీల రాష్ట్ర నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'దేశంలోని ఏ రాష్ట్రంలో చూసినా అధికార పార్టీ ఒకవైపున ఉంటే.. ప్రతిపక్ష పార్టీలు మరోవైపున ఉంటున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లోని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పిలిచినా, పిలవకపోయినా ఢిల్లీకి పరిగెత్తుతున్నారు. ఇలాంటి దుర్గతి రాష్ట్ర రాజకీయాల్లో ఏనాడూ చూడలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ, అమిత్‌షాలు వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్ష పార్టీల నేతలు బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి ఎన్డీఏలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారు. అమిత్‌షాతో పగలు ఒకరు, రాత్రి మరొకరు చర్చలు జరుపుతూ సిగ్గులేకుండా చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బీజేపీకి ఏవిధంగా వత్తాసు పలుకుతున్నారో వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల నేతలు సమాధానం చెప్పాలి. టీడీపీ ఎన్డీయేలో చేరడం ద్వారా తన మరణశాసనాన్ని తానే రాసుకుంది' అని విమర్శించారు. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు, డి.రమాదేవి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మొబైల్‌ని అతిగా ఉపయోగిస్తే
కీళ్ళు, మోకాలు నొప్పులు!



మొబైల్‌ని అతిగా వీక్షిస్తే మెడ నొప్పి ఖాయమని అందరికీ తెలిసిందే. తాజాగా జరిపిన సర్వేలో మోకాళ్ళ నొప్పికి తోడు జాయింట్స్ పెయిన్ కూడా వస్తోందని తేలింది. మొబైల్‌ని అతిగా వాడకం వల్ల కండరాలకు సంబంధించిన ఇబ్బందులు తప్పవని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయమై ఎన్‌బిహెచ్ నిర్వహించిన సర్వే వివరాలను 'ఫోన్ ఎరీనా' బైటపెట్టింది. అతిగా ఫోన్ వినియోగానికి మోకాళ్ళు, జాయింట్స్ నొప్పులకు సంబంధం ఉందని ఆ పరిశోధనలో ఆశ్చర్యకరంగా బైటపడింది. స్మార్ట్ ఫోన్‌ను ఎక్కువ సేపు వినియోగిస్తే బాడీ వెయిట్ షిఫ్ట్ అవుతుంది. అది మోకాళ్ళపై ఒత్తిడిని కలుగజేస్తుందని పరిశోధనలో పాల్గొన్న టెక్నాలజీ నిపుణుడు ఒకరు తెలిపారు. ఒక దగ్గర కూర్చుని ఫోన్ చూస్తూ ఉంటారు. అంటే శరీరానికి తోడు కండరాల కదలిక నియంత్రణలోకి వెళతాయి. అంతిమంగా అది మోకాళ్ళ నొప్పులకు దారితీస్తుందని ఆయన వివరించారు. జాయింట్స్ కండరాలను కదుపుతూ ఉండాలి. అదే ఫ్లెక్సిబిలిటీ మెరుగుదలకు దోహదపడుతుంది. స్మార్ట్‌ఫోన్ వీక్షణ అందుకు వ్యతిరేకంగా ఉంటుంది. అలాగే ఈ సందర్భాల్లో మనిషి పొజిషన్ సక్రమంగా ఉండదు. అంటే పడుకొని, ఒకపక్కకు వేలాడి ఒదిగి ఉండటంతో శారీరక ఇబ్బందులు తలెత్తుతాయి. కదలిక లేనందున బరువు పెరిగే అవకాశం ఎక్కువ. అది మరిన్ని సమస్యలకు కారణమవుతుంది. మొత్తమ్మీద రోజుకు నాలుగు గంటలకు మించి డివైజ్ వీక్షణలో గడిపితే ఆరోగ్యపరంగా ఇబ్బందులు తప్పవని పరిశోధనలో తేలింది.



గూగుల్ మ్యాప్స్‌లో వెదర్ రిపోర్ట్

గూగుల్ మ్యాప్స్‌ను ఉపయోగించే ఆండ్రాయిడ్ డివైజ్‌ల్లో మరో వెసులుబాటు రానుంది. మ్యాప్ బ్రౌజర్లోనే వాతావరణ పరిస్థితులను యూజర్లు తెలుసుకోవచ్చు. ఈ అప్డేట్ విడుదల ఆరంభమైందని '9టు5గూగుల్' తెలిపింది. ఇదో సర్వర్ సైడ్ అప్డేట్. లేటెస్ట్ వెర్షన్‌కు వెళితేనే సదరు సౌలభ్యం సమకూరుతుంది. ఐఓఎస్ యూజర్లకు చాలాకాలంగా ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. మ్యాప్ బ్రౌజర్‌లోని ఎడమవైపు కార్నర్‌లో ఒక చిన్న బాక్స్ ఉంటుంది. అందులో వాతావరణానికి సంబంధించిన తాజా వివరాలు కనిపిస్తాయి. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సైతం అప్పుడప్పుడు ప్రత్యక్షమవుతుంది. బాక్స్‌పై టాప్ చేస్తే వివరాలు పెద్ద స్థాయిలో చూడవచ్చు. తాజా ఫోర్‌కాస్ట్‌కు తోడు ఉష్ణోగ్రతలు, ఎయిర్ క్వాలిటీ తదితర సమాచారాన్ని దీంతో పొందవచ్చు. రాబోయే రోజుల్లో ఇండియా కేంద్రంగా పలు ఫీచర్లను ప్రవేశపెట్టనున్నట్టు గూగుల్ ఇటీవల ప్రకటించింది.

రెడ్‌మి 5 బడ్స్ విడుదల ఎల్లుండే

షావోమీ సబ్ బ్రాండ్ రెడ్‌మి సరికొత్త ఇయర్‌బడ్స్‌ని ఈ నెల 12న ఇండియాలో విడుదల చేస్తోంది. 'రెడ్‌మి బడ్స్ 5' పేరిట ఇవి మార్కెట్లోకి వస్తున్నాయి. చైనాలో గత ఏడాదే వీటిని రిలీజ్ చేశారు. తాజాగా తీసుకువస్తున్న ఆడియో వేరబుల్స్‌ని 'సూపర్‌బడ్స్' పేరిట కంపెనీ ప్రమోట్ చేస్తోంది. రెడ్‌మి బడ్స్ 5ని అమెజాన్.ఇన్‌లో లిస్ట్ చేశారు. 'నోటిఫై మి' అంటూ వచ్చింది. దీని ధర చైనాలో సుమారుగా రూ.2300



కాగా ఇండియాలో దీని ధర ఇంకా వెల్లడి కాలేదు. గ్లోబల్ మార్కెట్లలో దాదాపుగా రూ.4,000కి లిస్ట్ చేశారు. ఈ ఇయర్ బడ్స్‌కి 12.4ఎంఎం టిటానియం డ్రైవర్స్ ఉన్నాయి. హైబ్రిడ్ ఏఎన్‌సీ 46 డెసిబిల్స్ వరకు ఉంది. అది బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే శబ్దాలను తగ్గిస్తుంది. ఆడియో అనుభవం బాగుంటుంది. వేర్వేరు మూడ్స్, కంటెంట్‌కు అనుగుణంగా మల్టిపుల్ సౌండ్ మోడ్స్ ఇందులో ఉన్నాయి. డ్యూయల్ డివైజ్ పెయిరింగ్ వంటి ఫీచర్లు సరేసరి. కాలింగ్ ఎక్స్‌పీరియెన్స్ బాగుంటుంది. పూర్తి బ్యాటరీ లైఫ్ 38 గంటలు.

SAMSUNG

ఈ గెలాక్సీ ఫోన్లకు అప్డేట్స్ కట్



గెలాక్సీ ఎస్24 సిరీస్‌ను తాజాగా తీసుకువచ్చిన శాంసంగ్, కొన్ని పాత ఆండ్రాయిడ్ ఉత్పత్తులకు అప్డేట్స్‌ను ఆపేసింది. గెలాక్సీ 51 సహా మరికొన్ని ఈ అప్డేట్ కట్ అయిన వాటిలో ఉన్నాయి. శాంసంగ్ సాఫ్ట్‌వేర్ అప్డేట్ పాలసీ ప్రకారం రిలీజ్ చేసిన వాటికి నాలుగేళ్ళు ఆండ్రాయిడ్ అప్డేట్స్ ఉంటాయి. అదేవిధంగా అయిదేళ్ళ పాటు సెక్యూరిటీ ప్యాచెస్ కూడా విడుదల అవుతాయి. 2021కి ముందు ఇది మూడు, నాలుగు సంవత్సరాలుగా ఉండేది. ఆ క్రమంలో తాజాగా అప్డేట్స్ నుంచి తొలగించిన వాటిలో గెలాక్సీ ఎ01, గెలాక్సీ ఎ51, గెలాక్సీ ట్యాబ్ ఎస్6 5జి, గెలాక్సీ డబ్ల్యు20 5జి ఉన్నాయి. గెలాక్సీ ఎ51 ఆదరణ పొందిన బంచ్. 2020లో రిలీజ్ అయింది. గెలాక్సీ ట్యాబ్ ఎస్6 5జి కొద్దిగా పాత టాబ్లెట్. గెలాక్సీ ఎ03, గెలాక్సీ ట్యాబ్ ఎ8ని క్వార్టర్లీ నుంచి ఏడాదికి రెండు మార్లు అప్డేట్‌కి మార్చారు. గెలాక్సీ ఎస్24 సిరీస్, ఎక్స్‌కవర్ 7, గెలాక్సీ ట్యాబ్ యాక్టివ్ 5 కి మాత్రం నెలవారీ ప్రాతిపదికను సపోర్టు అందుతూ ఉంటుంది.

టెలిగ్రామ్‌లో కొత్త ఫీచర్లు

అప్డేట్



టెలిగ్రామ్ తాజా అప్డేట్‌తో కొత్త ఫీచర్లను జతచేసింది. అందులో గుర్తించదగ్గది సేవ్డ్ మెసేజెస్ 2.0 దీనితో సేవ్ చేసిన టెక్స్ట్, మీడియా, లింకులను యూజర్లు ఫిల్టర్ లేదా కస్టమైజ్ చేయవచ్చు. అదేవిధంగా టైమ్ వాయిస్, వీడియో మెసేజ్‌లు, రికార్డింగ్ అయిన వాటిని ఆపుకోవడం, ముందుకు పంపేయడం. ప్రైవేటు చాట్స్‌లో రీడ్ టైమ్, షేర్డ్ కాంటాక్టులకు కొత్త డిజైన్ తదితరాలు ఉన్నాయి. టెలిగ్రామ్ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లు రెంటికీ ఈ అప్డేట్‌ని రోలింగ్ చేస్తున్నారు.

సేవ్డ్ మెసేజెస్ 2.0తో టెక్స్ట్, మీడియా, లింకులను చాలా సులువుగా ఫార్వార్డ్ చేయవచ్చు. కొత్త అప్డేట్ ప్రకారం సేవ్డ్ మెసేజెస్‌ను చాట్స్‌గా యూజర్లు చూడవచ్చు. విడిగా చాట్ విండోతో వాటిని ఫార్వర్డ్ చేయవచ్చు. ప్రతీది ప్రత్యేకించి కాంటాక్ట్, గ్రూప్ లేదా చానల్ నుంచి సేవ్ అవుతుంది. అలాగే యూజర్లు ఏ చాట్‌నైనా పిన్ చేసి టాప్‌లో ఉంచొచ్చు. ఇందుకోసం 'సేవ్డ్ మెసేజెస్'ని క్లిక్ చేయాలి. అక్కడ ఉండే టైటిల్ స్పేస్‌ను టాప్ చేయాలి. అంతే, ఆటోమేటిక్‌గా చాట్స్‌లోకి తీసుకెళుతుంది. వెర్టికల్ త్రీ డాట్స్‌పై టాప్ చేసి 'వ్యూ యాజ్ మెసేజెస్' లేదా 'వ్యూ యాజ్ చాట్స్'ను సెలెక్ట్ చేసుకోవడం మరో పద్ధతి. సేవ్డ్ మెసేజెస్‌కు టాగ్స్ జతచేయవచ్చు. అందుకు ఎమోజీలను ఉపయోగించవచ్చు. ఎమోజీని ఒకసారి కలిపితే చాలు, అదే ట్యాగ్ కోసం సేవ్డ్ మెసేజ్‌ని ఫిల్టర్ చేస్తుంది. చేయాల్సిందల్లా ఎమోజీతో స్పందించడమే. షేర్డ్ మీడియా రియాక్షన్ మరొకటి. టెలిగ్రామ్ చాట్, గ్రూప్, చానల్ దీంతోనే ఉంటాయి. ఇమేజెస్, డాక్యుమెంట్స్, లింక్స్‌ను చాలా వేగంగా చూసుకుంటూ వెళ్ళవచ్చు. ఈ సెక్షన్ తాజా అప్డేట్‌తో సేవ్డ్ మెసేజెస్‌ను చూపుతుంది. వన్ టైమ్ వాయిస్, వీడియో మెసేజెస్ మరొకటి. ఒకసారి వినగానే లేదా ప్లే చేయగానే ఇవి ఆటోమేటిక్‌గా అదృశ్యమవుతాయి. ఎవరికైనా పంపేందుకు రికార్డ్ బటన్‌ని యూజర్లు లాగ్ ప్రెస్ చేయాలి. వాటిని లాక్ చేసేందుకు స్వైప్ చేయాలి. ఆపై 'వన్ టైమ్ ఐకాన్'ని ప్రెస్ చేస్తే ఆ ఫీచర్ అందుబాటులోకి వస్తుంది. వీడియోస్ విషయంలోనూ ఇదే పద్ధతిని పాటించాలి. రికార్డింగ్స్ పాజ్, రెజ్యూమ్ కోసం లాంగ్ ప్రెస్ చేయాలి. ఆపై రికార్డ్ బటన్, తదుపరి పాజ్ బటన్‌ను ప్రెస్ చేయాలి. రియల్ టైమ్ ఇన్ ప్రైవేట్ చాట్స్ విషయానికి వస్తే పంపిన మెసేజ్‌లపై ఒక చెక్ మార్క్ కనిపిస్తుంది. అంటే డెలివరీ అయినప్పటికీ చూడలేదని అర్థం. రెండు అయితే చదివినట్టు లెక్క. రీడ్ టైమ్ అంటే సరిగ్గా అందుకున్న వ్యక్తి ఎప్పుడు చదివారు అన్నది తెలుసుకోవచ్చు. అయితే ప్రైవసీ సెట్టింగ్స్‌తో రిసీవర్ ఆ విషయాన్ని దాచిపెట్టవచ్చు. రీడ్ టైమ్ మెసేజ్‌లు కేవలం ఏడు రోజులు మాత్రమే కనిపిస్తాయి. షేర్డ్ కాంటాక్ట్‌లకు సంబంధించి అక్టోబరులోనే టెలిగ్రామ్ - న్యూడిజైన్‌ను ప్రీమియం యూజర్లకు పరిచయం చేసింది. దాంతో కాంటాక్ట్ కార్డును ప్రీమియర్ యూజర్లు రూపొందించుకోవచ్చు. అదే కస్టమైజేషన్‌ను చూపుతుంది.

ఐఫోన్ 16లో 'కాప్చర్ బటన్'!



యాపిల్ ఐఫోన్ 16లో సరికొత్తగా 'కాప్చర్ బటన్' వస్తోంది. అసలు విషయానికి వస్తే యాపిల్ ప్రస్తుతం ఐఫోన్ 16పై పనిచేస్తోంది. ఈ ఏడాది రెండో సగంలో ఐఫోన్ 16 విడుదల అవుతుందని కూడా భావిస్తున్నారు. ఆ క్రమంలోనే విశ్లేషకులు, టిప్‌స్టర్స్ పలు సంగతులను లీక్ చేస్తున్నారు. అలా బైటకు వచ్చిన విశేషాల్లో కాప్చర్ బటన్ ఒకటి. ఫోన్‌లోని కెమెరా ఫంక్షనాలిటీలోనే పలు మార్పులకు ఇది దారితీస్తుందని అంటున్నారు. వీడియోలను రికార్డ్ చేసుకునేందుకు ఈ బటన్ ఉపయోగపడుతుందని విశ్లేషకుడు ఒకరు తెలిపారు. లైట్ ప్రెస్‌తో ఇమేజ్‌లు, వీడియోలను బంధించవచ్చు. డీఎస్ఎల్ఆర్‌ఓ, మిర్రర్‌లెస్ కెమెరాల్లో ఈ ఫీచర్లు ఉంటాయని చెబుతున్నారు. మొత్తానికి ఈ చర్యలన్నీ ఐఫోన్‌లో ఫొటోగ్రఫీ అనుభవాన్ని మెరుగుపర్చేందుకేనని అంటున్నారు. ఇంతకుమునుపే ఐఫోన్ 16 ప్రొటోటైప్ లీకైంది. ఆ క్రమంలో ఈ బటన్ కుడివైపు దిగువన ఉండొచ్చని భావిస్తున్నారు.

'మొజిల్లా' నుంచి సబ్‌స్క్రిప్షన్ సర్వీస్

మొజిల్లా తాజాగా సబ్‌స్క్రిప్షన్ మోడల్ 'మొజిల్లా మానిటర్ ప్లస్'ని పరిచయం చేసింది. డేటా బ్రోకర్ సైట్స్ నుంచి రక్షణకు దీనిని ఉద్దేశించారు. అందులో భాగంగా డేటా రిమూవల్ అభ్యర్థనలను, నెలవారీ స్కాన్స్‌ని అనుమతిస్తుంది. తద్వారా యూజర్ల పర్సనల్ సమాచారం తస్కరణకు గురికాకుండా చూస్తుంది. 2002లో ఆరంభమైన మొజిల్లా ఫైర్‌ఫాక్స్‌కు యూజర్ల ఆదరణ బాగుంది. ప్రైవసీ విషయంలోనూ కట్టుదిట్టంగా వ్యవహరిస్తుంది. ఈ నేపథ్యంలో ఇంతవరకు ఫ్రీ సర్వీస్‌గా ఉన్న మొజిల్లా మానిటర్‌ను పెయిడ్ పద్ధతికి మార్చింది. దీంట్లో చేరిన యూజర్ల వ్యక్తిగత సమాచారం బ్రోకర్ వెబ్‌సైట్స్‌లో కనిపిస్తే ఆటోమేటిక్‌గా తొలగిస్తుంది. ఒకసారి ఫ్రీ స్కాన్‌కు అనుమతిస్తోంది. సంబంధిత వివరాలను అందిస్తే అందుకు సరిపోతుంది. అదే నిరంతరంగా చెక్ కావాలని అనుకుంటే మాత్రం మొజిల్లా మానిటర్ ప్లస్ కింద నెలకు 8.99 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ సబ్‌స్క్రిప్షన్ సర్వీస్ ప్రస్తుతానికి అమెరికాకు మాత్రమే పరిమితం.

ప్రొడక్ట్

ప్రతీవారు ఇప్పుడు స్మార్ట్ వాచీ కావాలనే ఆలోచనల్లో ఉన్నారు. మొబైల్‌తో సమకూరే సదుపాయాలు ఇప్పుడు స్మార్ట్ వాచీల్లోనూ ఉండడంతో ఈ ఆలోచన మరింత పెరుగుతోంది. బ్యాటరీ చార్జింగ్, జీవితకాలం నుంచి ఆరోగ్యం సహా వేర్వేరు ఫీచర్లతో నేడు స్మార్ట్ వాచీలు లభ్యమవుతున్నాయి. సొంతంగా ఉపయోగించుకునేందుకే కాకుండా, వివిధ సందర్భాల్లో బహుమతులుగా ఇచ్చేందుకు ఉపయోగపడే స్మార్ట్ వాచీలు ఇవి. స్టయిల్‌గా ఉండటమే కాదు, మంచి ఫీచర్లు ఉన్న వాచీలు.

యాపిల్ వాచీ అల్ట్రా 2: గత ఏడాది చివర్లో కన్నులపండువగా జరిగిన ఈవెంట్‌లో విడుదలైంది. ఎస్9 చిప్ పవర్, వాచ్‌ఓఎస్ 10కి తోడు సరికొత్త 4-కోర్ న్యూట్రల్ ఇంజిన్‌తో ఇది వచ్చింది. సదరు ఇంజిన్ - మెషీన్ లెర్నింగ్ టాస్క్‌లను ఒరిజినల్ యాపిల్ వాచ్ అల్ట్రాతో పోల్చుకుంటే రెండింతలు ఎక్కువగా చేపట్టగలదు. 1.92 ఇంచీల రెటీనా ఎల్‌టీపీఓ ఓలెడ్ డిస్‌ప్లే ఉంది. 3000 నిట్స్ మేరకు పీక్ బ్రైట్‌నెస్ ఉంది. మొదటితరం అల్ట్రా వాచీలతో పోల్చుకుంటే 50 శాతం ఎక్కువ. డిజిటల్ క్రౌన్‌తో ఇన్-డిస్‌ప్లే ఫ్లాష్‌లైట్‌ను మెరుగుపర్చారు. దాంతో బ్రైట్‌నెస్ రెండింతలైంది. ఇందులో ఉన్న ఆన్-డివైజ్ 'సిరి'తో హెల్త్ డేటాను పొందవచ్చు. వర్కౌట్ లేదంటే టైమ్ సెట్టింగ్ కోసం ఇంటర్నెట్ అవసరం ఉండదు. బ్లూటూత్ కాలింగ్ సదుపాయం ఉంది. వాటర్ రెసిస్టెన్స్ 5 ఏటీఎం. బ్యాటరీ లైఫ్ 36 గంటల మేర ఉంటుంది.

స్మార్ట్ వాచీలు ఓ లుక్ వేయండి



శాంసంగ్ గెలాక్సీ వాచీ 6: రెండు వేర్వేరు సైజులు 40ఎంఎం, 44ఎంఎంలలో లభ్యమవుతోంది. ఆండ్రాయిడ్ 10 వెర్షన్‌పై రన్ అవుతోంది. 1.5 జీబీ మెమరీ ఉంది. హార్ట్ రిథమ్ నోటిఫికేషన్ సదుపాయం సహా పలు హెల్త్ ఫీచర్లు ఇందులో ఉన్నాయి. డిజిటల్ పేమెంట్స్ కోసం శాంసంగ్ వ్యాలెట్ ఉంది. స్కిన్ టెంపరేచర్ ట్రాకింగ్, మెనుస్ట్రల్ సైకిల్ ట్రాకింగ్, ఫాల్ డిటెక్షన్ తదితరాలు కూడా ఉన్నాయి. 1.3 ఇంచీలు/1.5 ఇంచీల సూపర్ అమోల్డ్ డిస్‌ప్లే, వాటర్ రెసిస్టెన్స్ 5 ఏటీఎం, 40 గంటల మేర బ్యాటరీ లైఫ్ దీనికి ఉన్న ఫీచర్లలో మరికొన్ని.

జెమిని ఫోర్‌రన్నర్ 255: 1.3 ఇంచీల ట్రాన్స్‌ఫ్లెక్టివ్ మెమరీ-ఇన్-పిక్సెల్‌కు తోడు 260 x 260 పిక్సెల్స్ డెన్సిటీ ఉంది. వాచీ టాప్‌లో కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ఉంది. 6 ఏటీఎం రేటింగ్‌తో వాటర్ రెసిస్టెన్స్ ఉంది. ఇంటెన్స్‌గా వ్యాయామం చేస్తున్న సమయంలో డ్యామేజ్‌కు ఆస్కారం లేదు. మూడు ఎడమ, రెండు కుడివైపు మొత్తమ్మీద ఫైవ్ బటన్ కాన్ఫిగరేషన్ ఉంది. ఫిట్‌నెస్, హెల్త్ ఫీచర్లు సరేసరి. బ్యాటరీ లైఫ్ 14 రోజులు.

ఫాజిల్ జనరేషన్ 6: లేటెస్ట్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్లతో సానుకూలత ఈ వాచీ సొంతం. గో ఎడిషన్, గూగుల్ ప్లే స్టోర్ సదుపాయం మాత్రం లేవు. అరగంట చార్జింగ్‌లో 80 శాతం మేర ఫుల్ అవుతుంది. యూఎస్‌బీ డేటా కేబుల్ ఉంది. దానికి ఉన్న మేగ్నెటిక్ డాక్ సాయంతో వాచీ వెనక స్విట్ రింగులు సులువుగా అటాచ్ అవుతాయి. 1.28 ఇంచీల, అమోల్డ్ డిస్‌ప్లే ఉంది. వాటర్ రెసిస్టెన్స్ 3 ఏటీఎం కాగా, బ్లూటూత్ కాలింగ్ సదుపాయం ఉంది. బ్యాటరీ లైఫ్ 24 గంటలు.

యాపిల్ వాచ్ సిరీస్ 9: ఎస్9 చిప్‌సెట్ పవర్‌కు తోడు 41ఎంఎం, 45ఎంఎం సైజుల్లో వచ్చింది. పెద్ద ఎత్తున హెల్త్ ఫీచర్లు ఉన్నాయి. 'సిరి'ని అడిగి హార్ట్ రేటు తదితరాలను తెలుసుకోవచ్చు. 1.69 ఇంచీలు/ 1.9 ఇంచీలు, రెటీనా ఎల్‌టీపీఓ ఓలెడ్‌కు తోడు 5 ఏటీఎం రెసిస్టెన్స్ ఉన్నాయి. బ్యాటరీ లైఫ్ 18 గంటలు.



మ్యాప్స్‌తో మ్యాజిక్



పోయిన వస్తువు దొరికింది అంటే అంతకుమించిన సంతోషం ఉండదు. అదే సెల్‌ఫోన్ అయితే మరింత ఆనందం. ఎందుకంటే ఫోన్‌లో వ్యక్తుల సమస్త సమాచారం నిక్షిప్తమై ఉంటోంది. డబ్బు, సమయంతోపాటు ఎన్నో మెమొరీలను పోగొట్టుకోవాల్సి వస్తుంది. ఒక తండ్రి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను, టెక్నాలజీ ఉపయోగించి అతని కుమారుడు ఇలా పట్టేశాడు.

సెల్‌ఫోన్
అలా పోయింది... ఇలా పట్టేశారు!

షేర్ లొకేషన్‌కు ఉపయోగపడే గూగుల్ మ్యాప్ ఇందుకు ఉపయోగపడింది. తమిళనాడులో ఈ సంఘటన చోటుచేసుకుంది. రైలులో ప్రయాణిస్తున్న పెద్దాయన దగ్గర్నుంచి బ్యాగ్ కొట్టేశాడు ఒకడు. పక్కన ఉన్న వాళ్ల ఫోన్‌తో తన కొడుకుకు ఆ విషయాన్ని తెలియజేశాడు ఆ పెద్దాయన. స్నేహితుడితో కలిసి రంగంలోకి దిగిన ఆ కొడుకు గూగుల్ మ్యాప్ సహాయంతో ఫోన్ ఎక్కడ ఉందన్నది కనుగొన్నాడు. ఈ విషయాన్ని కుమారుడు తన 'ఎక్స్'(ట్విట్టర్)లో పంచుకున్నాడు. మొబైల్‌ను తస్కరించిన వ్యక్తి దానిని స్విచ్ఛాఫ్ చేయకపోవడంతో కొడుకు పని చాలా సులువు అయింది. తమిళనాడులోని నాగర్ కోయిల్ నుంచి ట్రిచ్చి వెళ్లే లోపు దొంగ ఆ ఫోన్‌ను కొట్టేశాడు. ఆ తరవాత మరో ట్రైన్‌లో నాగర్ కోయిల్‌కు తిరుగు ప్రయాణం అయ్యాడు. లొకేషన్ షేరింగ్‌ను ఎనేబుల్ చేసి ట్రాక్ చేయగా ట్రైన్ ట్రాక్ వెంట వెళుతున్నట్లు కనిపించింది. దీంతో అతను తిరుగు ప్రయాణంలో ట్రైన్‌లోనే ఉన్నాడని భావించిన కుమారుడు దానిని ఫాలో అయ్యాడు. దీంతో దొంగకు దగ్గరగా అంటే రెండు మీటర్ల చెంతకు వెళ్ళగలిగాడు. తండ్రి బ్యాగ్‌తో సహా ఫోన్‌ను దొంగ తస్కరించడంతో కుమారుడి పని మరింత సులువు అయింది. తండ్రి సీఐటీయూ యూనియన్ యాక్టివిస్ట్. బ్యాగ్‌పై సీఐటీయూ లోగో ఉంది. దొంగ ఆ బ్యాగ్ అలానే చేతిలో పట్టుకుని ఉండడంతో దాని సహాయంతో అతనిని గుర్తించగలిగాడు. అంతే వెంటనే అతనిని పట్టుకుని పోలీసులకు అప్పగించి, మొబైల్‌ను తిరిగి సంపాదించగలిగాడు.

ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఏమంటే పోలీసుల ఇంటరాగేషన్‌లో ఆ దొంగ చేసిన దొంగతనాలు అన్నీ బయటకు వచ్చాయి. సెల్‌ఫోన్ చార్జర్, బ్లూటూత్ ఇయర్ ఫోన్లు, లాక్ కీ, ట్రైన్ చెయిన్ తదితరాలను అతన్నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మ్యాప్స్‌లో లొకేషన్ షేరింగ్

- మ్యాప్స్ యాప్ ఓపెన్ చేసి ప్రొఫైల్ పిక్చర్ దగ్గరకు వెళ్ళాలి. దాన్ని టాప్ చేయాలి. లొకేషన్ షేరింగ్ ఆప్షన్‌ను టాప్ చేయాలి.
- అక్కడ పలువురితో లొకేషన్ షేర్ చేసుకునేందుకు ఆప్షన్ కనిపిస్తుంది. అవసరమైనంత సమయం మేర షేర్ లొకేషన్‌ను చేసుకోవచ్చు.
- షేర్‌ను టాప్ చేస్తే చాలు, షేరింగ్ ప్రక్రియ ఆరంభమవుతుంది.
- లొకేషన్‌కు తోడు పేరు, ఫొటో, డివైజ్ బ్యాటరీ పవర్, అరైవల్ - డిపార్చర్ టైమ్‌ను కూడా షేర్ చేసుకోవచ్చు.



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శనివారం 10 ఫిబ్రవరి 2024

మౌలానా ఆజాద్ వర్సిటీలో పార్ట్ టైమ్ పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మనూ) - పార్ట్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ 2023-24 వింటర్ సెషన్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్పాన్సర్డ్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీర్‌లు, సైంటిస్ట్‌లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, మేనేజీరియల్ స్టాఫ్, స్టార్టప్ ప్రమోటర్స్, అకడమిక్ అడ్మినిస్ట్రేటర్లు, టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్(ఆర్‌ఏటీ), డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయవచ్చు. స్కాలర్‌షిప్ సౌకర్యం లేదు.

విభాగాలు-సీట్లు: మేనేజ్‌మెంట్ విభాగాల్లో 9, కామర్స్ విభాగాల్లో 6, సైన్సెస్ విభాగాల్లో 21, టెక్నాలజీ విభాగాల్లో 4, ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ విభాగాల్లో 38, దక్కన్ స్టడీస్ విభాగాల్లో 5, సోషల్ సైన్సెస్ విభాగాల్లో 15, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగాల్లో 7 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దు ఒక సబ్జెక్ట్‌గాగానీ లేదా ఉర్దూ మీడియంలో గానీ చదివి ఉండాలి. లేదా మదర్సా కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఉర్దూ భాషకు సంబంధించి ఎటువంటి అర్హత లేనివారు థీసిస్ సబ్మిషన్ నాటికి వర్సిటీ అందించే రెండు క్రెడిట్ల ఉర్దూ కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది.

- విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. వర్సిటీ నిర్వహించే రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి. యూజీసీ/సీఎస్ఐఆర్/ ఇన్‌స్పైయిర్/ఐకార్/ఐసీహెచ్ఆర్/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్ లేదా రాజీవ్ గాంధీ ఫెలోషిప్ అవార్డ్/టీచర్ ఫెలోషిప్ పొందినవారు; నెట్/సెట్/స్లెట్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఎంఫిల్ అభ్యర్థులు ఆర్‌ఏటీ రాయనవసరం లేదు. దరఖాస్తు నాటికి సంబంధిత రంగంలో మూడేళ్ల అనుభవం ఉండాలి. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెయిటేజీ: యూజీసీ/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి, స్పాన్సర్డ్ అభ్యర్థులకు, రీసెర్చ్ సంస్థల్లో సైంటిస్ట్‌లకు 70 మార్కులు; నెట్/సెట్/స్లెట్/గేట్/ జీప్యాట్ అర్హత ఉన్నవారికి, ఇన్‌స్పైయిర్/రాజీవ్ గాంధీ తదితర ఫెలోషిప్‌లు ఉన్నవారికి 60 మార్కులు; ఎంఫిల్ అభ్యర్థులకు 50 మార్కుల వెయిటేజీ ఇస్తారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 18
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 28 నుంచి
- **రీసెర్చ్ అడ్మిషన్ టెస్ట్ తేదీ:** మార్చి 8
- **ఫైనల్ కీ విడుదల:** మార్చి 12
- **ఫలితాలు విడుదల:** మార్చి 15
- **ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్:** మార్చి 18, 19
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 22
- **ఇంటర్వ్యూలు:** మార్చి 27, 28
- **అడ్మిషన్స్:** ఏప్రిల్ 3, 4
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఏప్రిల్ 15 నుంచి
- **వెబ్‌సైట్:** manuu.edu.in

ఐఐపీఈలో షార్ట్ కోర్సు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ)కి చెందిన హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్(హెచ్&ఎస్) విభాగం- 'అప్లికేషన్స్ ఆఫ్ స్కాలర్ హైపర్‌బోలిక్ కన్జర్వేషన్ లాస్' అంశానికి సంబంధించి షార్ట్ కోర్సును అందిస్తోంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కోర్సు వ్యవధి అయిదు రోజులు. డిగ్రీ/పీజీ చేస్తున్న అభ్యర్థులు, రీసెర్చ్ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్, మేథమెటిక్స్/సంబంధిత విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందులో పార్టిసిపేట్ చేసినవారందరికి ఈ-సర్టిఫికెట్లు ఇస్తారు.

కోర్సులోని అంశాలు: ఈ కోర్సులో స్కాలర్ కన్జర్వేషన్ లాస్, ఫైనిట్ వాల్యూమ్ మెథడ్స్, ట్రాఫిక్ ఫ్లోస్ మోడల్స్, ఎల్‌డబ్ల్యూఆర్ మోడల్ ఆన్ నెట్‌వర్క్స్, మోడలింగ్ అండ్ థియరీ ఆఫ్ ట్రాఫిక్ ఫ్లో ఆన్ నెట్‌వర్క్స్, మైక్రో అండ్ మాక్రోస్కోపిక్ పిడెస్ట్రియన్ మోడల్స్, నాన్ లోకల్ ట్రాఫిక్ ఫ్లో మోడల్స్ తదితర అంశాలు వివరిస్తారు.

ముఖ్య సమాచారం

- **కోర్సు తేదీలు:** మార్చి 1 నుంచి 5 వరకు
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** డిగ్రీ/పీజీ విద్యార్థులకు రూ.354; రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.590; పోస్ట్ డాక్టోరల్ ఫెలో/ఫ్యాకల్టీ మెంబర్లకు రూ.1180
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.iipe.ac.in



నాగార్జున వర్సిటీలో డిస్టెన్స్ ప్రోగ్రామ్‌లు

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ) నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(సీడీఈ)- దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఏ, బీకాం, బీబీఏ, బీ లైబ్రరీ సైన్స్, ఎంఏ, ఎంకాం, ఎంఎస్‌డబ్ల్యు, ఎం లైబ్రరీ సైన్స్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు కూడా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిగ్రీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు చొప్పున ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఏని తెలుగు మాధ్యమంలో; బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీబీఏ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; బీకాం(జనరల్) కోర్సుని రెండు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- బీఏ సబ్జెక్టులు ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, హిస్టరీ, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ తెలుగు, బ్యాంకింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/ఇంటర్ ఒకేషనల్/ పన్నెండోతరగతి/ పాలిటెక్నిక్/ రెండేళ్ల ఐటీఐ ఉత్తీర్ణులైన వారు అప్లయ్ చేసుకోవచ్చు. ఏపీఓఎస్ఎస్, టీఓఎస్ఎస్, ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే.

పీజీ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్

ఎంకాం స్పెషలైజేషన్‌లు: అకౌంటెన్సీ, బ్యాంకింగ్

అర్హత: ఎంఏ ప్రోగ్రామ్‌లో లాంగ్వేజ్‌లు, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లకు సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. మిగిలినవాటికి ఏదేని డిగ్రీ పాసైతే చాలు. ఎంకాం ప్రోగ్రామ్‌నకు బీకాం/ బీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంఏ (ఇంగ్లీష్/జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; ఎంఏ(ఎకనామిక్స్/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ) ప్రోగ్రామ్‌లను తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు: బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఈ ప్రోగ్రామ్ ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఉత్తీర్ణులు అర్హులు. దీనిని కూడా ఆంగ్ల మాధ్యమంలోనే చదవాలి.

డిప్లొమా: కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో అందుబాటులో ఉంది. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- స్పెషలైజేషన్‌లు: ఫుడ్ ప్రొడక్షన్, సైకలాజికల్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్

సర్టిఫికెట్ కోర్సులు: ఒక్కో కోర్సు వ్యవధి ఏడాది. వీటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హోటల్ అండ్ హాస్పిటల్ హౌస్ కీపింగ్‌లో చేరాలంటే పదోతరగతి పాసై ఉండాలి.
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ హెచ్ఐవీ ఎయిడ్స్ కౌన్సెలింగ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్‌తోపాటు పారా మెడికల్ అర్హత ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.anucde.info

జాబ్ కార్నర్

ఐసీఎంఆర్‌లో టెక్నికల్ ఆఫీసర్లు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్.... రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 8

1. **టెక్నికల్ ఆఫీసర్-బి:** 1 పోస్టు
2. **టెక్నికల్ ఆఫీసర్-సి:** 7 పోస్టులు

విభాగాలు: బయోమెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ప్రోగ్రామర్, మెకానికల్/మెకట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు టెక్నికల్ ఆఫీసర్-బి పోస్టులకు రూ.56,100 - రూ.1,77,500; టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టులకు రూ.67,700 - రూ.2,08,700

వయోపరిమితి: టెక్నికల్ ఆఫీసర్-బి పోస్టులకు 35 ఏళ్లు; టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టులకు 45 సంవత్సరాలు మించకూడదు.

ఆన్‌లైన్ అప్లికేషన్‌కు చివరి తేదీ: మార్చి 8

వెబ్‌సైట్: https://main.icmr.nic.in/

బెల్‌లో డిప్యూటీ ఇంజనీర్లు

పుణెలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 9

పోస్టు: డిప్యూటీ ఇంజనీర్

విద్యార్హతలు: బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్, మెకానికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.40,000 - రూ.1,40,000

వయోపరిమితి: 27 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.472. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: https://bel-india.in/

కేంద్రీయ విద్యాలయ, ఘట్‌కేసర్‌లో టీచింగ్ స్టాఫ్

ఘట్‌కేసర్‌లోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ... కింద పేర్కొన్న టీచింగ్ స్టాఫ్ భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీల వివరాలు

1. **పీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మేథ్స్, సోషల్ సైన్స్, సైన్స్
2. **టీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మేథ్స్, సోషల్ సైన్స్, సైన్స్
3. పీఆర్‌టీ
4. కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, అకడమిక్ కౌన్సెలర్, స్పెషల్ ఎడ్యుకేటర్.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణత.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 15

వేదిక: పీఎంశ్రీ కేవీ, ఎన్ఎఫ్‌సీ నగర్, ఘట్‌కేసర్

వెబ్‌సైట్: https://ghatkesarnfc.kvs.ac.in/

ఎన్ఎఫ్‌సీ, హైదరాబాద్‌లో నర్స్ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత ప్రభుత్వ అణుశక్తి శాఖకు చెందిన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్ఎఫ్‌సీ)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 3

అర్హత: ఇంటర్, డిప్లొమా(నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ) లేదా బీఎస్సీ నర్సింగ్ లేదా నర్సింగ్ 'ఏ' సర్టిఫికెట్‌తో పాటు ఏడాది పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు రూ.63,660

ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి 21, 22

వేదిక: ఎన్ఎఫ్‌సీ గెస్ట్‌హౌస్(గురుకుల్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ దగ్గర, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://www.nfc.gov.in/

ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని బసాయిదరాపూర్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ... తాత్కాలిక ప్రాతిపతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు టీచింగ్/రీసెర్చ్ విభాగంలో పని అనుభవం తప్పనిసరి.

వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,22,543, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,47,986, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,27,141.

ప్రదేశం: డీన్ ఆఫీస్, 5వ ఫ్లోర్, ఎంఎస్ ఆఫీస్ బిల్డింగ్, ఈఎస్ఐ-పీజీఐఎమ్ఎస్ఆర్, బసాయిదరాపూర్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://esic.gov.in/

శ్రీ సత్యసాయి జిల్లాలో వివిధ ఖాళీలు

పుట్టపర్తిలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం...ఒప్పంద ప్రాతిపదికన శ్రీసత్యసాయి జిల్లాలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 13

ఖాళీలు: సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, కేస్ వర్కర్, పారా లీగల్ పర్సనల్ లాయర్, పారా మెడికల్ పర్సనల్, సైకో సోషల్ కౌన్సెలర్, ఆఫీస్ అసిస్టెంట్, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్.


అర్హత: హైస్కూల్, డిగ్రీ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 25 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను పుట్టపర్తిలోని జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో అందజేయాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 15

వెబ్‌సైట్: https://srisathyasai.ap.gov.in/



ఏపీలో మెడికల్ ఆఫీసర్లు

మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్... నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన రాష్ట్రంలోని టెలిమెడిసిన్ హబ్‌లలో పనిచేయడానికి దిగువ పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 12

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 42 సంవత్సరాలు మించకూడదు

వేతనం: నెలకు రూ.61,960

ఎంపిక ప్రక్రియ: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 10

వెబ్‌సైట్: http://apmsrb.ap.gov.in/msrb/


లిటిల్స్



చమత్కార వైద్యం

అనగనగా ఒక రాజ్యం. మల్లుడు అనే రాజు ఉండేవాడు. ఆహారం అతిగా తినేవాడు. మితి మించి తిన్నా ఇబ్బందులే అనే విషయం తెలిసి కూడా విపరీతంగా తినేవాడు. తిండి ప్రియుడు కావటం, అది కూడా రాజు కావటంతో ఎవరూ అడ్డు చెప్పలేకపోయారు. పైగా వ్యాయామాలు చేయని సోమరి. దీంతో ఆ రాజు బరువు పెరిగాడు. వంద కేజీలు దాటి పెరిగాడు. అంతటి భారీ శరీరం తనకు ఇబ్బందయింది. అయినా తినటం ఆపలేదు. ఇలాగయితే కష్టం.. రాజంటే సన్నగా ఉండాలి. అప్పుడే చురుగ్గా ఉండగలవు.. అని తన గురువు సెలవిచ్చాడు. రాజు ఏమాత్రం ఆలోచించకుండా తాను బరువు తగ్గాలని నిర్ణయించుకున్నాడు.

ఒక రోజు వైద్యులంతా రాజుగారి దగ్గరకు రావాలని చాటింపు ఇప్పించాడు. వైద్యులంతా సభకు వచ్చారు. వెంటనే రాజుగారు ఇలా అన్నారు. 'నేను సన్నబడటానికి మందులు ఏమైనా ఇప్పించండి. నేను బరువు తగ్గిన వెంటనే వారికి వెయ్యి వరహాలు ఇస్తాను' అన్నాడు. వైద్యులంతా ఆశ్చర్యపోయారు. 'అంతేనా మహాప్రభూ' అని ఒకతను మూలికావైద్యం చేశాడు. మరికొందరు వేర్లు, ఇంకొందరు ఇతర మందులు ఇచ్చారు. 'ఆర్నెళ్లు ఆగితే తగ్గుతారు' అన్నారంతా. వైద్యులు ఇచ్చిన మందులను రాజుగారు తిన్నారు. అయినా బరువు తగ్గలేదు. ఆర్నెళ్లు కాదు కదా... మరో రెండు నెలలు ఎక్కువయినా బరువు తగ్గలేదు. దీంతో వైద్యులపై మండిపడ్డాడు. సైనికులను పంపి వైద్యులను తీసుకొచ్చి బంధించేశాడు. వైద్యులంతా లబోదిబోమని ఎంతో మొత్తుకున్నారు.



మరుసటి రోజు ఓ వైద్యుడికి ఈ విషయం తెలిసింది. రాజుగారి దగ్గరకు వచ్చారు. రాజుగారి వాలకం. బరువు చూశాడు. 'అయ్యా.. మీరు ఆర్నెళ్లలో చనిపోతారు' అన్నాడు. 'ఆర్నెళ్లలో చనిపోకపోతే నిన్ను చంపేస్తా' అన్నాడు కోపంగా. వెంటనే ఈ వైద్యున్ని కూడా ఖారాగారంకు పంపమని చెప్పాడు. నిర్దాక్షిణ్యంగా వైద్యులను బంధించకండి అంటూ మంత్రి సెలవు ఇచ్చినా రాజు కరుణించలేదు. ఆ రోజు రాత్రి రాజుకు నిద్రపట్టలేదు. నిజంగా ఆర్నెళ్లకు చనిపోతానా? అనే బాధ పట్టుకుంది. ఎంతో ఆలోచించాడు. వారం రోజుల తర్వాత తిండితిప్పలు తగ్గించాడు. మరణ భయం పట్టుకుంది మరింత. ఏమి చేయాలో అర్థం కావటం లేదు రాజుగారికి. తన సైన్యం, తన సంపదను పట్టించుకోలేదు. మరణం.. మరణం.. అనుకుంటూ మంచం మీద పడ్డాడు. అంతటి రాజుగారికి ఇలా అయిందని కుటుంబీకులు బాధపడ్డారు. చూస్తుండగానే ఆర్నెళ్లు గడిచిపోయాయి. రాజుగారు మంచంమీద అలానే ఉన్నారు.

'నేను ఆర్నెళ్లకు మరణిస్తాన'ని చెప్పిన వైద్యుడిని తీసుకురమ్మన్నాడు. వెంటనే ఇతన్ని నరికేయండి అన్నాడు. వెంటనే ఆ వైద్యుడు ఇలా అన్నాడు.. 'ఇంత మంది వైద్యులను బంధించావు. నీవు భోజన ప్రియుడివి కాబట్టి బరువు పెరిగావు. వాళ్ల వైద్యం నీ మీద పని చేయకపోతే ఇలా చేస్తావా? నేను ఒక్కమాట మాత్రమే అన్నాను. ఆర్నెళ్లకు చనిపోతావని అంటే.. బాధపడ్డారు. ముందు నన్ను చంపటం కంటే..మీరు ఇంత బరువు తగ్గటం చూసుకోండని వైద్యుడు చెప్పాడు. రాజుకు విషయం అర్థమైంది. ఇక నాకు జీవితం ఉందని అంటూ.. ఆ వెయ్యి వరహాలను ఆ వైద్యుడికి ఇచ్చాడు. 'నీ చమత్కారానికి ఈ బహుమానం' అన్నాడు రాజుగారు.. ఆ వైద్యున్ని చూస్తూ!







డైలీ సుడోకు - 226

		6	3		7		4	
			4	5	8			3
			6				1	
	2	8				3		5
	5	3				1	8	
7		9				4	2	
	8				6			
5			7	4	2			
	3		8		5	7		

సుడోకు - 225 సమాధానం

9	1	4	6	3	7	2	8	5
3	5	8	2	4	1	9	7	6
2	7	6	9	5	8	3	1	4
7	2	5	3	1	6	8	4	9
1	8	3	4	7	9	6	5	2
4	6	9	5	8	2	7	3	1
8	3	2	1	9	4	5	6	7
5	9	1	7	6	3	4	2	8
6	4	7	8	2	5	1	9	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.